ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 115 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శుక్రవారం 25 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

పేపర్ బ్యాలెట్.. ప్రసక్తే లేదు

ఈవీఎంలతోనే ఎన్నికల నిర్వహణ ◆ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యం ◆ తేల్చి చెప్పిన సీఈసీ సునీల్ అరోరా



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 24: పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించే ప్రసక్తే లేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సునీల్ అరోరా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు బదులు పేపర్ బ్యాలెట్ పత్రాలను మళ్లీ ప్రవేశపెట్టాలంటూ పలు ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను సునీల్ అరోరా గురువారం తోసిపుచ్చారు. 'పేపర్ బ్యాలెట్‌ను మళ్లీ ప్రవేశపట్టే ప్రసక్తే లేదు.. వెనక్కి వెళ్లటం అనేది కల్ల' అని ఆయన ప్రకటించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలనే కొనసాగిస్తామని గతంలోనే స్పష్టం చేశాం.. ఇక మీదట కూడా ఇదే నిర్ణయం అమలవుతుందని ఆయన తెగేసి చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల స్థానంలో మళ్లీ పేపర్ బ్యాలెట్ పత్రాల విధానాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్‌ను ఇకనైనా వదులుకోవాలని ఆయన పరోక్షంగా సూచించారు. పేపర్ బ్యాలెట్ పత్రాల గురించి ఎవరెన్నిసార్లు డిమాండ్ చేసినా కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మారదని అన్నారు. పలు ప్రతిపక్షాలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయను ప్రశ్నించటం తెలిసిందే. ఈవీఎంల ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేయవచ్చునంటూ సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీ, తెలుగుదేశం తదితర పార్టీలు ఇటీవల మరోసారి ఆరోపించి.. వీటి స్థానంలో పేపర్ బ్యాలెట్‌ను మళ్లీ ప్రవేశపట్టాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష పార్టీలు త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఈ మేరకు మరోసారి డిమాండ్ చేయనున్నాయి. ఈవీఎంల స్థానంలో పేపర్ బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టడం గురించి కేంద్ర ఎన్నికల సంఘంతో చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు నలుగురు సీనియర్ నాయకులతో ఒక కమిటీని ఏర్పాటు చేయటం తెలిసిందే. ఈ కమిటీ తమను కలిసి పేపర్ బ్యాలెట్ పత్రాల విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్

- మిగతా 6వ పేజీలో

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940

శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: బహుళ పంచమి రా.12.13
నక్షత్రం: ఉత్తర రా.10.14
శేషవర్జ్యం: ఉ.7.55 వరకు తిరిగి రా.తె.6.12 నుండి
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12 వరకు, తిరిగి మ.12.24 నుండి 01.12 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
విశేషాలు: శ్రీత్యాగరాజస్వామి ఆరాధన

దూసుకెళ్లిన పీఎస్ఎల్‌వీ సీ-44



సూళ్లూరుపేట, జనవరి 24: అంతరిక్ష పరిశోధనలో ఇస్రో మరో విజయాన్ని చేకూర్చుకుంది. పీఎస్ఎల్‌వీ సీ-44 రాకెట్‌ద్వారా గురువారం రాత్రి 11.37 నిమిషాలకు రెండు ఉపగ్రహాలను విజయవంతంగా రోదసిలోకి తీసుకెళ్లింది. వీటిలో ఒకటి మైక్రోశాట్ ఆర్‌కాగా, రెండోది విద్యార్థులు రూపొందించిన కలాంశాట్. వీటిలో మైక్రో శాట్ భూతలానికి సంబంధించిన ఛాయా చిత్రాలను పంపేందుకు ఉద్దేశించింది. రెండోది కమ్యునికేషన్ ఉపగ్రహం. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరిట విద్యార్థులే దీనికి రూపకల్పన చేశారు. శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి నాలుగు దశల పీఎస్ఎల్‌వీ ప్ర యోగం జరిగింది. ఈ సిరీస్‌లో ఇది 46వది.

చందా కొచ్చర్‌పై సీబీఐ కేసు

◆ ముంబయి, ఔరంగాబాద్ నివాసాల్లో సోదాలు



న్యూఢిల్లీ, జనవరి 24: నిబంధనలకు తిలోదకాలిచ్చి అక్రమ మార్గాల్లో బ్యాంకు రుణాలను మంజూరు చేసిన కేసులో ఐసీఐసీఐ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ దూత్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. చందా కొశ్చర్ చర్యల వల్ల ఐసీఐసీఐ బ్యాంకుకు రూ.1730 కోట్ల నష్టం వాటిల్లినట్లు బ్యాంకు అధికారులు చెప్పారు. సీబీఐ ఈ కేసుకు సంబంధించి ప్రస్తుత సీఈవో సందీప్ భక్షీ, ఇతర బ్యాంకు అధికారులు సంజయ్ చటర్జీ, జరీన్ దారువాలా, రాజీవ్ సబర్వాల్ కేవీ కామత్‌లను కూడా విచారించనుంది. బుధవారం కేసు నమోదు చేసిన సీబీఐ.. ముంబయి, ఔరంగాబాద్ తదితరచోట్ల కొచ్చర్ కుటుంబ సభ్యుల నివాసాల్లో సోదాలు నిర్వహించింది.



యాగం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న కేసీఆర్ దంపతులు

శతమానం భవతి

'ఎర్రవల్లి'లో ఆధ్యాత్మిక శోభ

❖ సీఎం దంపతులకు పండితుల దీవెనలు
❖ తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు

2

నేడే రెండో విడత పోలింగ్

❖ 3342 సర్పంచ్ స్థానాలు ❖ 26,191 వార్డులు
❖ 29,964 పోలింగ్ కేంద్రాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండో దశ పోలింగ్ శుక్రవారం నిర్వహిస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రెండో విడతలో పోలింగ్‌కోసం 29,964 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అలాగే 673 చోట్ల వెబ్‌క్యాస్టింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. మొత్తం 3342 పంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వాస్తవంగా

- మిగతా 6లో



యాదాద్రి భువనగిరి జిల్లాలో మోటకొండూరు నుంచి తరలివెలుతున్న సిబ్బంది



రాష్ట్రీయ బాలల పురస్కారాల ప్రదానోత్సవం అనంతరం ఓ చిన్నారితో ముచ్చటిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకా గాంధీ

మే 20న లాసెట్, 31న ఎడ్‌సెట్

కన్వీనర్ల భేటీ.. 'సెట్' తేదీల్లో స్వల్ప మార్పులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ ప్రవేశపరీక్షల నిర్వాహక కమిటీల చైర్మన్లు (వీసీలు), సెట్ కన్వీనర్ల భేటీని ఉన్నత విద్యా మండలి గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా మూడు ప్రవేశ పరీక్షలకు సంబంధించి మార్పులు చేసింది. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం లాసెట్‌ను మే 26న నిర్వహించాల్సి ఉండగా, దానిని మే 20వ తేదీకి ముందుకు తీసుకువచ్చారు. అలాగే పీజీ ఈసెట్‌ను మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించాలని భావించగా, పీజీ ఈసెట్‌ను మే 28, 29, 30 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఇక మే 30, 31 తేదీల్లో నిర్వహించాల్సిన ఎడ్‌సెట్‌ను మే 31వ తేదీన నిర్వహిస్తారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన సెట్ కమిటీల సమావేశానికి ఎమ్సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, చైర్మన్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ గోవర్ధన్, పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ రాజేశం, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ సాయన్న, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ జీ బీ రెడ్డి, చైర్మన్ ప్రొఫెసర్ సి రామచంద్రం, పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం కుమార్, ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టీ మృణాళిని హాజరయ్యారు. ఈ

- మిగతా 6లో

కూటమి కుదేలే!

ఒంటరిపోరుకే కాంగ్రెస్ నిర్ణయం ◆ ఏపీలోనూ పొత్తుల్లేవని ప్రకటన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 24: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ నాయకత్వంలో ఏర్పాటు చేయాలనుకున్న మహాకూటమి కుప్పకూలుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. లోక్‌సభతోపాటు నాలుగైదు రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ విధాన నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తృణమూల్ కాంగ్రెస్, బీఎస్పీ, సమాజ్‌వాదీ, తెలుగుదేశం లేకుండా జాతీయ స్థాయిలో మహాకూటమిని ఏర్పాటు చేయటం అర్థరహితమని అంటున్నారు. మహాకూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కూడా సాధ్యం కాకపోవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ మరికొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగనున్నది. ఆ లక్ష్యంతోనే ప్రియాంకా గాంధీని పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించి తూర్పు ఉత్తర ప్రదేశ్ బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభతోపాటు లోక్‌సభకు జరిగే ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తాం.. ఎవరితో ఎలాంటి పొత్తు ఉండదని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రకటించటం తెలిసిందే. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ ఊమన్ చాందీ పార్టీ అధినాయకత్వంతో చర్చించిన తరువాత పంపించిన సందేశం మేరకే



- మిగతా 6వ పేజీలో





యాగం వద్ద పూజలు చేస్తున్న కేసీఆర్, ఎంపీ కవిత. తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు

వేద మంత్రోచ్ఛారణలతో సాగిన యాగం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు ❖ హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు

సిద్దిపేట, జనవరి 24: తెలంగాణ రాష్ట్రం సిరిసంపదలతో విరజిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది..ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో నిర్వహిస్తున్న మహారుద్ర సహిత సహస్ర చండీయాగం గురువారం నాలుగో రోజు కొనసాగింది. వేద పండితుల పారాయణలు, రుత్వికుల మంత్రోచ్ఛరణలతో ఎర్రవల్లి భక్తిభావంతో అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం యాగశాలకు సతీసమేతంగా విచ్చేసిన సీఎం దంపతులు కేసీఆర్, శోభలు మొదటగా రాజశ్యామల మాత మంటపంలో పూజలు నిర్వహించారు. శ్రీ మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవిని సువర్ణ మంత్ర పుష్పాంజలి ఘటించారు. రాజశ్యామల మంటపంలో సీఎం దంపతులు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆనంతరం మహారుద్ర మండపంలోజరిగిన పూజల్లో సీఎం పాల్గొన్నారు. పంచాక్షరి జపంలో భాగంగా శివశివ శంకర భూత పతే, శంకర శివ, శంభో మహాదేవ, హరహర మహాదేవ అనే ప్రార్థనలతో యాగశాలలో మారుమోగాయి. బ్రహ్మస్వరూపిణి బగలాముఖి మంటపంలో సీఎం దంపతుల సమక్షంలో వేదపండితులు, రుత్వికులు పూజలు చేశారు. గౌరినారాయణ నమస్తుతే, పీతాంబర దేవి నమస్తుతే, జయతే, విజయతే, జయ విమలే బగలే అంటు దేవిని స్తుతించారు. శత మానం భవతే అంటూ వేద పండితులు కేసీఆర్ దంపతులను దీవించారు. నవగ్రహ మంటపంలో ఆదిత్య హృదయం పఠనం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో రాజరాజేశ్వరి మాత ప్రార్థన చేశారు. భువనేశ్వరి బ్రహ్మాండ కుటుంబినినీ, శ్రీ గణనాథ పార్వాతీ నందన, పాపవిమోచన అంటూ ప్రార్థనలు నిర్వహించారు. రుత్వికులు 400 సార్లు చండీ సప్తశతి పారాయణము పఠించారు. చండీయాగం వీక్షించడానికి వచ్చిన ప్రముఖులకు వేదపండితులు సుభాషితాలు, యాగ విశిష్టతను వివరించారు. మహాహారతితో ఉదయం పూట కార్యక్రమాలు ముగిసాయి. మధ్యాహ్నం తర్వాత రుత్వికులు వేద పారాయణలు, జపాలు చేశారు. శుక్రవారం నిర్వహించే మహాపూర్ణాహుతితో మహారుద్ర సహస్ర చండీయాగం పరి సమాప్తం కానుంది.


సిద్దిపేట ఎర్రవల్లిలో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న మహారుద్ర సహస్ర చండీయాగానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, ఎంపీలు కవిత, సంతోష్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీబీపాటిల్, బీ నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పారిశ్రామికాభివృద్ధి చైర్మన్ గ్యాదరి బాలమల్లు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మహారుద్ర చండీయాగం జరుగుతున్న దృష్ట్యా ఫామ్‌హౌజ్ పరిసర ప్రాంతంలో పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. సీపీ జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. శుక్రవారం మీడియాను అనుమతించలేదు. అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి పరిస్థితులు సమీక్షిస్తున్నారు. అనుమతి ఉన్న వారి వాహనాలను మాత్రమే చెక్‌పోస్టు నుండి పంపిస్తున్నారు. వివిధ ప్రాంతాల వారు అనుమతి లేకపోవటంతో వెనుదిరిగిపోయారు.

రక్షణరంగ సంస్థల ప్రైవేటీకరణతో ప్రమాదం

★ తక్షణం ఉపసంహరించుకోవాలి: తమ్మినేని


ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 24: దేశ రక్షణ రంగాలకు చెందిన పరిశ్రమల్లో బహుళజాతి సంస్థలకు అనుమతి ఇవ్వడానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తప్పుపట్టారు. ఈ ప్రయత్నాలను కేంద్రం తక్షణం ఉపసంహరించుకోవాలని గురువారం డిమాండ్ చేశారు. తమ్మినేని ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి తొందరపాటు చర్యగా పేర్కొన్నారు. రక్షణ రంగాలకు చెందిన పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇచ్చిన సమ్మె పిలుపునకు సీపీఎం మద్దతు ప్రకటించింది. మూడు రోజులుగా రక్షణ రంగాలకు చెందిన పరిశ్రమల వద్ద భారీ ఎత్తున ఉద్యోగులు ఆందోళనలో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ పేరుతో 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డీఆర్‌డీఓ ల్యాబ్, 9 ఆర్మీ వర్క్‌షాపులు, ఇంజనీరింగ్ సర్వీస్ వర్క్ షాపులు, డిఫెన్స్ ప్రొడెక్షన్, మిలటరీ ఫామ్ తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రక్షణ రంగాలకు సంబంధించిన పరికరాల ఉత్పత్తుల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు పటిష్టంగా ఉన్నప్పటికీ ప్రైవేట్ రంగాలకు అప్పజెప్పాలని ప్రయత్నించడం దుర్మార్గపుచర్యగా సీపీఎం నేత చెప్పారు. సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తే అందులో పని చేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ అంధకారం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీలు పరుస్తూ ప్రభుత్వ సంస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు.

ఓటర్స్‌డేకు మేం దూరం: చాడ

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 24: తెలంగాణలో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్స్ దినోత్సవంలో సీపీఐ పాల్గొనడం లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రకటించారు. ఎన్నికల దినోత్సవంలో పాల్గొనాలని ఈసీ అన్ని రాజకీయ పార్టీకు ఆహ్వానాలు పంపింది. ఈసీ ఆహ్వానాలపై సీపీఐ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయమని ఎన్నోసార్లు చెప్పామని, తప్పులుదొర్లినట్టు ఈసీ కూడా ఒప్పుకున్నట్లు బహిరంగ ప్రకటనలు ఇచ్చిన విషయాన్ని చాడ గుర్తు చేశారు. అయినా కమిషన్ తప్పులను సరిదిద్దలేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని ఆయన అన్నారు. ఓటర్ నమోదుకు స్పష్టమైన విధానాలు లేకపోవడం, వీటిని అన్ని రాజకీయ పార్టీలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఫిర్యానులు చేసినా ఫలితం లేదన్నారు. తెలంగాణలో 22 లక్షల నుంచి 30 లక్షల వరకు ఓట్ల గల్లంతయ్యాయని ఈసీనే చెప్పడం జరిగిందన్నారు.జాబితాలో తప్పుల వల్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందని చాడ అన్నారు. ఈ తప్పులకు ఎవరు బాధ్యులో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఏకపక్ష, నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఓటర్ల దినోత్సవంలో పాల్గొనడంలేదని సీపీఐ నేత స్పష్టం చేశారు.

ఎన్నికల అక్రమాలపై కాంగ్రెస్ నేతల పిటిషన్

హైకోర్టును ఆశ్రయించిన రేవంత్, డీకే అరుణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ టీఆర్‌ఎస్ అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, దాసోజు శ్రవణ్ పిటిషన్లు దాఖలు చేశారు. కొడంగల్ నుంచి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన పట్నం నరేందర్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కొడంగల్‌లో చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే తాను ఘన విజయం సాధిస్తానని ఆయన పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని పిటిషన్‌లో తెలిపారు. అలాగే అనేక అక్రమాలకు పాల్పడ్డారని రేవంత్ ఆరోపించారు. కొడంగల్‌లో తాత్కాలికంగా నివాసం ఉంటున్న నరేందర్‌రెడ్డి వద్ద రూ 17.50 కోట్ల రూపాయలు ఆదాయపన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఆయనీ సందర్భంగా గుర్తుచేశారు. భారీగా నగదు పట్టుబడినప్పటికీ నరేందర్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. కొండంగల్ నియోజక వర్గంలో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి కోట్లాది రూపాయలు చెల్లించారని కాంగ్రెస్ నేత ఆరోపించారు. మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల పోలీస్ సూపరింటెండ్‌ట్‌లకు లక్షలాది రూపాలు ఎరేశారని ఆయన అన్నారు. కానిస్టేబుల్, హోంగార్డుల మొదులుకుని ప్రతి పోలీస్ ఉద్యోగికి డబ్బులు పంపిణీ చేశారన్నారు. ఎన్నికల సందర్భంలో కొన్ని మీడియా సంస్థలు టీఆర్‌ఎస్‌కు అనుకూలంగా పని చేశాయంటూ, వాటికి సంబంధించిన క్లిప్పింగ్‌లు కోర్టుకు సమర్పించారు. తనపట్ల తప్పుడు చెడుగా కథనాలు ప్రచారం చేశాయన్నారు. తెలంగాణ ఆపధర్మ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పిటిషన్‌లో ఆరోపించారు. కాగా గద్వాల, ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసిన డీకే అరుణ, దాసోజ్ శ్రావణ్ కూడా తమ నియోజక వర్గాల్లో ఎన్నికల అక్రమాలు జరిగాయని కోర్టును ఆశ్రయించారు.

సీఈవో రజత్‌ను తప్పించాలి

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో వైఫల్యం ❖ ఈసీ వైఖరికి నిరసనగా కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, టీజేఎస్ ధర్నా

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణతో పాటే శాసన సభ ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో వీవీ పాట్ స్లిప్‌లను లెక్కించగా ఒక్క తెలంగాణలోనే ఎందుకు లెక్కించలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమీషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల కమీషన్ వైఫల్యాలను నిరసిస్తూ ఇందిరాపార్క్ వద్ద గురువారం కాంగ్రెస్, టీడీపీ, సీపిఐ, టీజెఎస్ పార్టీలు సంయుక్తంగా ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, స్వల్పతేడాతో ఓడిపోయిన అభ్యర్థులు పోలింగ్ రోజుననే ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేసినా ఎన్నికల కమీషన్ స్పందించలేదన్నారు. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయగా ఇతర రాష్ట్రాల్లో వీవీ పాట్స్‌ను లెక్కించినప్పుడు ఒక్క తెలంగాణలోనే లెక్కించకపోవడం వెనుకనున్న ఆంతర్యం ఏమిటనీ ఉత్తమ్‌కుమార్ ప్రశ్నించారు. పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఉందని ఆయన ఆరోపించారు. ఓటర్ల జాబితా నుంచి ఓటర్ల తొలగింపుపై తమ పార్టీ నాయకుడు మర్రి శశీధర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా జరిగిన పొరపాట్లను సరిచేస్తామని ఎన్నికల కమీషన్ కోర్టుకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసిన రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ప్రజాస్వామ్యంపై గౌరవాన్ని పెంచే విధంగా ఎన్నికల కమీషన్ నడుచుకోవాలన్నారు. ఈవీఎంలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమౌవుతోన్న నేపథ్యంలో ఇక నుంచి జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలనే ఉపయోగించాలని టీపీసీసీ డిమాండ్ చేస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోర్టుకు ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోకుండా, ఓటర్ల జాబితా సవరించకుండానే ఎన్నికలు నిర్వహించిందని విమర్శించారు. ఇప్పటికైనా పదివేల ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో వీవీ పాట్స్‌ను లెక్కించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమీషన్ వైఫల్యం చెందిందని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణలో రాజ్యాంగ వ్యవస్థలన్ని నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహించడంతో ఎక్కడా ఆరోపణలు రాలేదన్నారు. ఫోన్లు, ఈవీఎంల ట్యాంపరింగ్‌నే సీఎం కేసీఆర్ నమ్ముకున్నారని విమర్శించారు. ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌తో జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని ఎల్ రమణ అన్నారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో అందరికి ఓటు హక్కు ఉన్నా తెలంగాణలో మాత్రం 22 లక్షల మందికి ఓటు హక్కు లేదన్నారు. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడా ఎలా



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

వచ్చిందని కోదండరామ్ ప్రశ్నించారు. ఓట్ల లెక్కింపులో ఒక్క ఓటు కూడా తేడా రావద్దనీ, అయితే ఏకంగా 31 నియోజకవర్గాల్లో తేడాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. ఓటర్లకు డబ్బు పంపిణీ కోసం ప్రభుత్వ యంత్రాంగగాన్నే ఉపయోగించుకుందని కోదండరామ్ ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఓట్ల గల్లంతు క్షమించరాని తప్పిదమన్నారు. ఓట్ల గల్లంతుకు కారణమైన బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని చాడా ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్ పూర్తిగా టీఆర్‌ఎస్ కనుసన్నలల్లోనే పని చేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల వల్ల జరుగుతున్న మోసాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఆందోళనకు సిద్ధం కావాలని చాడా పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి హనుమంతరావు, డికె అరుణ, దాసోజు శ్రవణ్ ప్రసంగించారు.

ఫారెస్టు రేంజర్ల ఎంపిక

66 మందికి ఉత్తర్వులు ★ 21 మంది మహిళలు ఎంపిక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నిర్వహించిన రిక్రూట్‌మెంట్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ 66 మంది ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లను ఎంపిక చేసింది. కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి పీకే ఝూ నియామకపత్రాలను అందజేశారు. అరణ్యభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అభ్యర్థులను ఆహ్వానించి అటవీ అధికారులు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. కొత్తగా ఎంపికైన 66 మందిలో 21 మంది మహిళలు ఉండటం ఈసారి విశేషం. వీరికి 18 నెలల పాటు శిక్షణ అందజేయనున్నారు. ఇందులో 41 మందికి అస్సాంలోనూ, 25 మందికి కర్నాటక ధార్వాడ్‌లోనూ శిక్షణ ఇవ్వనున్నారు. వీరందరికీ ఫిబ్రవరి రెండోవారంలో శిక్షణ మొదలవుతుందని అటవీ అధికారులు చెప్పారు. ఏ ప్రభుత్వమూ ఇవ్వని ప్రాధాన్యత అడవులకు ప్రస్తుత ప్రభుత్వం ఇస్తోందని, నిబద్ధతతో పనిచేసి రాణించాలని పీసీసీఎఫ్ పీకే ఝూ అన్నారు. ఉద్యోగ నియామకాలపై అభ్యర్థులు హర్షం ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేస్తామని వారు వెల్లడించారు ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఉన్నతాధికారులు రఘువీర్, పృధ్వీరాజ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో ‘యూనిగేజ్’ ఎంట్రెన్స్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: దేశవ్యాప్తంగా ఉన్న 180 ఉన్నత సాంకేతిక విద్యాసంస్థల్లోనూ, 21 యూనివర్శిటీల్లోనూ బిఈ, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు యూనిగేజ్ ప్రవేశపరీక్షను మే 12న నిర్వహిస్తున్నట్టు సీఓఎంఈడీకే ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ కుమార్ తెలిపారు. గురువారం నాడు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జేఈఈ తర్వాత అంత భారీ ఎత్తున జరుగుతున్న రెండో జాతీయ స్థాయి ప్రవేశపరీక్ష తాము నిర్వహించేదని అన్నారు. 140 పట్టణాల్లో 400 టెస్టు సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఎరా ఫౌండేషన్ సీఈఓ పీ మురళీధర్ మాట్లాడుతూ ఈసారి మరింత మంది ఈ ప్రవేశపరీక్షలో చేరేలా చూడాలని భావిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా తాము నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా దాదాపు 40వేల సీట్లను భర్తీ చేస్తారని చెప్పారు. సీఓఎంఈడీకే ద్వారా కర్నాటకలో పరీక్షలను గత 14 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు యూనిగేజ్ డాట్ కామ్ లేదా సీఓఎంఈడీకే డాట్ ఆర్గ్ అనే వెబ్ పోర్టల్స్‌లో ఏప్రిల్ 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

1 నుంచి నెక్లెస్‌రోడ్‌లో జాతీయ మత్స్య ప్రదర్శన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు నేతృత్వంలో హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ‘నేషనల్ ఫిష్ ఫెస్టివల్’ను ఏర్పాటు చేస్తున్నారు. 2019 ఫిబ్రవరి 1 నుండి 3 వరకు ఈ ఫెస్టివల్ ఉంటుంది. మన దేశంలో ప్రస్తుతం 6 శాతం మంది మాత్రమే చేపలను ఆహారంగా తీసుకుంటున్నారు. మంచిపోషకాలున్న చేపలను ఎక్కువ మంది వినియోగించాలన్నదే ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఉద్దేశమని బోర్డ్ సీఈఓ ఐ. రాణికుముదిని గురువారం ఇక్కడ పేర్కొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు

రాష్ట్రంలో క్లస్టర్లు ఏర్పాటు

పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సిద్ధం చేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చింతా సాంబమూర్తి పేర్కొన్నారు. ప్రధానకార్యదర్శి పన్నాల రాములు, కార్యదర్శి జాజుల గౌరీ, కార్యవర్గ సభ్యుడు కర్నాటి ధనుంజయలతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికలకు తెలంగాణలోని 17 పార్లమెంటరీ నియోజకవర్గాలను ఆరు క్లస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు భారీ సభలను నిర్వహిస్తామని, ఆరు క్లస్టర్లలో పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీలను పార్టీ నియమిస్తుందని అన్నారు.వన్నాల శ్రీరాములును బీజేపీ జాతీయ ఓబీసీ కమిటీ సభ్యుడిగా కర్నాటక రాష్ట్ర ఓబీసీ మోర్చా ఇన్‌ఛార్జిగా నియమించిందని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలను ఆరు క్లస్టర్లుగా విభజించామని అన్నారు. ఈ సందర్భంగా వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ 52 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తోందని అన్నారు. ఇది కేవలం ఎన్నికల సమయంలో పలికే చిలుక పలుకులు తప్ప వేరేమీ కాదని అన్నారు. ఎందుకంటే 70 సంవత్సరాలుగా స్వాతంత్ర్య దేశంలో ఎన్నడూ ఓబీసీల గురించి మాట్లాడలేదని, 1952లో నెహ్రూ ప్రధానిగా ఉన్నపుడు వేసిన కాకా కాలేల్కర్ ఓబీసీ కమిషన్ రిపోర్టు ఇచ్చినా బుట్టదాఖలు చేశారని అన్నారు. అటల్ బిహారి వాజపేయి ప్రధానిగా ఉన్నపుడు ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించాలని సంకల్పించి కమిషన్ వేయడం జరిగిందని వారు చెప్పారు.


భారతమాత మహాహారతికి ఏర్పాట్లు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: రాజధానిలోని నక్లెస్ రోడ్‌లో ఈ నెల 26వ తేదీన నిర్వహించే భారత మాత మహా హారతి కార్యక్రమ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు బీజేపీ నేత జీ కిషన్‌రెడ్డి చెప్పారు. పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే ఈ కార్యక్రమానికి గణపతి పూజ చేసి ఏర్పాట్లు ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర రాష్ట్రాల నుండి అనేక మంది హాజరవుతున్నారని ఆయన చెప్పారు. చాగంటి ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సప్త హారతులు, సంగీత కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. గత ఏడాది కంటే కొంత ఆలస్యంగా ఈ కార్యక్రమం ప్రారంభం అయిందని అన్నారు. శుక్రవారం నాడు ప్రసాద్ ఐమాక్స్ నుండి భారతమాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ట చేస్తామని చెప్పారు. గణపతి పూజ కార్యక్రమానికి కిషన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 1500 మంది భాతరమాత వేషధారణలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇంకా చాలా మంది విద్యార్థులు తమ ఆసక్తిని ప్రదర్శించారని,అయితే తాము వారిని స్థలాభావం వల్ల అనుమతించలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలు స్కూళ్లు, కాలేజీల నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. బీజేపీ నేత శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మహాహారతి కార్యక్రమానికి పక్కా ఏర్పాట్లు జరిగాయని న్నారు. గత ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అన్నారు. శుక్రవారం నాడు భారతమాత విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని చెప్పారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: రాష్ట్రస్థాయిలో ‘జాతీయ ఓటర్ల దినోత్సవా’న్ని శుక్రవారం హైదరాబాద్ (రవీంద్రభారతి) లో నిర్వహిస్తున్నామని చీఫ్ ఎలక్టోరల్ అధికారి డాక్టర్ రజత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర మంతటా ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. రవీంద్రభారతిలో జరిగే ప్రధాన కార్యక్రమంలో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారు. ఉదయం 10.45 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం 11.30 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. ఇలా ఉండగా రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు, చిరునామాలు ఎవరివైనా మారి ఉంటే సవరణలు చేసుకునేందుకు, వివిధ కారణాల వల్ల ఓటర్ల జాబితాల నుండి పేర్లను తొలగించేందుకు శుక్రవారం వరకు ఉన్న గడువును 2019 ఫిబ్రవరి 4 వరకు పొడిగించారు. అంటే 2018 డిసెంబర్ 31 వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. అలాగే గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు ఉండి, వివిధ కారణాల వల్ల పేర్లు తొలిగిపోయి ఉంటే వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించింది. ఫిబ్రవరిలో తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

శాసన సభాపతి ఇలాకాలో ఏకగ్రీవాల జోరు

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 24: రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న బాన్సువాడ నియోజకవర్గం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తన దైన ప్రత్యేకతను చాటుకుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఏకగ్రీవాలు నమోదైన సెగ్మెంట్‌గా ఘనతను దక్కించుకుంది. బాన్సువాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 124 గ్రామ పంచాయతీలకు గాను నామినేషన్ల ఘట్టం ముగిసేసరికే 47 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవడం విశేషం. అంటే దాదాపు 38శాతం సచివాలయాలకు పోలింగ్ అవసరం లేకుండానే పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. బాన్సువాడ మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 13 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీర్కూర్ మండలంలో 12 జీపీలకు గాను ఆరు చోట్ల, వర్నిలో 32 జీపీలలో 11 గ్రామ పంచాయతీలకు, కోటగిరిలో 28సచివాలయాలకు గాను 12 జీపీలలో, నస్రుల్లాబాద్‌లో 17 గ్రామ పంచాయతీలకు గాను నాలుగు స్థానాల్లో, రుద్రూర్‌లో 10 జీపీలకు గాను ఒక చోట పాలకవర్గాలను సమిష్టి నిర్ణయంతో స్థానికులు ఏకగ్రీవంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ దిశగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడం ఫలితాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండే పల్లె పోరుపై పోచారం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ వచ్చారు. సాధ్యమైనంత మేర ఎక్కువ సంఖ్యలో ఏకగ్రీవాలు నమోదు చేయాలనే పట్టుదలను ప్రదర్శిస్తూ పావులు కదిపారు. పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచేందుకు సాధారణంగా తెరాస శ్రేణులే ఎక్కువగా ఆసక్తి కనబర్చడంతో వారిని పిలిపించుకుని చర్చలు జరుపుతూ అందరి ఆమోదం మేరకు ఏకగ్రీవంగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఎన్నుకునేలా కృషి చేయడంతో బాన్సువాడ నియోజకవర్గం ఏకగ్రీవాల నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అన్నింటికి మించి ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం పది లక్షల రూపాయల ప్రోత్సాహకాన్ని అందజేయనుండగా, నియోజకవర్గ కోటా నిధుల నుండి ఏకగ్రీవ జీపీలకు మరో పది లక్షల రూపాయల వంతున తాను నిధులు సమకూరుస్తానని పోచారం ప్రకటించడం జరిగింది. దీంతో భారీగా సమకూరే నిధులతో పల్లెలను ప్రగతి పథం దిశగా పరుగులు పెట్టించవచ్చనే ఉద్దేశ్యంతో ఆయా గ్రామాల ప్రజలంతా సమిష్టి నిర్ణయాలతో ఏకగ్రీవ ఎన్నికలకు ముందుకు వచ్చారని స్పష్టమవుతోంది. ఈ డివిజన్‌లో గ్రామాభివృద్ధి కమిటీల పెత్తనం వంటి వాటికి సైతం అంతగా ఆస్కారం లేనందున ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగిన జీపీలలో అధికారుల విచారణలోనూ గ్రామస్థులు స్వచ్ఛందంగానే ఏకగ్రీవంగా పాలకవర్గాలను నియమించుకున్నట్టు వెల్లడి కానుంది.

వలస ఓటర్లే కీలకం

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 24: గ్రామపంచాయతీ ఎన్నికల్లో వలస ఓటర్లే కీలకమయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామాల్లో గెలుపోటములు వలస ఓటర్ల చేతుల్లో ఉంది. దీనిని పసిగట్టిన అభ్యర్థులు వలస ఓటర్లను తమకు ఓటు వేయించుకోవాలని అనేక ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రజలు తమ జీవితాలను చక్కదిద్దుకుంటూ కూలీనాలి పని చేస్తూ పొట్ట నింపుకొంటున్నారు. అయితే, ప్రతిసారి ఎన్నికలు వస్తే జిల్లాలోని నాయకులు వలస కూలీల ఓటర్ల కోసం వల వేస్తారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం అదే తంతు కొనసాగుతుంది. రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ మని కొన్ని గంటల సమయంలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుండి వలస వెళ్లి ప్రజలు పెద్దఎత్తున సొంత గ్రామాలకు తరలివస్తున్నారు. అయితే పలు గ్రామాల్లో వీరి ఓట్లు కీలకం కావడంతో ఎవరైతే ముందుగా వెళ్లి వారిని ఆశ్రయిస్తారో

స్వ గ్రామాలకు తరలివస్తున్న ఓటర్లు

వారికి పక్కాగా ఓటు పడినట్లేనని భావించిన అభ్యర్థులు ఓటర్ల కోసం ప్రత్యేకంగా వాహన సౌకర్యాలు సైతం చేస్తున్నారు. ఇప్పటికే పల్లెల్లోకి వలస ఓటర్లు రావడంతో వలస వెళ్లి జనం లెక వెలవెల పోయిన గ్రామాలు ప్రస్తుతం ఎన్నికల పుణ్యమాఅంటూ వలస కూలీలు సొంత గ్రామాలకు తరలిరావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. అయితే రెండవ విడత ఓట్లు ముగిసిన వెంటనే తిరిగి వారు కూలీ పనులు చేసుకునే దగ్గరకు వెళ్లేందుకు సైతం ఏర్పాట్లు చేశారు. నూతనంగా ఏర్పాటు అయిన గ్రామపంచాయతీలో వార్డు సభ్యుల గెలుపులో వలస కూలీల ఓటర్లు మరింత కీలకంగా మారారు. ఈ విషయం మొదటి విడత ఎన్నికల్లో తేటతెల్లమైంది. ప్రతి గ్రామంలో వలసలు వెళ్లిన వారి వివరాలను తెలుసుకుని వారి ఓట్లను ఎలాగైనా వేయించుకోవాలని చూస్తున్నారు. దాదాపు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పదివేలకు తక్కువ కాకుండా వలస వెళ్లిన ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో కంటైనర్ దగ్ధం

★ డ్రైవర్ మృతి



దగ్ధమవుతున్న కంటైనర్ మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


సదాశివపేట, జనవరి 24: వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు వెనక్కు తీసుకుంటున్న క్రమంలో హైటెన్షన్ వైర్లను తాకడంతో విద్యుదాఘాతం సంభవించి కంటైనర్‌కు నిప్పంటుకోగా, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం అంకెనపల్లి గ్రామ శివారులోని ఎంఆర్‌ఎఫ్ వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం తమిళనాడుకు చెందిన కంటైనర్ స్థానిక ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమకు రవాణా వస్తువులను తీసుకుని వచ్చింది. వస్తువులను ఖాళీ చేసేందుకు సమయం ఉన్నందున అక్కడే ఉన్న పార్కింగ్ స్థలంలోకి డ్రైవర్ మరియప్ప (35) కంటైనర్‌ను తీసుకువెళ్లాడు. వాహనాన్ని వెనక్కు తీసుకుని పార్కింగ్ చేస్తుండగా అక్కడే ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు కంటైనర్‌కు తగలాయి. ఈ సంఘటనతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ రావడంతో స్టీరింగ్ సీట్లోంచి ఎగిరి కింద పడిన మరియప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా విద్యుత్ వైర్ల నుంచి చెలరేగిన మంటలతో కంటైనర్ వెనక టైర్లకు నిప్పంటుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటంతో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పివేసారు.

నిప్పంటుకున్న కంటైనర్ ప్రక్కనే పార్కింగ్ చేసిన ఇతర వాహనాలను హుటాహుటిన అక్కడి నుంచి తప్పించడంతో భారీ ఆస్తి నష్టం తప్పింది. డ్రైవర్ మరియప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలా.. కురుక్షేత్ర యుద్ధమా..?

ప్రశ్నించిన ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ

కామారెడ్డి, జనవరి 24: గ్రామ పంచాయతీ ఎన్నికలు కురుక్షేత్రాన్ని తలపిస్తూ.. కౌరవులకు, పాండవులకు మధ్య జరిగినట్లు ఉన్నాయని ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ అన్నారు. గురువారం ఆయన కామారెడ్డి సెగ్మెంట్‌లో కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లను సన్మానించడంతో పాటు అభినందించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో బాగా పనిచేసి మంచి పేరు సంపాదించాలని సర్పంచ్‌లను కోరారు. తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మీకు అండగా ఉంటానని అన్నారు. ఈవిఎంల ద్వారా ట్యాంపరింగ్ జరిగిందని లండన్ మొదలుకుని అంతటా ఇదే చెప్తున్నారని అన్నారు. లండన్‌ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈవిఎంల ట్యాంపరింగ్ జరిగిందని రుజువు చేశారని అన్నారు. ప్రజలకు ఈవిఎంలపై నమ్మకం లేదని, చాలా అపోహలు ఉన్న ఇవిఎంలను వెంటనే రద్దు చేసి ఎన్నికల కమిషన్ సైతం బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఈ విషయాన్ని సీరియస్‌గా ఆలోచించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి ప్రాంతాల్లో ఇంకా బ్యాలెట్ విధానం కొనసాగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు ఇక్కడ కూడా అదే విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని ప్రజల నిర్ణయాన్ని వ్యతిరేకించరాదని అన్నారు. ఈవిఎంలపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ పునరాలోలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కాంగ్రెస్ టీపీసీసీ నాయకుడు వేణుగోపాల్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లు పాల్గొన్నారు.


కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లను కామారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో అభినందిస్తున్న ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ

భవనం పైనుంచి పడి విద్యార్థి మృతి

ప్రైవేట్ పాఠశాలలో విషాదం • ఆలస్యంగా గమనించిన పాఠశాల సిబ్బంది • విద్యార్థి సంఘాల ఆందోళన


విద్యార్థి యశ్వంత్ మృతదేహం, రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాలు

కరీంనగర్ టౌన్, జనవరి 24: జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం విషాదం చోటు చేసుకుంది. పాఠశాలకు అనుబంధంగా కొనసాగుతున్న వసతిగృహం భవనం పైనుంచి కిందపడి ఓ విద్యార్థి మృతి చెందగా, ఆలస్యంగా గమనించిన పాఠశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని ఆస్పత్రికి తరలించిన ఘటన నగర శివారులోని ఆ పాఠశాల పద్మనగర్ శాఖలోజరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పారామిత విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో జగిత్యాల జిల్లా మోతె గ్రామానికి చెందిన గొల్లెయశ్వంత్ అనే విద్యార్థి ఆవాస విద్యార్థిగా విద్యనభ్యసిస్తున్నారు. 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి గురువారం ఉదయం వేకువ జామున 5.20గం.ల ప్రాంతంలో నిద్రలేచి వసతి గృహంలోని 6వ అంతస్తు పైకివెళ్ళి, అక్కడి నుంచి కిందికి దూకటంతో పక్కనే ఉన్న నీటి సంపులో పడ్డాడు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో గమనించిన పాఠశాల సిబ్బంది, యాజమాన్యానికి తెల్పినట్లు తెలుస్తోంది. యాజమాన్య ప్రతినిధులు అక్కడికి చేరుకుని విద్యార్థిని సంపులోనుంచి పైకి తీయగా, అప్పటికే మరణించినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. మృతదేహం పాఠశాల ఆవరణలో ఉంటే ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా వెంటనే ఆస్పత్రికి తరలించి, అంబులెన్సులోనే విద్యార్థి శవాన్ని ఉంచి, యాజమాన్యం అక్కడి నుంచి జారుకున్నట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విషయం తెల్సుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరితోపాటు ఫీజుల చెల్లింపులు, అర్ధరాత్రుల వరకు ప్రత్యేక తరగతుల పేర చేస్తున్న ఒత్తిళ్ళ మూలంగానే బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, విద్యార్థి యశ్వంత్ మృతికి కారణమైన పారామిత పాఠశాల గుర్తింపు రద్దుచేస్తూ, విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేపట్టారు. విషయం తెల్సుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని విగతజీవిగా మారిన తమ కుమారున్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. కాగా, విద్యార్థి మృతి పట్ల అనుమానాలు పలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం 5.15గంటల ప్రాంతంలో విద్యార్థి లిఫ్ట్ వద్ద కెళ్తున్నా, విద్యార్థుల గదిలో ఉన్న హాస్టల్ వార్డెన్ ఎందుకు పట్టించుకోలేదు? ఆరో అంతస్తు పైనుంచి సెక్యూరిటీ గదికి కేవలం రెండు గజాల దూరంలోనే ఉన్న సంప్‌పై దూకిన సందర్భంలో భారీ స్థాయిలో శబ్దం వచ్చినా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వినపడలేదా? ఇద్దరు వ్యక్తులు భద్రత విధుల్లో ఉన్నా గమనించలేదా? సంఘటనాస్థలాన్ని సిపి విబి కమలాసన్‌రెడ్డి సందర్శించి, ప్రత్యక్షసాక్షులను వివరాలడిగి తెల్సుకున్నారు. పాఠశాల పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విద్యార్థి మరణించిన విషయం తెల్సుకున్న జిల్లా విద్యాశాఖ పాఠశాలలో విద్యార్థి స్నేహితులు, ఉపాధ్యాయులను కలిసి సంఘటన జరిగిన తీరుపై వివరాలు రాబట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు.

కూలీల చేతుల్లో కొండ చిలువ హతం

ఆర్మూర్, జనవరి 24: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఓ పసుపు తోటలో కనబడిన ఎనిమిది అడుగుల కొండ చిలువను గురువారం కూలీలు చంపారు. గ్రామంలోని రాములుకు చెందిన తోటలో పసుపు తవ్వడానికి వచ్చిన కూలీలకు కొండ చిలువ కనబడింది. అందులో నర్సయ్య అనే వ్యక్తి వెంటనే తేరుకొని అక్కడే ఉన్న కట్టెను తీసుకువచ్చి కొండ చిలువను చంపేశారు. సుమారు 8 అడుగుల పొడవు గల కొండ చిలువను చంపేయడంతో గ్రామ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అంకాపూర్ గ్రామ పంచాయతీ వద్ద నుంచి బైపాస్ రోడ్డు ద్వారా ఆర్మూర్‌కు వచ్చే జాతీయ రహదారి పక్కనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దారి గుండా వెళ్లే వారందరూ చంపేసిన కొండ చిలువను తిలకించారు. సెల్‌ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.


అంకాపూర్‌లో కొండ చిలువను చంపిన దృశ్యం

మావోల హల్‌చల్!

భూపాలపల్లి జిల్లా వెంకటాపురం-చర్ల మార్గంలో బ్యానర్లు, కరపత్రాలు • 31న బంద్ జయప్రదానికి పిలుపు • ప్రొక్లైనర్ దగ్ధం

వెంకటాపురం (నూగూరు), జనవరి 24: భూపాలపల్లి జిల్లా వెంకటాపురం - చర్ల జాతీయ రహదారి పక్కన గురువారం రాత్రి మావోయిస్టు హల్‌చల్ చేశారు. చెరువు పనుల నిమిత్తం వచ్చిన ప్రొక్లైనర్‌ను తగలబెట్టి బ్యానర్లను, కరపత్రాలను అక్కడ వదిలివెళ్లారు. సామ్రాజ్యవాద భూస్వామ్య వర్గాలకు సేవ చేసే పెత్తందారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జాతి విముక్తికి జనవరి 31న జరిగే బంద్‌కు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కరపత్రాల్లో పేర్కొన్నారు. సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో వెలసిన బ్యానర్‌లో సామాజిక రాజకీయ కార్యకర్తలను, ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమాధాన్ వ్యూహాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు.



మావోయిస్టులు వదిలివెళ్లిన బ్యానర్
దగ్ధం చేసిన ప్రొక్లైనర్

బ్యాలెట్ బాక్స్‌లకు ప్రత్యేక భద్రత

శుక్రవారం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనుండగా గురువారం రాత్రి మావోయిస్టులు ప్రొక్లైనర్ తగలబెట్టి బ్యానర్లు కట్టడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన వెంకటాపురం మండలంలో పోలీసు ఉన్నతాధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. 32 పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న బ్యాలెట్ బ్యాక్స్‌లు, బ్యాలెట్‌లు ఎన్నికల సామాగ్రికి ప్రత్యేక భద్రత కల్పించేందుకు పోలీసులు, అధికారులు అందుబాటులో ఉన్న సౌకర్యాలతో పకడ్బందీ వ్యూహంతో భద్రత కల్పించాలని ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఒక పక్క మావోయిస్టులు హల్‌చల్‌తో శుక్రవారం జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయోనని, తమ ఉనికిని కాపాడుకునేందుకు ఏమైనా దుశ్చర్యలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగిన విధంగా పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ప్రతిష్టమైన భద్రతతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

PUBLIC NOTICE

BEFORE THE NATIONAL COMPANY LAW TRIBUNAL, HYDERABAD BENCH
COMPANY PETITION (IB) No. 586/9 of 2018
(Under section 9 of the Insolvency and Bankruptcy Code, 2016 read with rule 6 of the Insolvency and Bankruptcy (Application to Adjudicating Authority) Rules, 2016)

M/s. Vardhman Cables and Conductors
................Operational Creditor
Versus
M/s. Gowthami Infratech Pvt. Ltd.
...............Corporate Debtor

To,
M/s. Gowthami Infratech Private Limited
.... Corporate Debtor.

You are hereby summoned to appear in this Petition on 05th February, 2019 in National Company Law Tribunal at Hyderabad bench in Court Room No. 02 at 11.00 am in person or by an advocate and able to answer all material questions relating to the dispute, or who shall be accompanied by some other person able to answer the above named Operational Creditor and as the day fixed for your appearance is appointed directions, you must produce all your witnesses on that day and you are hereby required to take notice that in default of your appearance on the day before mentioned, the Petition will be heard and determined in your absence; and you will bring with your or send your Advocate with any document/s in your possession or power containing evidence relating to the merit of the Operational Creditor's case or upon which you intend to reply in support of your case :-

Sd/- K.K. ASSOCIATES
201/202, The Big Three Building,
2nd Floor, 88, Anandilal Poddar Marg,
New Marine Lines, Mumbai 400 002.
Ph : +91 22220 13730 / +91 22220 13748

లింగాలవాసికి ఐక్యరాజ్యసమితి ఆహ్వానం

లింగాల, జనవరి 24: ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన గిరిజన యువకుడు మోట వీర్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. హైదరాబాద్ కేంద్రంగా స్కైలార్క్ మెడికల్ ఇండియా సంస్థ పేరుతో వివిధ ప్రాంతాలలో నిర్వహించిన సేవా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం ఇతన్ని వరించింది. లింగాలలో ఓ పేద గిరిజన కుటుంబంలో పుట్టిన వీర్‌కుమార్ అంచలంచెలుగా ఎదిగి తమ సంస్థ ద్వారా ఆసియా ఖండంలోలేని విధంగా డాక్టర్లకు ఉన్నత చదువులకై సూచనలు, సలహాలు ఇవ్వడం, వివిధ అంశాలలో పరిశోధనలను చేయించడం, నూతన ఆవిష్కరణలు కనుగొనడం జరిగింది. గాంధీ మెడికల్ ఆస్పత్రి హైదరాబాద్‌లో అరుదైన వ్యాధి సోగ్రాన్ సిండ్రోమ్ అనే వ్యాధిపై అవగాహన కల్పించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులను సైన్స్ విద్య పట్ల అందులో ఖగోళ శాస్త్రాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువచేసే కార్యక్రమాలను గ్రామీణ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్నారు. వివిధ చెంచుపెంటలు, పాఠశాలలో తమ సంస్థ డాక్టర్లచే వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. అంతరించిపోతున్న తోలుబొమ్మలాటను వెలుగులోకి తెచ్చి దానితో సులువైన రీతిలో గ్రామీణ విద్యార్థులకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించడంతో గుర్తించిన ఐక్యరాజ్య సమితి స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఈనెల 25న జరిగే సదస్సులో ప్రసంగించేందుకు అవకాశాన్ని కల్పిస్తూ ఆహ్వానాన్ని పంపించడం జరిగింది. వీర్‌కుమార్‌కు ఈ అరుదైన అవకాశం కల్పించడం పట్ల సంస్థ ప్రతినిధులు విష్ణు, రఘుపతి రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు.జన్మభూమి రుణం తీర్చుకునేందుకు దాతల సహకారంతో లింగాలలో మెడికల్ నాలెడ్జ్ ల్యాబ్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేవిధంగా కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.


ఐరాస పిలుపు అందుకున్న వీర్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

మందమర్రిలో పులి చర్మం పట్టివేత

ఒకరు అరెస్టు • ఇద్దరు నిందితులు పరారీ


పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ సిబ్బంది

మందమర్రి, జనవరి 24: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని రామన్ కాలనీ ఏరియాలోని గౌతమి నగర్‌లో గురువారం ఫారెస్ట్ అధికారులు ఐలవేని అంజయ్య అనే సింగరేణి కార్మికుని క్వార్టర్‌పై దాడి చేసి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలోకి వెళ్తే సింగరేణిలో పని చేసి పదవీ విరమణ పొందిన ఐలవేని లింగయ్య అనే వ్యక్తి పదవీ విరమణ పొందిన అనంతరం చొప్పదండిలో నివాసం ఉంటున్నాడు. ఐలవేని లింగయ్య తన సోదరుడు అయిన అంజయ్యకు ఆ క్వార్టర్‌ను కేకే 5 గనిలో పని చేసే ఐలవేని అంజయ్య అనే కార్మికుడు గత కొంత కాలంగా కిరాయి తీసుకొని నివాసం ఉంటున్నాడు. ముందస్తు సమాచారంతో ఫారెస్ట్ అధికారులు ఇంటిపై దాడి చేయగా పులి చర్మం లభిచింది. అంజయ్యతోపాటు అతని పెద్ద కుమారుడు పరారీలో ఉండగా, అతని చిన్న కుమారుడు అయిన ఐలవేని శ్యాం ను, మరోక్క వ్యక్తిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు రెండు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసును విచారణ చేపడుతున్నామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈసంఘటన మందమర్రిలో కలకలం సృష్టించింది. వివరాల్లోకెళితే... మహారాష్ట్రకు చెందిన టైగర్ హంటింగ్ ఎండ్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులు గురువారం సాయంత్రం అటవీ అధికారుల సాయంతో పులి చర్మాన్ని కొనుగోలు చేస్తామని వేషంలో వెళ్లగా నమ్మి విక్రయించేందుకు నిందితులు సిద్ధపడ్డారని మంచిర్యాల డి ఎఫ్ ఓ రామ లింగం తెలిపారు. మొదట పులి చర్మం మందమర్రి ఉన్నదన్నా సమాచారం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల బృందం కాగజ్‌నగర్‌లో ఓ ప్రదేశానికి తీసుకొస్తే కొనుగోలు చేస్తామని చెప్పగా , పులి చర్మం విక్రయించే వారు కాగజ్‌నగర్‌కు రాలేమని, రామన్ కాలనీ ఏరియాలో గౌతమి నగర్‌కు రావాలని సూచించారు. దీనితో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మారు వేషంలో అటవీ అధికారులకు సమాచారం అందించి దాడులు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నందు పింపీడేతో పాటు నలుగురు ప్రతినిధుల బృందం పులి చర్మాన్ని స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించగా మంచిర్యాల డి ఎఫ్ ఓ వారికి సహకరించారు. ఈ దాడిలో ఎఫ్ డి ఓ జూపల్లి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల రేంజ్ అధికారులు మానయ్య, మందమర్రి డిప్యూటీ రేంజ్ అధికారి సుభాష్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో
హైదరాబాద్ వద్ద
సిఎ(సిఎఎ) నెం.731/230/హెచ్‌డిబి/2018
తో సంబంధించి
సిపి(సిఎఎ) నెం.7/230/హెచ్‌డిబి/2019
కంపెనీల చట్టం, 2013 విషయంలో
మరియు
మెస్సర్స్ ఎస్.వి.ఎస్. వైర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) విషయంలో
మరియు
మెస్సర్స్ ఎస్.వి.ఎస్. రెఫ్‌కాంప్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రాన్స్‌ఫరీ కంపెనీ)
మరియు
వారి సంబంధిత వాటాదారుల విషయంలో

ఎస్.వి.ఎస్. వైర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీల చట్టం 1956 క్రింద ఏర్పాటు కాబడిన కంపెనీ తన నమోదిత కార్యాలయం: షెడ్ నెం. డి 36, ఫేజ్ నెం. IV, ఎక్స్‌టెన్షన్ ఐ.డి.ఎ. జీడిమెట్ల, ఆర్.ఆర్. జిల్లా, హైదరాబాద్-500055 తెలంగాణ వద్ద కలిగియుండి తన డైరెక్టర్ శ్రీ ప్రవీణ్ త్యాగిచే ప్రాతినిధ్యం వహించబడుచున్నది. ... మొదటి పిటిషనర్ / ట్రాన్స్‌ఫరర్ కంపెనీ
మరియు
ఎస్.వి.ఎస్. రెఫ్‌కాంప్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీల చట్టం 1956 క్రింద ఏర్పాటు కాబడిన కంపెనీ తన నమోదిత కార్యాలయం: షెడ్ నెం. 37, ఫేజ్ నెం. IV, ఎక్స్‌టెన్షన్ ఐ.డి.ఎ. జీడిమెట్ల, ఆర్.ఆర్. జిల్లా, హైదరాబాద్-500055 తెలంగాణ వద్ద కలిగియుండి తన డైరెక్టర్ శ్రీ ప్రవీణ్ త్యాగిచే ప్రాతినిధ్యం వహించబడుచున్నది. ... రెండవ పిటిషనర్ / ట్రాన్స్‌ఫరీ కంపెనీ

కంపెనీల (కాంప్రమైజెస్, అరేంజ్‌మెంట్ మరియు అమల్గమేషన్) రూల్స్ 2016 యొక్క రూల్ 16 క్రింద పిటిషన్ యొక్క ప్రకటన

గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ వద్ద, హైదరాబాద్ బెంచ్ వారి సమక్షంలో మెస్సర్స్ ఎస్.వి.ఎస్. వైర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (1వ పిటిషనర్ / ట్రాన్స్‌ఫరర్ కంపెనీ) మరియు మెస్సర్స్ ఎస్.వి.ఎస్. రెఫ్‌కాంప్ ప్రైవేట్ లిమిటెడ్ (2వ పిటిషనర్ / ట్రాన్స్‌ఫరీ కంపెనీ) మధ్యన విలీన పథకం కొరకు కంపెనీల చట్టం 2013 యొక్క సెక్షన్ 230 మరియు ఇతర వర్తించు నిబంధనలతో చదువుకొనే సెక్షన్ 232 క్రింద కాప్షన్డ్ కంపెనీచే పిటిషన్ సమర్పించబడినది. సదరు పిటిషన్‌ను 25 ఫిబ్రవరి, 2019న గౌరవనీయ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ వారి సమక్షంలో విచారణకు నిర్ణయించబడినది.

సదరు పిటిషన్‌కు మద్దతు తెలుపుటకు లేదా వ్యతిరేకించుటకు ఆసక్తి గల ఏ వ్యక్తి అయిన అతని / ఆమె ఉద్దేశ్యం యొక్క ప్రకటనను అతని / ఆమె లేదా అతని / ఆమె పేరు మరియు చిరునామాతో అతని / ఆమె అడ్వకేట్‌చే సంతకం చేయబడి పిటిషనర్ యొక్క అడ్వకేట్‌కు పిటిషన్ విచారణకు నిర్ణయించిన తేదీ అనగా 25 ఫిబ్రవరి, 2019నకు 2 (రెండు) రోజుల ముందు చేరునట్లుగా పిటిషనర్ యొక్క అడ్వకేట్‌కు పంపవలెను. ఒకవేళ అతని / ఆమె పిటిషన్‌ను వ్యతిరేకించుచున్న యెడల అటువంటి ప్రకటనతో వ్యతిరేకించుటకు గల ఆధారాలు సమర్పించవలెను. పిటిషన్ యొక్క ప్రతి కావలసిన ఏ వ్యక్తి అయినా అందుకు నిర్ధేశించిన చార్జీల చెల్లింపుపై ఈ దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.

సం/- పి. అనిల్ ముఖర్జీ
పిటిషనర్ కంపెనీల కొరకు న్యాయవాది

తేది : 24.01.2019
ప్రదేశం: హైదరాబాద్
నెం. 103, 2వ అంతస్తు, 16-2-703/1/1, ఎం.ఎస్. ఆర్కేడ్; చర్మాస్ వెంబడి, మలకోపేట, హైదరాబాద్-500036

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శుక్రవారం, 25 జనవరి 2019

రాజకీయ 'రసాయనం'..

భూమి లేని 'మడక' దున్ని, నీరు లేని 'నారు' పోసి, కంకి లేని 'చేను' కోద్దామా.. ఊరికంతా 'విందు' చేద్దామా!- అన్నది గ్రామీణ ప్రాంతాలలో 'బైరాగులు' పాడుకునే పాట..! ఈ పాటలో గొప్ప వేదాంతముందట. 'జగత్ మిథ్యా' అద్వైత సారం నిహితమై ఉందట. కానీ జీవన వ్యవహారంలో ఈ 'మిథ్య' సత్యంగా కనిపిస్తోంది, రాజకీయాలలో ఇది మరింతగా ప్రస్ఫుటిస్తోంది.. అందువల్ల రాజకీయాలలో భూమి లేకుండా 'నాగలి'తో దున్నడం కుదరదు. 'కుదురుతుంది..'అని అంటున్న ప్రాంతీయ, రాజకీయ పక్షాల 'పొత్తు'ల ప్రహసనం వింత గొలుపుతోంది. చట్టసభలకు త్వరలో జరుగనున్న ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరిగా పోటీచేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడం ఈ 'పొత్తు'ల ప్రహసనంలో సరికొత్త వింత! భారతీయ జనతాపార్టీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో 'ఏర్పడుతున్న' మహాకూటమికి రాజకీయ 'రూపశిల్పి' తెలుగుదేశం పార్టీ- తెదేపా- అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఈ జాతీయ 'మహాకూటమి' 'రూపం'- ఫిజిక్స్- ఏమిటో 'శిల్పం'- కెమిస్ట్రీ- ఏమిటో ఇంకా స్పష్టం కాలేదు. కానీ ఈ 'కూటమి'లో ప్రధాన పక్షం కాంగ్రెస్ కాగా, కీలక పక్షం 'తెదెపా' అన్నది జరుగుతున్న ప్రచారం. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ వరిష్ఠత- పొలిటికల్ సీనియారిటీ- తెలుగుదేశం పార్టీకి ఈ కూటమిలో 'కీలక స్థానం' లభించడానికి ప్రధాన కారణం! ఇంతకాలం జాతీయ రాజకీయాలలో 'విదూషకుడి'గా, 'నోటిలో కాలు పెట్టుకునే' ప్రవృత్తికి సజీవ రూపంగా 'అలరారిన' కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇప్పుడు 'రాజకీయ గాంభీర్యానికి' ప్రతిరూపంగా మారాడు.. మారాడని ప్రచారం జరుగుతోంది. ఈ మహా మార్పునకు ప్రాతిపదిక చంద్రబాబు ప్రతిపాదించి ప్రచారం చేస్తున్న 'భాజపా' వ్యతిరేక జాతీయ మహాకూటమి! అందువల్ల జాతీయ మహాకూటమిలో ప్రధాన పక్షమైన కాంగ్రెస్‌కూ, కీలక పక్షమైన 'తెదెపా'కు మధ్య ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికలలోను, శాసనసభ ఎన్నికలలోను పొత్తు ఏర్పడడం ఖాయమన్నది జనానికి కలిగిన తార్కికమైన, సహజమైన అభిప్రాయం! కానీ తమ పార్టీకి, 'తెదెపా'కు మధ్య ఎలాంటి పొత్తు ఆంధ్రప్రదేశ్‌లో ఉండబోదన్నది బుధవారం విజయవాడలో కాంగ్రెస్ నాయకులు తేల్చిచెప్పిన మాట. ఇది కేవలం కాంగ్రెస్ ప్రాంతీయ నాయకుల అభిప్రాయం కాదట, కాంగ్రెస్ అధిష్ఠానం వారి నిర్ణయమట! తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నాడన్నది ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి చెప్పిన మాట! కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ సంస్థాగత వ్యవహారాల నిర్వాహకుడు ఊమెన్ చాందీ కూడా 'తెలుగుదేశంతో లేని పొత్తు'ను గురించి ధ్రువపరచడం ఇంకా పూర్తిగా ఏర్పడని 'జాతీయ మహాకూటమి'లో కల్లోలం కలిగించవలసిన పరిణామం! ఆంధ్రప్రదేశ్‌లోని ఇరవై ఐదు లోక్‌సభ స్థానాలలోను, నూట డెబ్బయి ఐదు శాసనసభ స్థానాలలోను కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయనున్నదట...

కల్లోల ప్రకంపనలు వినిపించకపోవడానికి ఒక ప్రధాన కారణం బుధవారం కాంగ్రెస్‌లో సంభవించిన మరో మహాపరిణామం. తన సోదరి ప్రియాంకా వాద్రాను రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఈ మహాపరిణామం. రెండవది చంద్రబాబు ఏర్పాటు చేయతలపెట్టిన 'భాజపా' వ్యతిరేక 'జాతీయ మహాకూటమి'కి ఇంకా 'కెమిస్ట్రీ'కాని 'ఫిజిక్స్'కానీ ఏర్పడక పోవడం! 'రాజకీయ శాస్త్రం'లోకి భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం ఎప్పుడు చొరబడిపోయాయన్నది 'పరిభాష' అర్థం కాని ప్రజలు అడుగుతున్న ప్రశ్న.. ఏ రాజకీయవేత్త ఏ పార్టీలోకి ఎప్పుడు చొరబడిపోతున్నాడు? ఏ రాజకీయవేత్త ఏ పార్టీనుంచి ఎప్పుడు ఉడాయిస్తున్నాడు?? అన్నవి మాత్రమే జనానికి అర్థమౌతున్న మహా విషయాలు! అందువల్ల 'కెమిస్ట్రీ' 'ఫిజిక్స్' ప్రాతిపదికగా రాజకీయాలను విశ్లేషిస్తున్న 'కుతూహల జనకుల'కు విజయవాడలో గురువారం కాంగ్రెస్ నిర్వహించిన రాజకీయ విస్ఫోటన రవాలు ఇంకా వినబడినట్టు లేదు. వీరందరూ ప్రియాంకమ్మకు పార్టీ పదవి లభించడం వల్ల సంభవించబోయే పరిణామ ప్రభావ పరిమాణం గురించి, విస్తృతికి గురించి చర్చించడంలో నిమగ్నులై ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ వోట్ల సంఖ్య పదిహేడు శాతానికి పెరిగిందన్న అంచనాలు నిజమైతే, కాంగ్రెస్ ఒంటరి పోరువల్ల 'తెదెపా', వైఎస్ఆర్ కాంగ్రెస్- వైకాపా- రాజకీయ భవితవ్యాలు ప్రభావితం కాకమానవు! 2014లో తుడిచిపెట్టుకొనిపోయిన కాంగ్రెస్ పార్టీకి పెరిగిన వోట్లు ఏ పార్టీకి తరిగిపోయాయన్నది 'కెమిస్ట్రీ' విశ్లేషకులు నిగ్గుతేల్చదగిన 'ఉత్కంఠ జనకమైన' వ్యవహారం.. కుతూహలంతో కుతకుతలాడిపోతున్న వారికి ఇది కొండంత 'మేత'..

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కూ 'తెదెపా'కు మధ్య 'పొత్తు'లేనట్టయితే లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో మాత్రం ఉభయ పక్షాల మధ్య 'కలసికట్టుతనం' ఎలా కొనసాగ గలదు? జాతీయ స్థాయిలో 'భాజపా' వ్యతిరేక 'సంఘటన' ఏర్పడడానికి చంద్రబాబు చేస్తున్న కృషికి ప్రధాన ప్రేరణ కాంగ్రెస్ నుంచి లభిస్తోంది. ప్రాంతీయ స్థాయిలో లేని 'పొత్తు' జాతీయస్థాయిలో విచ్చుకోగలదన్నది 'నేల విడిచి' సాము చేయడం మాత్రమే కాగలదు. రాజకీయాలలో సైద్ధాంతిక సారూప్యం, భాగస్వామ్య పక్షాల సమీకృతి వంటివి అవాఙ్మనస గోచరమైన బ్రహ్మపదార్థం వంటివి. గోచరమవుతున్నది ఏయే పక్షానికి ఎన్ని స్థానాలలో ఎంత బలం ఉందన్నది మాత్రమే! ఇదీ రాజకీయ వ్యవహార వాస్తవం! అందువల్ల ప్రధాన ప్రత్యర్థిని- ప్రస్తుతం 'భాజపా'ను- కలిసికట్టుగా ఎదిరించదలచిన పక్షాలు ఏ ఒక్క నియోజకవర్గంలో కూడ పరస్పరం తలపడరాదు. అలా తలపడడం 'కూటమి' స్ఫూర్తికి విరుద్ధం, ప్రధాన ప్రత్యర్థికి లాభదాయకం! ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై ఐదు స్థానాలలో పరస్పరం తలపడే 'తెదెపా', కాంగ్రెస్‌లు పరస్పరం దూషణ, తిరస్కార, ఆరోపణలకు పాల్పడక మానవు. అలాంటప్పుడు ఇక్కడ పరస్పరం తిట్టుకుంటూ, తిట్లు మితిమీరినప్పుడు 'కొట్టుకుంటూ' జాతీయ స్థాయిలో మాత్రం మైత్రిని అభినయించడంలో ఔచిత్యం ఏమిటి? జాతీయ స్థాయిలోని ఈ 'ఉత్తుత్తి' మైత్రి 'భూమి లేనిచోట నాగలితో దున్నడం' వంటిది! జాతీయ స్థాయి మైత్రివల్ల కాంగ్రెస్‌కు కాని, తెదెపాకు కానీ ఏ నియోజకవర్గంలో ఎంత మేలు జరుగుతుంది? కర్నాటక శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, హెచ్‌డి కుమారస్వామి నేతృత్వంలోని 'లౌకిక జనతాదళ్' పరస్పరం ఢీకొన్నాయి, కార్యకర్తల మధ్య కుమ్ములాటలు కొట్లాటలు తిట్లాటలు జరిగాయి. కానీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఈ రెండు పార్టీలు కలసిపోయాయి. లోక్‌సభ ఎన్నికల తరువాత కూడ ఇలా పరస్పరం ఎన్నికలలో తలపడిన సైద్ధాంతిక వైరుధ్య పక్షాలు కలసిపోవచ్చు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు! దానికోసం ఎన్నికలకు ముందుగా 'కూటమి'ని ఏర్పాటు చేయనక్కరలేదు. 'కూటమి'అంటే కూటమి లోని పక్షాలు కలసికట్టుగా ప్రధాన ప్రత్యర్థితో తలపడాలి, పరస్పరం తలపడరాదు. 'స్నేహ పూర్వకమైన పోటీ' అన్నది రాజకీయ ఆత్మవంచన..

భాజపా వ్యతిరేక కాంగ్రెస్ 'సహిత' మహాకూటమి నిర్మాణంలో నిహితమై ఉన్న వైరుధ్యాలకు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నిర్ణయం సరికొత్త ప్రతీక! ఎనబయి లోక్‌సభ స్థానాలున్న అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోనే ప్రధాన ప్రతిపక్షాలు కాంగ్రెస్ కూటమికి దూరంగా ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ కూడ కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తునకు సుముఖంగా లేదు.. తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలలో మాత్రమే కాంగ్రెస్‌తో జట్టుకట్టడానికి ఇతర పక్షాలు సిద్ధంగా ఉన్నాయి.. దీనివల్ల జాతీయ మహాకూటమి ఎలా సాధ్యం...? 'కెమిస్ట్రీ' ఏదీ??

గణతంత్ర వేడుకలకు సర్వభాషా కవి సమ్మేళనం

'భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యంలో సౌందర్యం' అని మనం తరచూ చెప్పుకునే భావనకు చక్కని ప్రతీక- ప్రతి సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవానికి 'ఆకాశవాణి' ప్రసారం చేసే సర్వభాషా కవిసమ్మేళనం. దేశంలోని 22 భాషలలోని కవిత్వం ఏకకాలంలో ఆ 22 భాషల్లో అనువదింపబడి జన సామాన్యానికి అందించడం ఇందులోని విశేషం. దేశవ్యాప్తంగా సంవత్సరం పాటు జరిగే ప్రక్రియకు తుదిదశగా ఏటా జనవరి 25న రాత్రి 10 గంటలకు అన్ని 'ఆకాశవాణి' కేంద్రాలన్నీ ప్రసారం చేయడం ఆనవాయితీ. ఇది 'ఆకాశవాణి' కవితోత్సవం. ఇది మంచి కవిత్వాన్ని మరింత మందికి విస్తృతంగా ఇవ్వడం మాత్రమే!

వస్తుపరంగా, ప్రక్రియాపరంగా 'ఆకాశవాణి'లో వైవిధ్యం పుష్కలంగా ఉంది. రైతులకు, మహిళలకు, పిల్లలకు కార్మికులకు, వృద్ధులకు, యువతకు- అనే వర్గీకరణ., వార్తలు, ప్రసంగాలు, పరిచయాలు, చర్చలు, నాటకాలు, రూపకాలు, నివేదికలు, కచేరీలు- అనే మరో వర్గీకరణ; వ్యవసాయం, ఆరోగ్యం, అభివృద్ధి, సైన్స్, సాహిత్యం, హాస్యం అనే ఇంకో వర్గీకరణను గమనించవచ్చు. ఆకాశవాణి సంగీత సమ్మేళనం, నాటక సప్తాహం వంటి సందర్భాలు ఆయా విభాగాలకు ఉత్సవాలు. కవిత్వానికి సంబంధించి ఆకాశవాణి సర్వభాషా కవి సమ్మేళనం వైవిధ్య భరితం.

ప్రతి భాషలో, ప్రతి ఆకాశవాణి కేంద్రంలో నిత్యం ప్రసారమయ్యే కవితల నుంచి మూడు నెలలకోసారి రెండు ఉత్తమ కవితలు ఆయా కేంద్రాలు ఎంపిక చేస్తాయి. మూడున్నర నిమిషాల వ్యవధి, ఉపయోగపడే కవితా వస్తువు, మంచి కవితా శిల్పం ఉన్న ఏ కవిత అయినా పరిగణనలోకి వస్తుంది. ప్రతి భాషలో ప్రతి మూడు నెలలకు ఒకసారి వాటినుంచి రెండు కవితలు ఎంపిక అవుతాయి. అంటే సంవత్సరానికి ఎనిమిది. ఈ ఎనిమిదింటినీ ఇంగ్లీషులోకి అనువదించి ఢిల్లీకి పంపుతారు. అక్కడ ఆ ఎనిమిదింటి నుంచి ఒక ఉత్తమ కవిత ఆ సంవత్సరానికి, ఆ భాషకు ప్రతీకగా ఎంపిక అవుతుంది. ఇలా 22 భాషలకూ ఈ తతంగం ఉంటుంది. ఎంపికైన తర్వాత హిందీ భాషకు ఇద్దరు, మిగతా భాషలకు ఒకటి చొప్పున మొత్తం 23 మంది కవులను ఆహ్వానిస్తారు. గతంలో ఇది ఢిల్లీలో జరిగేది. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఒక్కో సంవత్సరం ఒక్కో రాష్ట్ర రాజధానిలో నిర్వహిస్తున్నారు. 2014లో హైదరాబాదులో నిర్వహించగా, ఇటీవల చెన్నైలో నిర్వహించారు. సంస్కృతితో మొదలై, ఆంగ్లభాష అక్షర క్రమంలో 22 భాషల కవితల ప్రసారం ఉంటుంది.

రాష్ట్ర రాజధానిలో ఈ 23 కవితలను స్థానిక భాషలో ప్రముఖ అనువాద కవులతో తర్జుమా చేయిస్తారు. హిందీ, ఇంగ్లీషు భాషల అనువాదాల ఆధారంగా ఈ కవులు ఆంధ్రీకరణం చేస్తారు. మూల భాషలో కూడా కవితా పఠనం విని సాధ్యమైనంత స్థాయిలో ప్రజెంటేషన్ కూడా అదే పద్ధతిలో అనువాదం, పఠనా విధానం సాగాలి. ఆయా కేంద్రాలు ప్రసారంలో సంస్కృతంతో ప్రారంభించి, స్థానిక భాషతో ముగించాలి. ప్రసార సమయంలో మూల భాషలో కవితని కొద్దిగా వినిపించి పిమ్మట అనువాదం కొనసాగిస్తారు. ఆ మూల భాషను ఇతర భాషల వారికి పరిచయం చేయాలన్నది మరో లక్ష్యం.

ఈ ప్రయోగం, ప్రయత్నం విలక్షణమైనవి. ఇది 1956లో మొదలైంది. గత 64 సంవత్సరాలుగా జరుగుతోంది. ఏక కాలంలో 22 భాషల కవిత్వం తీరూతెన్నూ ఇక్కడ పరిశీలించి అధ్యయనం చేయవచ్చు. స్థానిక భాషలలో అనువాదం పద్ధతి, వ్యవహారం తెలుసుకోవచ్చు. కొన్ని సంవత్సరాల కవితలూ, వాటి అనువాదాలు గమనిస్తే వాటి పరిణామ విధానం సైతం బోధపడుతుంది. తెలుగు ఆకాశవాణి కేంద్రాలు జనవరి 25న రాత్రి 10 గంటలకు రెండు గంటలపాటు ఈ సర్వభాషా కవిసమ్మేళనాన్ని ప్రసారం చేస్తాయి. మరుసటిరోజు (జనవరి 26)న ఉదయం 7.15 గంటలకు పునఃప్రసారం కూడా ఉంటుంది. మీరు కవితా ఉత్సవాన్ని ఆనందించడమే తరువాయి!

-డా. నాగసూరి వేణుగోపాల్ 94407 32392

తెరమీదకు మరో కొత్త నాటకం..!

భాస్కరవాణి
bhaskarayogi.p@gmail.com

'శత్రువును జయించాలంటే యుద్ధం చేయాల్సిన అవసరం లేదు; దుష్ప్రచారం చేస్తే సరిపోతుంది' అన్న సూత్రం కొన్ని రాజకీయ పక్షాలకు బాగా వంటబట్టింది. దేశంలో సరికొత్త అనుమానాలను పుట్టించి ప్రజల్లో ఆందోళన కలిగించడం రాజకీయ వ్యూహం. కానీ, ప్రజాస్వామ్యం పరువు బజారున పడుతోందన్న విషయాన్ని వీళ్లు విస్మరించారు. వాళ్లకు అధికారం తప్ప దేశం అవసరం లేదు. ఎలాంటి ధ్వంసరచన చేసైనా గద్దెనెక్కడం అధికార దాహార్తుల అసలు లక్ష్యం. రెండురోజుల క్రితం సైబర్ హ్యాకర్ సయ్యద్ షుజా అనే కొత్తపాత్రను కొందరు నేతలు తెరపైకి తెచ్చారు. 2014 ఎన్నికల్లో ఈవీఎంల (ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల)ను ట్యాంపరింగ్ చేసి భాజపా అధికారంలోకి వచ్చిందన్నది సయ్యద్ ఆరోపణ. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో భాజపా గెలవడానికి కారణం ఇదే అని కూడా ఆరోపణ చేశాడు. రిలయన్స్ కమ్యూనికేషన్స్ కేంద్రాల నుంచి ఈవీఎంలను తక్కువ పౌనఃపున్యం ఉన్న సిగ్నల్స్ ద్వారా హ్యాక్ చేశారని అతను ఆరోపణ చేశాడు. 3 జూన్ 2014న మరణించిన భాజపా నేత గోపీనాథ్ ముండే, 2 ఏప్రిల్ 2016న మరణించిన ఎన్ఐఏలో కీలక అధికారి తంజీల్ అహ్మద్, 5 సెప్టెంబర్ 2017న మరణించిన గౌరీ లంకేశ్ హత్యలను కూడా దీనికి జోడించారు. ముండేకు ఈ రహస్యాలు తెలిసినందువల్లే చంపేశారని, ఆయన హత్యపై దర్యాప్తు చేసినందువల్లనే తంజీల్ అహ్మద్‌ను ఆగంతకులు అంతం చేశారని, ఈ ట్యాంపరింగ్‌పై కథనాలు రాసినందువల్లనే జర్నలిస్టు గౌరీ లంకేశ్‌ను చంపారని ఓ కొత్త కథ అల్లి కేంద్రంపై ప్రజలకు అనుమానం కలిగేలా దుష్ప్రచారం మొదలుపెట్టారు.

గతంలో వాజపేయి ప్రభుత్వంలో వ్యవహార దక్షుడైన భాజపా కీలకనేత ప్రమోద్ మహాజన్‌ను ఎవరు చంపించారు? జీఎంసీ బాలయోగి, ఎర్రన్నాయుడులను వివిధ ప్రమాదాల్లో ఎవరు హత్య చేయించారు? వీళ్లంతా తమకు భవిష్యత్తులో పోటీగా నిలుస్తారని చంపించారా? గొప్ప నాయకుడైన నేతాజీ సుభాస్ చంద్రబోస్ మరణంపై ఈరోజుకూ స్పష్టత ఎందుకులేదు? అప్పటి ప్రధాని లాల్‌బహాదూర్ శాస్త్రి మరణంపై వేసిన జేపీసీ రిపోర్టు ఎందుకు బయటకు రాలేదు? వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిని ఎవరు, ఎందుకు చంపించారని విచారణ చేశారా? ప్రతి మరణాన్ని ఏదో ఒక కోణంలో చూపించి దుష్ప్రచారం చేయాలంటే వాళ్లను ఎవరూ ఆపలేరు; కానీ అంతరాత్మ ఒకటి ఉంటుంది కదా! ఈవీఎంల ట్యాంపరింగ్‌లపై కథనాలు రాద్దామనుకున్న గౌరీ లంకేశ్ నడిపే పత్రిక, ఆమె వ్యాసాలు దేశాన్ని మొత్తం ప్రభావితం చేసే అంత గొప్పగా ఉన్నాయా? కర్నాటకలో రచయిత్రి, జర్నలిస్టు అయిన గౌరీ లంకేశ్ ఒకవేళ ఆమె ట్యాంపరింగ్‌పై పరిశోధన చేసినందుకే చంపేశారని ఇపుడు చెబుతున్నారు. కానీ ఆమె మరణించిన సందర్భంలో ఇంకేవో కారణాలు చెప్పారు కదా? 'మా చచ్చిపోయిన గేదె పగిలిపోయిన కుండెడు పాలు ఇచ్చేది' అని చెప్పే సామెతలా ఉంది కథ. ఎక్కడో మారుమూల ప్రాంతంలోని రచయిత్రిని హత్య చేసేట్టయితే, ఢిల్లీలో కూర్చొని రోజూ మోదీపై వ్యతిరేక కథనాలకు ఆజ్యం పోస్తున్న రచయితలను, జర్నలిస్టులను ఎందుకు వదలిపెడతారు? గౌరీ లంకేశ్ మరణించినపుడు కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఇపుడు అదే మూసలో కొలువుదీరిన జెడిఎస్ కుమారస్వామి ప్రభుత్వం ఉంది కదా! ఈ రెండూ మోదీకి తీవ్ర వ్యతిరేక ప్రభుత్వాలే కదా! మరెందుకు గట్టి పరిశోధన చేసి దోషులను పట్టుకోలేదు?

బీఈఎల్, ఈసీఐఎల్ అనే ప్రతిష్ఠాత్మక సంస్థల్లో అత్యంత గోప్యంగా, భద్రత మధ్య ఈవీఎంలు తయారవుతాయి. రాఫెల్ యుద్ధ విమానాల తయారీలో 'హాల్'కు ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదన్న వాళ్లే బీఈఎల్, ఈసీఐఎల్ పనితీరుపై వేలెత్తి చూపుతున్నారు. ఇంకో విశేషమేమిటంటే- సయ్యద్ తాను హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో పనిచేసిన సైబర్ నిపుణుడని చెప్పుకొన్నాడు. కానీ రెండు రోజుల క్రితం ఈసీఐఎల్ ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖలో 'మేం రికార్డులన్నీ తనిఖీ చేసాం. అలాంటి వ్యక్తి 2009-14 మధ్య గానీ అంతకుముందుగానీ మాతో పనిచేయలేదు' అని స్పష్టం చేసింది. అయినా తన ముఖమే చూపంచకుండా, లండన్‌లో సయ్యద్ ప్రెస్‌మీట్ పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ ఘటన అంతా భారత్‌లో జరిగితే విదేశాల్లో ప్రెస్‌మీట్ పెట్టడం వెనుక రహస్యం ఏమిటి? సైబర్ హ్యాకర్ మాటలకు ఈ దేశ ప్రభుత్వాలపై ప్రభావం పడేంత బలహీనంగా మన ప్రజాస్వామ్యం, మన ఆలోచనలు ఉన్నాయా? రాఫెల్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండానే పత్రికా కథనాలతో దుష్ప్రచారం కొనసాగించినట్లే ఇదీ ఒక మానసిక వికృత క్రీడగా అన్పించడం లేదా?

ఇక ఈ స్క్రీన్‌ప్లేలో మరో గొప్ప అంశం ఉంది. రామ మందిరం కేసును 2019 వరకూ విచారణ జరపడానికి వీల్లేదని సుప్రీం కోర్టును బ్లాక్‌మెయిల్ చేసి వాయిదా వేయించిన కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ షుజా ప్రెస్‌మీట్‌కు వెళ్లాడు. యూపీఏ ప్రభుత్వంలో ఇతన న్యాయ, ఐటీ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఈవీఎంలను భాజపా హ్యాక్ చేయిస్తుంటే అప్పుడు ఐటీ మంత్రిగా ఈయన ఏం చేస్తున్నాడు? 2017లో జరిగిన 5 రాష్ట్రాల రాష్ట్రాల ఎన్నికలకు ముందు ఎన్నికల కమీషన్ ఢిల్లీలో అన్ని పార్టీల ప్రతినిధును ఆహ్వానించి 'ఈవీఎంలను ట్యాంపర్ చేసి చూపించండి' అంటూ సవాల్ చేసింది. కానీ ఆ కార్యక్రమానికి సీపియం, ఎన్సీపి నేతలు మాత్రమే వెళ్లి వాటి పనితీరు పరిశీలించి వచ్చాయి. ఈసీ సమావేశం ఢిల్లీలో పెడితే వెళ్లని పార్టీలు, 2019లో ఓడిపోవడానికిముందే ఓ కొత్త దారి వెతుక్కుంటున్నాయని విశ్లేషకుల భావన. లండన్ వెళ్లి సైబర్ హ్యాకర్ల మాటలు శ్రద్ధగా వింటారు గానీ, ఢిల్లీలో ఈసీ పిలిస్తే వెళ్లరు!? 2004-2018 మధ్య ఈవీఎంలను ఉపయోగించగా కొన్ని పార్టీలు విజయం సాధించాయి. మరోసారి ఓడిపోయాయి. ఓడితే ట్యాంపరింగ్ జరిగినట్లు, గెలిస్తే ప్రజావిజయమా? 2014లో ఈవీఎంల ద్వారా గెలిచిన, సాంకేతికతకు ఆద్యుడైన చంద్రబాబు కూడా వీటిపై అనుమానాలను వ్యక్తం చేయడం విచిత్రం.

ఇటీవల కోల్‌కతలో సమావేశం జరిపిన 22 చిన్నాచితకా పార్టీల ప్రతినిధిగా మమతా బెనర్జీ ఈ విషయమై అభిషేక్ మను సంఘ్వీ, అఖిలేశ్ యాదవ్, సతీశ్ చంద్ర మిశ్రా, అరవింద్ కేజ్రీవాల్‌లతో ఓ కమిటీ వేసింది. 2018 మేలో జరిగిన బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు బ్యాలెట్ బాక్సులను నీళ్లలో పడేయడం మమత మరిచిపోయి మళ్లీ బ్యాలెట్ బాక్స్‌లు కావాలంటోంది. 2015 ఢిల్లీ ఎన్నికల్లో గెలిచిన అరవింద్ కేజ్రీవాల్ కూడా 'ఈవీఎంలు వద్దు' అనే కమిటీలో సభ్యుడు. ఇతణ్ణి భాజపా వారే గెలిపించారా? ఆ తర్వాత బిహార్ ఎన్నికల్లో- మోదీకి దీటైన నాయకుడు అని ప్రచారం పొందిన నితీశ్‌కుమార్‌ను భాజపానే గెలిపించిందా? మోదీని, భాజపాను తీవ్రంగా ద్వేషించే లాలూ పార్టీని ట్యాంపరింగ్‌తో బీజేపీ వాళ్లు గెలిపించారా? ఇటీవల పూల్పూర్, గోరఖ్‌పూర్ ఉప ఎన్నికల్లో ఎస్పీ-బిఎస్పీ కూటమిని ట్యాంపరింగ్ ద్వారా గెలిపించారా? నెలక్రితం జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ట్యాంపరింగ్ ద్వారానే గెలిచిందా? 2010లో ఈవీఎంల పనితీరుపై కమిటీ వేసిన కాంగ్రెస్ 2014 వరకు ఏం చేసింది? 2014 వరకు సాంకేతిక పరిజ్ఞానం అంతా తనచేతిలోనే పెట్టుకొన్న కపిల్ సిబాల్ ఇపుడు ఈ కొత్త నాటకానికి ఎందుకు తెరతీసారో తెలియదు.

కొత్తకోణంతో విషప్రచారం చేసిన షుజా,సిబాల్‌లు వ్యవస్థలను ఇంతలా అపహాస్యం చేయడం విడ్డూరం. ప్రతి సంఘటనకూ హైదరాబాద్‌కు లింక్ వున్నట్లే ఈ ఘటనకూ ఇక్కడి భాజపా నాయకుడు జి.కిషన్‌రెడ్డిని జోడించారు. హ్యాకర్ షుజాను మరో 13మందిని ఉప్పల్ గెస్ట్ హౌజ్‌కు పిలిపించిన కిషన్‌రెడ్డి 11మందిని అక్కడే చంపించాడట! దానికి హైదరాబాద్‌లో మత ఘర్షణలు సృష్టించి వాళ్ల ఆ లెక్కలో కలిపేసాడట! ఎంత ఆశ్చర్యం! 'పాతబస్తీలోకి రాయలసీమ గూండాలను తీసుకువచ్చి నా ప్రభుత్వాన్ని అపఖ్యాతిపాలు చేసేందుకు మా పార్టీ నాయకులే కుట్ర చేశార'ని సాక్షాత్తూ అసెంబ్లీలో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ప్రకటించాడు. ఈ అలవాటున్న కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ కిషన్‌రెడ్డి పేరుతో కొత్త డ్రామాను ఆడించేందుకు షుజాను ఉసిగొల్పాడు. అసలు ఈ సయ్యద్ షుజా ఎవరో విచారణ వేగంగా చేయాలి. హైదరాబాద్ షాదన్ కళాశాలలో బిటెక్, ఆర్‌ఎఫ్ చేశానని చెప్పే షుజా అక్కడ చదవలేదని ఆ విద్యా సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. తన తండ్రి యూసుఫ్ అహ్మద్ సయ్యద్ బీహెచ్ఈఎల్‌లో పనిచేశాడని, తమ కుటుంబాన్ని గృహదహనంతో చంపారని షుజా ఆరోపణ. కానీ అలాంటిది జరగలేదని ఫైర్ రిపోర్ట్స్, పోలీసులు పత్రికల్లో ప్రకటించారు. ఇలాంటి కట్టుకథలతో ఘర్షణ వాతావరణానికి తెరతీస్తున్న హ్యాకర్లు, సయ్యద్ వెనకున్న పార్టీలు, సంస్థలను నిర్దాక్షిణ్యంగా కట్టడి చేయకపోతే అబద్ధం అరవైసార్లు చుట్టి వచ్చే ప్రమాదం వుంది. 37 ఏళ్ల సయ్యద్ షుజా చెప్పేదానిని నమ్మించే ప్రయత్నం చేస్తున్న 125 ఏళ్ల కాంగ్రెస్‌ను ఏమనాలి?

ఇవన్నీ వింటుంటే- ఈ 'క్రైమ్‌స్టోరీ'లో తెలుగు నాయక రచయితలెవరో పాల్గొన్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఈ ఆరోపణల్లో అసత్యాల్లో ఇక్కడి పేర్లు, వాతావరణం ఈకథలో ప్రతిబింబించింది కాబట్టి దీనిపై తక్షణ దర్యాప్తు వెంటనే పూర్తికావాలి. 'ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్'కు చెందిన ఆశిష్ రే ఆహ్వానం మేరకు లండన్ వెళ్లానంటున్న కపిల్ సిబాల్ పాత్రపై, ఆయన వెనకున్న కాంగ్రెస్ పార్టీ, రాహుల్, సోనియా పాత్రలపై విచారణ జరగాలని భాజపా కోరుతున్నది.

'దేశాన్ని కాపాడిన సర్జికల్ స్ట్రైక్‌పై సాక్ష్యం అడిగిన కాంగ్రెస్ పార్టీ నిరాధార ఆరోపణలతో దేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నవారిని మాత్రం సాక్ష్యాలు అడగడం లేదు'' అని భాజపా అంటున్నది. అభూత కల్పనలతో, అసత్య ఆరోపణలతో సాగుతున్న 'ఎన్నికల జూదం' ఎలాంటి ఫలితం ఇస్తుందో చెప్పలేం కానీ మనపై మనకు నమ్మకాన్ని మాత్రం సన్నగిల్లేట్లు చేస్తున్నది. సాక్ష్యం లేకుండా అబద్ధాలను ప్రచారం చేసే ఈ ట్రెండ్ ఇంకెంత కాలం?

-డా.పి.భాస్కరయోగి

తరగతి గది ఒక శోధనాశాల

కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు ప్రశ్న వేయగానే సమాధానమిచ్చే విద్యార్థిని తెలివైన వాడిగా పరిగణిస్తారు. ప్రశ్నవేయగానే కొంతమంది పిల్లలు ఆలోచిస్తూ ఉంటారు. పూర్వజ్ఞానంలో దాన్ని కలుపుకుంటారు. అదొక లెక్కయితే పాత లెక్కలను జ్ఞాపకం చేసుకుంటారు. అది వృథా శ్రమ కాదు. ఇచ్చిన లెక్కకు, అడిగిన ప్రశ్నకు ఏమైనా పోలికలున్నాయా? అని పరిశోధిస్తూ ఉంటారు. ఆ పరిశోధనలో సమాధానం రాబట్టే ప్రయత్నం చేస్తుంటారు. విద్యార్థి తన జ్ఞాపకాలను శోధిస్తున్నాడు కాబట్టి మనం తక్షణమే సమాధానం ఆశించటం సరైంది కాదేమో అనిపిస్తుంది. ప్రశ్న వేసిన తర్వాత పిల్లలందర్నీ శోధనా ప్రక్రియలోకి దించాలి. ఇలాంటి అలవాటే మానసికశాస్త్ర ప్రకారం కూడా సరైందని, దీనిపైన మానసిక శాస్త్రజ్ఞులు విద్యార్థి మెదడులో ఏయే ప్రక్రియలు జరుగుతాయో వాటి ఫొటోలు తీశారు. మనకు ఒక ఫొటోలోవున్న శరీరంలోని భాగాలన్నింటి సమూహం ఇస్తే ఆ వస్తువులను రూపొందించటం ఎంత కష్టమో విద్యార్థి కూడా ఆ భాగాలన్నింటినీ అమర్చుకుని సమాధానం చెప్పవలసి ఉంటుంది. దీన్ని పరిశీలించదలుచుకుంటే ఒక కథలోని రెండు,



మూడు సంఘటనలు చెప్పి కథను అల్లమనండి. దాన్నే డీ-కోడింగ్ అంటారు. ఇది ఒక రకమైన విద్య. దీన్ని అలవాటు చేయటానికి శరీరంలోని రెండు మూడు అంగాలను ఇచ్చి బొమ్మను గీయటం చేయాలి. ఈ ప్రక్రియను అందరూ ఒకేలా ఒకే సమయంలో చేయలేరు. తొందరగా సమాధానం చెప్పినవాడే ఆలోచిస్తున్నాడని అనుకోవటం పొరపాటే. విద్యార్థి నేపథ్యాన్ని బట్టి ఆ ప్రక్రియ జరుగుతుంది. ఉపాధ్యాయుడు తన ఇంట్లో గంటలకొద్దీ ఆలోచించిన ప్రశ్నకు విద్యార్థి క్షణాల్లో సమాధానం చెప్పాలని ఆశించటం సరైంది కాదేమోనని నా అనుమానం. అందుకే తరగతి గది ఒక శోధనాశాల.

ఆలోచన- అవగాహన...

ఒకనాటి విద్యావేత్తలు 'మైండ్ ఈజ్ ఏ క్లీన్ స్లేట్' (మెదడు అనేది ఖాళీ పలక) అన్నారు. దానిమీద ఏమైనా రాయవచ్చుననే భావనను కలిగించారు. నేటి విద్యావేత్తలు మెదడు అనేది ఖాళీ పలక కాదని దానికి సంగ్రహణ శక్తి ఉందంటున్నారు. విద్య కేవలం దాన్ని ప్రేరేపించటమే. మైండ్ అనేది తీగల చుట్ట. న్యూరో కణాలతో ఏర్పడ్డ తీగలచుట్ట అది. దానికి సమాధానం అందిస్తే జ్ఞానంగా మార్చుతుంది. దానినే మనం అండర్‌స్టాండింగ్ అంటాం. ఇంద్రియాల ద్వారా పుట్టినప్పటినుంచి జ్ఞాన సంగ్రహణ చేస్తూనే ఉంటారు. కొందరు తల్లిగర్భంలో ఉన్నప్పుడే ఇది ఆరంభమౌతుందంటారు. తల్లిగర్భంలో ఉన్నప్పుడు మంచి సంగీతం, మంచి పద్యాలో, గొప్ప కథలో, చారిత్రకమైన విశిష్టతలను తల్లికి చెబుతారు. ఆ విషయ గ్రహణం తల్లిగర్భంలో ఉన్నప్పుడే జరుగుతుంది. మనం ఇచ్చే సమాచారాన్ని జ్ఞానంగా మార్చగలశక్తి మెదడుకుంది. ఆ సమాచారాన్ని ప్యాటర్న్స్‌గా గుర్తించే శక్తి, ఆలోచించే శక్తి మేధస్సులోనే ఉంది. పరిజ్ఞానంతో విద్యార్థిని ఆలోచింపచేయటమే ఉపాధ్యాయుని విధి. ఆ ఆలోచననే అవగాహన అంటాం. ఉపాధ్యాయుడు అవగాహనకు అవకాశం కల్పించాలి. ఆ అవగాహనకు ఇంటి వాతావరణం, సంస్కృతి తోడ్పడుతుంది. మేధాశక్తిని బలపరచటానికి ఆహారం ఉపయోగపడుతుంది. శిశువుకు సరైన ఆహారం ఇవ్వడం గ్రాహ్యశక్తికి దోహదం చేస్తుంది. ఆహారం మేధస్సును పుష్టికరం చేస్తుంది. పిల్లలు అవగాహనాశక్తిని పెంచేందుకు మేధస్సు కణాలను తెరిపించాలి. మానవ మేధస్సు పెద్ద కంప్యూటర్. కంప్యూటర్‌ను చార్జ్ చేయించినట్లుగా మేధస్సు కణాలను తెరిపిస్తే అది ఆలోచిస్తుంది. ఆలోచనతో అవగాహన పెరుగుతుంది. ఈ పని తరగతి గది చేయాలి.

-చుక్కా రామయ్య

రాజకీయ కామెడీ!

జనాంతికం
బుద్ధా మురళి
buddhamurali2464@gmail.com

''ప్రియాంక రాజకీయాల్లోకి వస్తున్నారట!''

''చిరంజీవి సినిమాల్లోకి వస్తారట అన్నట్టుగా ఉంది నీ మాట''

''చాల్లే జోకులు.. ఇప్పటి వరకు అప్పుడప్పుడు ప్రచారం చేసే వారు ఇకపై పూర్తి స్థాయిలో రాజకీయాల్లో ఉంటారన్నమాట''

''ఎన్నికలు వస్తున్నాయి కదా? ప్రియాంకనే కాదు పవన్ కూడా క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చేస్తాడు''

''నువ్వు ఏదీ సరిగా మాట్లాడవుకదా?''

''ఎంత శక్తివంతమైన ఆయుధమైనా సకాలంలో ఉపయోగిస్తేనే ఫలితం..''

''అంటే అరవై ఏళ్ల వయసు, పాతికేళ్ల కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత, విపరీతమైన సినీగ్లామర్ ఇంతకు మించి కలిసొచ్చే కాలం లేదని ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు చూడు.. అదే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం అంటే''

''సరైన సమయంలో సరైన నిర్ణయానికి ఎన్టీఆర్ పాజిటివ్ ఉదాహరణ ఐతే చిరంజీవి దీనికి సరిగ్గా వ్యతిరేక ఉదాహరణ''

''అంటే ప్రియాంక చిరంజీవిలా ఫైయిలవుతుందా?''

''ఇందిరాగాంధీ ఫీచర్స్ ఉండొచ్చు కానీ ఆమెలా విజయవంతమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు..''

''అది నువ్వెలా నిర్ణయిస్తావు. నిర్ణయించాల్సింది ప్రజలు''

''కాదని ఎవరన్నారు? ప్రజలే నిర్ణేతలు. నేను నా అంచనా చెబుతున్నాను. శంకరాభరణం ఇప్పుడు తీస్తే హిట్టవుతుందా?''

''కాదు..''

''ఎందుకు కాదు అది అద్భుతమైన సినిమా కదా? పోనీ మిస్సమ్మ, గుండమ్మ కథ, మాయాబజార్ ఇప్పుడు తీస్తే హిట్టవుతాయా?''

''ఆ స్థాయిలో తీయలేరు''

''ఎందుకు తీయలేరు? అప్పుడు లేని టెక్నాలజీ ఇప్పుడు ఉంది. ఇంకా అద్భుతంగా తీయవచ్చు కదా?''

''నీతో వాదించలేను. ఆ కాలానికి శంకరాభరణం అవసరం కాబట్టి అది హిట్టయింది. టెక్నాలజీ పెరిగింది కానీ కాలం మారింది. ఈ కాలానికి మిస్సమ్మలు, గుండమ్మలు అవసరం లేదు. కొత్తనీరు వస్తున్న దశలో దాన్ని గుర్తించకుండా కాలం తీరిన తరువాత వాణిశ్రీ హీరోయిన్‌గా కాంతారావు సినిమా తీసి నిండా మునిగిపోయారు. 2004లో ఓ చానల్‌ను టాప్‌లో నిలిపిన తింగరి వేషాలిచ్చిన ఫార్ములాతో 2019లో మరో చానల్ వస్తే పట్టించుకున్నవాడే లేడు. అప్పుడు సక్సెస్ ఐన ఫార్ములా ఎల్లకాలం సక్సెస్ కావాలని లేదు. దేనికైనా కాలం ముఖ్యం.''

''అంటే ప్రియాంక రావడానికి ఇంకా కాలం రాలేదంటావా?''

''కాలం రాకపోవడం ఏంటి? ఎప్పుడో వచ్చి వెళ్లిపోయింది. ఒకటిన్నర దశాబ్దాల ఆలస్యం అయింది! దేశానికి అవసరమైన కాలానికి ఇందిర నాయకత్వం లభించింది. ఆమెను ప్రధాని పదవి వరించింది. ఎన్టీఆర్ అవసరం అయిన కాలానికి ఆయనను జనం ఆదరించారు. కాలం మారాక అదే ఎన్టీఆర్ తనను వెన్నుపోటు పొడిచారని నల్లదుస్తులు వేసుకుని ఎంత తిరిగినా స్పందన రాలేదు.''

''అమ్మ ప్రేమకు కాలం చెల్లడం ఉంటుందా?''

''అమ్మ ప్రేమ, సమాజమే దేవాలయం, ప్రేమికుల ప్రేమ సినిమా డైలాగులు కాదు.. రాజకీయాల గురించి చెబుతున్నా..''

''వచ్చే ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయంటావు''

''ప్రజలు ఎవరికి ఓటు వేస్తే వారు గెలుస్తారు''

''అబ్బో.. ఇంతోటి గొప్ప విషయం మీరే చెప్పాలి! మాకు తెలియదు. ఆయనెవరో ఈవీఎంలను ట్యాంపర్ చేశారని విదేశాల్లో విలేఖరుల ముందు చెప్పాడు..''

''2004లో అధికారంలోకి వచ్చిన కొత్తలో వైఎస్‌పై కేఏ పాల్ ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. ఆయన మరింతగా రెచ్చిపోయి వైఎస్‌తో మొదలుపెట్టి సోనియా, అటు నుంచి అమెరికా అధ్యక్షుడు, ప్రపంచ నాయకులందరినీ తాను ఎలా నడుపుతున్నది చెప్పేసరికి వ్యవహారం సీరియస్ నుంచి కామెడీ సీరియల్‌గా మారిపోయింది. మొగలిరేకులు కన్నా కొంచం తక్కువ వయసు, జబర్దస్తీని కన్నా ఎక్కువ కాలం నుంచి సాగుతోంది ఈ కామెడీ సీరియల్. ''

''నిజమే జబర్దస్త్ ఓ ఎంటర్‌టైన్‌మెంట్ చానల్‌ను బతికిస్తుంటే, కేఏ పాల్ న్యూస్ చానళ్లను బతికిస్తున్నాడు.''

''పాల్‌కు, ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధం ఏంటి?''

''ఈవీఎంల ట్యాంపరింగ్ తెలిసిందని 11 మందిని హైదరాబాద్‌లో ఎన్‌కౌంటర్ చేశారని, ఓ కేంద్రమంత్రిని రోడ్డుమీద చంపేశారని, ట్యాంపరింగ్ గురించి తెలిసిందనే జర్నలిస్టు గౌరీ లంకేశ్‌ను చంపేశారని చెబుతుంటే ఎందుకో పాల్ గుర్తుకొచ్చాడు..''

''నాకూ అలానే అనిపించింది. అద్వానీని పక్కన పెట్టడం, ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, జగన్‌పై కేసులు.. వీటన్నిటికీ ఈవీఎంల ట్యాంపరింగే కారణమని చెబుతాడేమో అనిపించింది ఆ జాబితా చూశాక''

''ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడాలి.. ఈ సంగతి తెలిస్తే ఎవరైనా మన్మోహన్ సింగ్ అవుతారు. తెలియకపోతే పాల్ అవుతారు. ''

''ఇన్ని చెబుతున్నావుకదా? ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పు''

''ఆంధ్రలో ముఖ్యమంత్రిని అవుతానని పాల్ అంత ధీమాగా చెప్పిన తరువాత కూడా నీకు అనుమానంగా ఉందా?''

''నేను సీరియస్‌గా అడుగుతున్నా..?''

''నేనే కాదు, పాల్ కూడా సీరియస్‌గానే చెబుతున్నాడు. తనకు ఇష్టం లేదని, గత్యంతరం లేకనే ముఖ్యమంత్రి పదవి చేపట్టాల్సి వస్తుందని అంటున్నాడు..''

''ఔను.. ప్రపంచానికి నాయకత్వం వహించి 200 దేశాల నాయకులను తన చెప్పు చేతుల్లో ఉంచుకునే వాడికి ఒక రాష్ట్రానికే పరిమితం కావాలంటే ఇబ్బందే కదా?''

''పాల్ రెండు వందల దేశాలు అని చెప్పలేదు''

''ఏదో అభిమానంతో నేనో పది దేశాలు కలిపాను. ఏం నాకు ఆ మాత్రం స్వేచ్ఛ లేదా? పాల్ అంటే అభిమానం ఉంటే తప్పా?''

''సీరియస్‌గా అడిగితే జోక్ చేస్తావేం?''

''ప్రజలు ఎవరికి ఓటు వేస్తే వారు గెలుస్తారు అంటేనేమో అబ్బో ఈ మాత్రం మాకు తెలియదా? అంటావు. నేనే గెలుస్తానని పాల్ చెప్పిన సంగతి చెబితే సీరియస్‌గా చెప్పమంటావు?''

''నీకు రాజకీయాలంటే కామెడీగా కనిపిస్తున్నాయా?''

''కాదు.. బాధను కలిగిస్తున్నాయి. ప్రజలకు వినోదం, విజ్ఞానం పంచాల్సిన ఎంటర్‌టైన్‌మెంట్ చానళ్లు హత్యలు, నేరాలు చేయడం నేర్పించే శిక్షణ సంస్థలుగా మారితే, ప్రజల జీవితాలను శాసించే, ప్రభావం చూపే రాజకీయాలు కామెడీగా మారిపోవడానికి మించిన దురదృష్టం ఏముంటుంది?''

★

లోక్‌సభ ఎన్నికల్లో దూసుకెళ్తాం

❒ సంపూర్ణ బలంతో పోటీ ❒ బీజేపీ ఓటమే ప్రధాన అజెండా
❒ కాంగ్రెస్ చీఫ్ రాహుల్ వెల్లడి ❒ ప్రియాంక రాకతో పార్టీ బలోపేతం

అమేథీ, జనవరి 24: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ బలంతో ఎన్నికలు వెళ్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించారు. అమేధీలో రెండు రోజుల పర్యటన వచ్చిన ఆయన గురువారం ఓ బహిరంగ సభలో ప్రసంగించారు. తన సోదరి ప్రియాంక గాంధీ రాకతో యూపీలో పార్టీ బలోపేతమవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో పార్టీ బలపడడంతో పాటు వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంపూర్ణ బలంతో వెళ్తామని రాహుల్ వెల్లడించారు. ప్రియాంక గాంధీ ఎప్పటి నుంచో రాజకీయాల్లోకి వస్తారన్న కథనాలు వచ్చాయి. ప్రియాంకను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాహుల్ ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే కాంగ్రెస్ ఎంపీ జ్యోతిరాదిత్యను యూపీ పశ్చిమ విభాగం ఇన్‌చార్జిగా నియమించారు. యూపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు టార్గెట్ ప్రియాంక, సింధియా మందు ఉంచినట్టు కాంగ్రెస్ చీఫ్ వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. 'నరేంద్ర మోదీలాగా ముక్త్ బీజేపీ అని నేను అనను. ఎదుట వారి పట్ల మర్యాదగానే ఉంటాం'అని రాహుల్ ఎద్దేవా చేశారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ లేదా తమిళనాడు ఎక్కడైనా కాంగ్రెస్ సంపూర్ణ బలంతోనే పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. యూపీలో అధికారం కైవసం చేసుకుంటామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ బలంతో పోటీచేస్తాం. ఈ విషయంలో



ఎలాంటి వెనుకడుగు ఉండదు'అని ఆయన స్పష్టం చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణంలో ప్రధాని మోదీనే ప్రధాన సూత్రధారని ఆయన మరోసారి ఆరోపించారు. బడా పారిశ్రామిక వేత్తల రుణాలు మాఫీ చేయడం, వారికి ప్రయోజనాలు చేకూర్చడం కోసమే మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. దేశానికి కాపలాదారునని చెప్పుకున్న మోదీ జాతీయ సంపదను పెద్దలకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. 'గాలి గాలి మెయిన్ షోర్ హై, చౌకీదార్ ఛోర్ హై'అని ఆయన వ్యంగ్యోక్తులు విసిరారు. బహిరంగ సభకు ముందు గురువారం ఉదయం రాహుల్ శివాలయాన్ని సందర్శించారు. అతిథి గృహంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. సలోన్ ప్రాంతంలో బహిరంగ సభలో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కోసం తాను, తన తల్లి సోనియా, సోదరి ప్రియాంక సైనికుల్లా పనిచేస్తున్నామని చెప్పారు. అమేధీ, రాయ్‌బరేలి నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు పెట్టని కోటలు. 2014 ఎన్నికల్లో రాహుల్ అమేధీ నుంచి నెగ్గారు. సోనియా రాయ్‌బరేలి నుంచి విజయం సాధించారు. రెండు నియోజకవర్గాలతో పాటు మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి, సీఎం యోగి ఆదిత్యనాథ్ నియోజకవర్గం గోరఖ్‌పూర్ యూపీ తూర్పు విభాగం కిందకే వస్తాయి. తూర్పు విభాగం ఇన్‌చార్జి బాధ్యతలు ప్రియాంకకు అప్పగించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆయన తండ్రి ములాయం సింగ్ యాదవ్ అంటే తమకు ఎంతో గౌరవమని రాహుల్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మోదీ అమలుచేయలేకపోయారని ఆయన విమర్శించారు. తన నియోజకవర్గం అభివృద్ధిని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన తీవ్ర విమర్శ చేశారు. మోదీ, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాలు అన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశాయని ఆయన అన్నారు. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను బీజేపీ విభజిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. 'మోదీ అంటేనే ద్వేషం. అందరి పట్లా ఆయన అదే తీరుతో వ్యవహరిస్తారు'అని రాహుల్ విమర్శించారు.



గుర్గావ్‌లో 65వ సెక్టార్‌లోని ఉల్లావాస్ గ్రామంలో కుప్ప కూలిపోయిన బహుళ అంతస్తుల భవనం

కుప్పకూలిన భవనం


ఆరుగురు కార్మికుల మృతి ❒ గుర్గావ్‌లో ఘటన

గుర్గావ్, జనవరి 24: ఇక్కడ 65వ సెక్టార్‌లోని ఉల్లావాస్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం కూలిపోయి ఆరుగురు కూలీలు దుర్మరణం చెందారు.

ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు జాతీయ విపత్తుల నివారణ దళం(ఎన్‌డీఆర్‌ఎస్) వెల్లడించింది. సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. 35 మంది సభ్యులతో కూడిన మూడు బృందాలు పనిచేస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలిందన్న బృందాలు శిధిలాల కింద ఒకరిద్దరు చిక్కుకుని ఉంటారన్న అనుమానం వ్యక్తం చేశారు. ఘజియాబాద్ నుంచి రెండు టీమ్‌లు, ద్వారక నుంచి ఒక టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయని ఆ ప్రతినిధి తెలిపారు. గుర్గావ్‌లోని అగ్నిమాపక దళ శాఖ కంట్రోల్ రూమ్‌కు ప్రమాదానికి సంబంధించి ఉదయం 5.15 గంటలకు సమాచారం అందింది. ఎన్‌డీఆర్‌ఎస్ బృందాలతోపాటు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నట్టు ఆయన చెప్పారు. కాంక్రీట్, ఇనుప ఊచలు, శిధిలాల వల్ల సహాయ కార్యక్రమాలకు అవరోధంగా మారిందని అగ్నిమాపక అధికారి ఇషామ్ సింగ్ వెల్లడించారు. బిల్డర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

రామ్‌దేవ్ బాబాపై వీడియో తొలగించండి

❒ సామాజిక మాధ్యమాలకు హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, జనవరి 24: యోగాగురు రామ్‌దేవ్ బాబాను కించపరిచేలా ఉన్న అన్ని లింకులను తొలగించాలని ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్‌లను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. రామ్‌దేవ్‌కు సంబంధించిన వీడియోలను తీసేయడం లేదా బ్లాక్ చేయాలని యూట్యూబ్‌కూ కోర్టు స్పష్టం చేసింది. వీడియోలు అప్‌లోడ్ చేసిన ఖాతాదారు వివరాలు సీల్డ్ కవర్‌లో ఉంచి తమకు అందజేయాలని సామాజిక మాధ్యమాలకు తాత్కాలిక ఆదేశాలు ఇచ్చింది.

భూపాల్‌పల్లి మైనింగ్‌పై విచారణ 8కి వాయిదా

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 24: భూపాలపల్లిలో జరుగుతున్న 'ఓపెన్ కాస్ట్ మైనింగ్' నిలిపివేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో దాఖలైన పిటిషన్‌పై విచారణ ఫిబ్రవరి 8కి వాయిదా పడింది. నివాస ప్రాంతాలకు సమీపంలో జరిగే పేలుళ్లువల్ల వచ్చే ప్రకంపనాలకు గృహాలు దెబ్బతింటున్నాయని, పిల్లలు, వృద్ధులు, మహిళలు భయాందోళనలకు గురవుతున్నారని రాజలింగమూర్తి ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో తెలంగాణ ప్రభుత్వానికి, కేంద్ర పర్యావరణ శాఖకు ఎన్జీటీ నోటిసులు జారీచేసింది. అయితే పర్యావరణ నిబంధనలు పాటించడం లేదంటూ ఎన్జీటీకి కేంద్ర పర్యావరణ శాఖ నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. గురువారం ట్రిబ్యునల్‌లో ఈ పిటిషన్ విచారణ రాగా.. తుది వాదనలు ఫిబ్రవరి 8న వింటామని ట్రిబ్యునల్ బెంచ్ పేర్కొంది.

ప్రమాద స్థాయిలో వాయుకాలుష్యం

❒ ఢిల్లీలో మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
❒ కాలుష్య నియంత్రణ మండలి హెచ్చరిక

న్యూఢిల్లీ, జనరి 24: ఢిల్లీలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో, మళ్లీ వాయు కాలుష్యం పెరిగింది. ప్రస్తుతం వాయు కాలుష్యం తీవ్రత హెచ్చుగా ఉందని, మంచి వాతావరణం స్థాయి లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ప్రస్తుతం ఢిల్లీలో వాయు కాలుష్యం సూచిక 328 నమోదైంది. 100 నుంచి 200 మధ్య ఉంటే ఒక మాదిరి కేటగిరీ కిందకు, 201-300 మధ్య ఉంటే అధ్వాన్నమని, 301-400 మధ్య నమోదైతే అత్యంత అధ్వాన్న స్థాయిలో వాయుకాలుష్య సూచిక ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఢిల్లీలో వాయుకాలుష్యం ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి కోరింది. నోయిడా, ఫరీడా, ఘాజియాబాద్, గుర్గావ్, గ్రేటర్ నోయిడాలో వాయుకాలుష్య సూచికలు అధ్వాన్న స్థాయిలో నమోదవుతున్నాయి. వచ్చే రెండు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని మండలి శాస్త్రవేత్తలు చెప్పారు.

కరవు కాటకాలను ఎదుర్కోవడంలో భేష్

❒ భారత్‌ను ప్రశంసించిన ఐక్యరాజ్య సమితి

ఐరాస, జనవరి 24: కరవు కాటకాలను ఎదుర్కోవడంతో భారత దేశం అత్యంత ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తోందని ఐక్యరాజ్య సమితి సదస్సు స్పష్టం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న ప్రతికూల ధోరణులను ఎదుర్కొనేందుకు భారతదేశం తీసుకుంటున్న చర్యలను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికింది. ఐరాసకు చెందిన ఈ విభాగం కార్యదర్శి మొనిక్ బార్బుట్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే సదస్సు ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో అక్టోబర్ 7, 8 తేదీల్లో జరుగుతుందని ప్రకటించారు. 169 దేశాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో 2000 సంవత్సరం నుంచి నిస్సారమైపోతున్న భూమి పరిరక్షణ గురించి కూలంకషంగా చర్చించారు. అంతర్జాతీయంగా ఏర్పడుతున్న ప్రతికూల ఫలితాలు.. వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన పరిజ్ఞానంపై సూచనలు సలహాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇండియాలో కరవు కాటకాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొన్న తీరు మిగతా దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భగం బార్బుట్ పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే భారత్ నేతృత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

రాష్ట్రానికి గతంలో కంటే ఎక్కువ నిధులే ఇచ్చాం

❒ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ❒ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిపై విమర్శలు



జాయ్‌నగర్, జనవరి 24: కాంగ్రెస్ హయాంలో కంటే రాష్ట్రానికి ఎక్కువ నిధులే ఇచ్చామని కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో గురువారం బీజేపీ నిర్వహించిన ర్యాలీలో మంత్రి ప్రసంగించారు. గత యూపీఏ ప్రభుత్వం రాష్ట్రానికి లక్ష కోట్లు కేటాయిస్తే, 14 ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు 2.80 లక్షల కోట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్'ను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అమలు చేయడం లేదని, కుటుంబంలో ఎవరికైనా అనుకోని అనారోగ్యం సంభవిస్తే ఈ పథకం కింద రూ.5 లక్షల విలువైన వైద్య సేవలు పొందే అవకాశం చేజారిపోతుందని మంత్రి అన్నారు. మరి ఇంత మంచి పథకాన్ని మమత ఎందుకు అమలుచేయడంలేదో ప్రజలు నిలదీయాలని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఇతర పథకాలకుతోడు జన్‌ధన్ యోజన పథకం కింద రాష్ట్రంలో 2.26 లక్షల మంది లబ్ధిపొందారని వెల్లడించారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే మమతా బెనర్జీ కేంద్ర పథకాలకు మోకాలడ్డుతోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ విమర్శించారు.

రైల్వేలో ఉద్యోగాల భర్తీ ఎన్నికల జిమ్మిక్కే

❒ కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ధ్వజం



న్యూఢిల్లీ, జనవరి 24: రైల్వే శాఖలోని సుమారు మూడు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మోదీ ప్రభుత్వం చేసిన ప్రకటన మరో జిమ్మిక్కు అని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం విమర్శించారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్లు చేస్తూ రైల్వే శాఖలాగే పలు ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని సైతం భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైల్వేలో గత ఐదేళ్లుగా 2,82,976 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇన్నాళ్లూ దాని గురించి పట్టించుకోని మోదీ ప్రభుత్వం ఇప్పుడు హఠాత్తుగా నిద్రలేచి మూడు నెలల్లో వాటిని భర్తీ చేస్తామని అనడం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిన జిమ్మిక్కు మాత్రమేనని విమర్శించారు. రైల్వే మంత్రి పియూష్ గోయల్ బుధవారం చేసిన ప్రకటనలో రైల్వేశాఖలో 1.31 లక్షల పోస్టులను వచ్చే ఆరునెలల్లో, మరో లక్ష పోస్టులను రానున్న రెండేళ్లలో భర్తీ చేస్తామని ప్రకటించారు. రైల్వేలో 15,06,598 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 12,23,622 మంది మాత్రమే ఉన్నారు. 2,82,976 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో 1,51,548 పోస్టులను ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేయగా, ఇంకా 1,31,428 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి.

విచారణ నుంచి తప్పుకున్న సిక్రీ

❏ సీబీఐ డైరెక్టర్ నాగేశ్వరరావు నియామకం కేసు నేటికి వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 24: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారించే ధర్మాసనం నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ తప్పుకున్నారు. దీంతో ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను తొలగించిన ఉన్నత కమిటీలో జస్టిస్ సిక్రీ సభ్యుడుగా ఉన్నారు. ఈ కేసు గురువారం విచారణకు వచ్చిన వెంటనే, తాను ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ సిక్రీ సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావేకు తెలిపారు. పిటిషన్‌దాఖలు చేసిన ఎన్‌జీవో కామన్ కాజ్ సంస్థ తరపున దావేవాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసు విచారణను మీరే చేస్తే బాగుంటుందని న్యాయవాది దావే కోర్టుకు తెలిపారు. ఇదే కేసును సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను విచారించే ధర్మాసనం నుంచి గత సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ తప్పుకున్నారు. ఈ సందర్భంగా అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌వాదనలు వినిపిస్తూ, జస్టిస్ సిక్రీ ఈ కేసును విచారిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కాగా పిటిషనర్ తన పిటిషన్‌లో సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకంలో పారదర్శకత ఉండాలన్నారు. ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు నాగేశ్వరరావును నియమించలేదన్నారు.

జూలై 31లోగా ఎన్‌ఆర్‌సీ పూర్తి

❏ అసోం ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ, జనవరి 24: అసోంలో పౌరసత్వ నిర్ధారణకు ఉద్దేశించిన జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) తయారీని ఈ ఏడాది జూలై 31లోగా పూర్తి చేయాలని, దానిని పొడిగించరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో త్వరలో సారస్వత ఎన్నికలు వస్తున్నాయని, అయితే దాని ప్రభావం ఎన్‌ఆర్‌సీ తయారీ ప్రక్రియపై ఉండరాదని, దీనిపై అధికార యంత్రాంగం సమావేశమై ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. దీని నిమిత్తం అసోం ప్రభుత్వం, ఎన్నికల కమిటీ కార్యదర్శి, ఎన్‌ఆర్‌సీ కోర్డినేటర్‌లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ సమావేశాన్ని వారం రోజుల్లో జరపాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమనల్‌లతో కూడిన ధర్మాసనం అసోం ప్రభుత్వం తరపున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు తెలిపింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, ఇతర అంశాలను కేసు తదుపరి విచారణ తేదీ ఫిబ్రవరి ఐదున కోర్టుకు తెలియజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

ప్రకృతి విపత్తుల ముప్పుపై పోరాటానికి అనాసక్తి

యూఎన్ చీఫ్ ఆంటోనియా

దావోస్, జనవరి 24: వాతావరణంలో సంభవించే తీవ్రమార్పుల కారణంగా ప్రపంచానికి ఏర్పడే ముప్పును ఎదుర్కోవడంలో సంయుక్తంగా పోరాడే విషయంలో వివిధ దేశనేతల్లో చిత్తశుద్ధి తగ్గుతూ వస్తోందని, చాలామంది దీనిపై అనాసక్తిగా ఉన్నారని, ఇది ప్రమాదకర ధోరణి అని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియా గుటెర్రస్ హెచ్చరించారు. ఇక్కడ జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ తన ఉద్దేశంతో సమీప భవిష్యత్‌లో ప్రకృతి విపత్తుల ముప్పు ప్రపంచానికి పొంచి ఉందని చెప్పారు. అయితే మనం దానిని ఎదుర్కొనే రేసులో వెనుకబడిపోతున్నామని, వాతావరణంలో మార్పులు అతివేగంగా జరుగుతుండగా, దానిని ఎదుర్కొనే దిశగా మనం సనద్ధం కాలేకపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలను ఎదుర్కోవడానికి మనకు వాణిజ్య రంగం నుంచి, ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నా రాజకీయ నేతల నుంచి మాత్రం ఆశించిన స్పందన రావడం లేదని అన్నారు. అసలు వాతావరణం నుంచి మనకు ముప్పుందా అని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారని, తన ఉద్దేశంలో రానున్న కాలంలో వాతావరణంలో సంభవించే పెనుమార్పుల కారణంగా ప్రపంచంలో విపత్తులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని ఆయన అన్నారు.

యూనివర్శిటీ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వాలి

❏ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 24: దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్శిటీల్లోని ఉద్యోగాల భర్తీకి రిజర్వేషన్ అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తోందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఢిల్లీలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో కొన్నేళ్లుగా అమలవుతున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా నూతన రిజర్వేషన్ పాలసీని అవలంబిస్తూ రిజర్వేషన్ వర్గాలకు దక్కాల్సిన ఉద్యోగాలకు కేంద్రం గండికొడుతోందని ఆరోపించారు. గతంలో రిజర్వేషన్ల అమలులో యూనివర్సిటీని ఒక యూనిట్‌గా తీసుకునేవారని, ఇప్పుడు దానికి విరుద్ధంగా డిపార్ట్‌మెంట్‌ను యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్ల అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విలేఖరుల సమావేశంలో బీసీ మహాజన సమితి అధ్యక్షుడు యు.సాంబశివ రావు, ఓబీసీ విద్యార్థి సంఘం, జేఎన్‌యూ నాయకుడు డా. అంజయ్య పాల్గొన్నారు.

'కృత్రిమ మేధ'పై నియమాలు అవసరం


మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల



దావోస్, జనవరి 24: వ్యక్తిగత గోప్యత అన్నది మానవహక్కుగా ఉంటున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏ 1)ను మనం పూర్తి స్థాయిలో ఉపకరించే ముందు దానికి కొన్ని నియమాలను ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉందని మైక్రోసాఫ్ట్ చీఫ్ సత్యనాదెళ్ల చెప్పారు. దీనికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా విస్తృతమైన చర్యలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రపంచం ఇప్పుడు సాంకేతిక బాటలో నడుస్తోందని, ప్రతి హెల్త్, రిటైల్ కంపెనీ డేటా గురించి ఆలోచించాలని అన్నారు. ప్రైవసీని మనం మానవహక్కుగా భావిస్తామని, అయితే కొనుగోలుదారుడే మన దగ్గర ఉన్న డేటాకు యజమానిగా భావించాలన్న కోర్ సూత్రాన్ని మనం అనుసరించాల్సిన అవసరం ఏర్పడిందని, కేవలం సాంకేతిక సెక్టారే కాదు మొత్తం ఆర్థిక వ్యవస్థకు సైతం ఇది వర్తిస్తుందని అన్నారు. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) గురించి ఆయన మాట్లాడుతూ తన అభిప్రాయం ప్రకారం ప్రైవసీ అన్నది మానవహక్కు అనే అంశానికి ఇది అద్భుతమైన ప్రారంభమని పేర్కొన్నారు. అమెరికాలో తాము ఇదే ధోరణిని కొంతమేర పాటిస్తున్నామని, మిగతా ప్రపంచం సైతం ఇదే బాటలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆల్గరిథమ్స్, మెషిన్ లెర్నింగ్ గురించి ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) సృష్టికర్తలుగా దీనికి కొన్ని సూత్రాలను ఉపకరించాల్సి ఉందని అన్నారు. సురక్షిత విధానానికి తోడ్పడేలా మైక్రోసాఫ్ట్ ఒక సాఫ్ట్‌వేర్ తయారు చేయాల్సి ఉందని అన్నారు. ఇదే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు సైతం వర్తిస్తుందని, అయితే బ్లాక్‌బాక్స్‌తో ప్రధానమైన చిక్కు వస్తోందని అన్నారు. మనం మిషన్‌కు అందించే వివరాలను అందించడమే కాక, దానిని నియంత్రించాల్సిన బాధ్యత కూడా మనుషులదేనని, అయితే మనం అందించే డేటా ద్వారా మిషన్ అందించే అవుట్‌పుట్, తీసుకునే నిర్ణయాలు ఒక్కోసారి నమ్మశక్యంకాని విధంగా, ఆశ్చర్యపరిచేదిగా ఉంటోందని ఆయన అన్నారు. అభివృద్ధి చెందిన సమాజం కావాలంటే వృద్ధి చెందిన సాంకేతికత అవసరమని, మైక్రోసాఫ్ట్ కాని మరెవరైనా కాని సంవిధాన్ని పాటించాలని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, హార్డ్‌వేర్ ఇంజనీర్లు, డిజైనర్లు, డేటా సైంటిస్టులు, ప్రొడక్ట్ మేనేజర్లు ఇలా ప్రతిఒక్కరికీ ఆధునిక సమాజాన్ని సృష్టించడానికి స్టెమ్ సైన్స్, సోషల్ సైన్స్ చాలా అవసరమని సత్యనాదెళ్ల అభిప్రాయపడ్డారు. రానున్న వందేళ్లలో భారత్ మరింత సూపర్‌పవర్‌గా మారుతుందని, దానికి కావాల్సిన శక్తి, సామర్థ్యాలు మనకున్నాయని అన్నారు.

మహిళా సంక్షేమ శాఖ నిర్వహణ కత్తిమీద సవాలు

❏ జనాభాలో 70 శాతానికి సేవలందిస్తున్న శాఖ ❏ కేంద్రమంత్రి మేనకా గాంధీ



న్యూఢిల్లీ, జనవరి 24: దేశ జనాభాలో 70 శాతం ఉన్న మహిళలు, శిశువుల సంక్షేమం, బాగోగులను చూసే బాధ్యత మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఉందని, ఈ శాఖ కత్తి మీద సవాలుతో కూడినదని కేంద్ర మంత్రి మేనకా గాంధీ అన్నారు. గురువారం ఇక్కడ జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, తమ శాఖ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వాటి ఫలాలను మహిళలు, శిశువులకు అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. చాలా మంది అనుకున్నట్లుగా తమ శాఖ సులువైనది కాదన్నారు. ఈ శాఖ నిర్వహణకు నైపుణ్యం, ఓపిక ఉండాలన్నారు. బేటీ బచావో బేటీ పడావో స్కీం నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా ఆమె మాట్లాడుతూ , మంచి భవిష్యత్తు కోసం బాలికలకు సాధికారత అవసరమన్నారు. నందిని నాగరాజ్ అనే బాలిక మాట్లాడుతూ తనకు తల్లితండ్రులు వివాహం చేసేందుకు ప్రయత్నించారని, ఈ విషయం అధికారులకు చెప్పిన వెంటనే రంగంలో దిగి రక్షించారన్నారు. తనకంటే 30 ఏళ్ల పెద్ద వ్యక్తితో వివాహం జరిపించడానికి ప్రయత్నించారన్నారు. తాను ఇప్పుడు బాగా చదువుకుంటున్నానని, ఐఎఎస్ ఆఫీసర్ కావాలనుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా బేటీ బచావో స్కీంను వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

బస్టాండ్లలో సినిమా!

★ మినీ థియేటర్ల నిర్మాణానికి యోచన★ ఆదాయం పెంచుకునే దిశగా ఆర్టీసీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ ఆర్టీసీ బస్టాండ్‌లలో ఇక మినీ సినిమా థియేటర్లు ఏర్పాటు చేయడానికి ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ స్థలాల్లో మినీ సినిమా థియేటర్లను నిర్మించడానికి రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ముందుకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. తొలుత 15 బస్టాండ్‌లలో మినీ థియేటర్ల నిర్మాణానికి కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.నష్టాల నుంచి ఆర్టీసీని లాభాల వైపు మళ్ళించడానికి సంబంధిత ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో ఆదాయ మార్గాలను వెతుకుతున్నారు. నిధుల కోసం ప్రభుత్వాన్ని అడగకుండా స్వంత ఆస్తులతో ఆదాయాలను పెంచుకోవడానికి ఆర్టీసీ అధికారులు వివిధ రంగాలతో చర్చలు కొనసాగిస్తున్నారు. తెలంగాణలో 97 బస్సు డిపోలు, 358 బస్టాండ్‌లు ఉన్నాయని అధికారులు గుర్తు చేశారు. శుక్రవారం ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆదాయాలను పెంచుకోవడానకి ఇప్పటికే వివిధ రూట్లను ప్రైవేట్ యాజమాన్యులకు అప్పజెప్పడం జరిగిందన్నారు. మినీ థియేటర్ల ద్వారా ప్రతియేటా మూడు నుంచి పదకొండు కోట్ల రూపాయల వరకూ ఆదాయం వస్తుందని సర్వేలో తేలిందన్నారు. విజయవాడ బస్టాండ్‌లో మినీ థియేటర్ ద్వారా ఆంధ్రా ఆర్టీసీకి ఆదాయం చేకూరుతోందని చెప్పారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కొల్లూరు., కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్,సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్జర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జున సాగర్, కోదాడ, ఆర్మూర్, బోధన్,చేవేళ్ళ, తాండూర్, వికారాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్‌లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు అవకాశం ఉందని అధికారులు తమ నివేదికల్లో తెలిపారు.

రాష్ట్రంలో మీడియాకు స్వేచ్ఛ లేదు: నర్సిరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: ఆంధ్రప్రదేశ్ వార్తలు తెలంగాణలో ఎందుకు ప్రచురిస్తున్నారని మీడియా పట్ల అసహనం వ్యక్తం చేస్తున్న కేటీఆర్ ఇక్కడ విపక్షాల వార్తలు రాకుండా పత్రికలను నియంత్రించడం వాస్తవం కాదా? అంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఎన్టీఆర్ భవనంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీలో టీవీలు, పత్రికలు కేటీఆర్‌కు అనుకూలంగా ప్రచారం చేయలేందంటూ అక్కసుతో మాట్లాడడం సరైందికాదన్నారు. కేటీఆర్ ప్రతిపక్షాలను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో మంత్రి వర్గం లేకపోవడంతో పాలన కుంటుబడుతున్న అంశం ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. విపక్షాలను విమర్శించడం మానుకుని పాలనపై దృష్టిపెట్టాలని ఆయన సలహా ఇచ్చారు.

శాంతియోధుడు వనీకి అశోక్‌చక్ర

న్యూఢిల్లీ, జనవరి 24: తొలుత ఆయనో ఉగ్రవాది.. తర్వాత తాను తప్పుడు మార్గంలో పయనిస్తున్నానని తెలుసుకున్నాడు. దేశానికి సేవ చేయడానికి సైన్యం ఒకటే మార్గమని నిర్ణయించుకున్నాడు. దాని కోసం శ్రమించి సైన్యంలో చేరి ఉగ్రమూకలతో జరిపిన పోరులో అమరుడయ్యాడు. ఉగ్రవాది నుంచి సైనికుడిగా మారి ముష్కర మూకలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్ వనీ అనే సైనికుడికి సైన్యంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారమైన అశోక్‌చక్ర లభించింది. నాయక్ భార్య మహజాబీన్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును బహూకరించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. గత ఏడాది మిలిటెంట్లతో జరిగిన పోరులో వీరోచిత ప్రతిభ చూపి వీరమరణం పొందినందుకు ఆయనకు ఈ అవార్డును ప్రకటించారు. జమ్మూకాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాకు చెందిన లాన్స్ నాయక్ (38) గత ఏడాది నవంబర్‌లో షోపియాన్ జిల్లాలోని హీరాపూర్ గ్రామంలో ఆరుగురు టెర్రరిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో పాల్గొన్నాడు. ఈ కాల్పుల్లో లష్కర్-ఇ-తోయిబాకు చెందిన ఒక జిల్లా కమాండర్‌ను, మరో విదేశీ ఉగ్రవాదిని తన వీరోచిత పోరాటంలో హతమార్చాడు. అలాగే మరో వ్యక్తిని గాయపర్చాడు. ఈ కాల్పుల్లో అతని తలకు గాయమై చికిత్స పొందుతూ వీరమరణం పొందాడు. ఆయనకు భార్య, అత్తర్ (20), షాషిద్ (18) అనే కుమారులు ఉన్నారు. నాయక్ గతంలో కూడా అత్యంత ప్రతిభ చూపినందుకు 2007, 2008లో సేన అవార్డును పొందాడు. 2004లో మిలటరీలోని 162 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌లో చేరకముందు ఆయన కొంత కాలం మిలిటెంట్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. తర్వాత తన తప్పును తెల్సుకుని పోలీసులకు లొంగిపోయాడు. మొదటి నుంచి నాయక్ ధైర్యం, తెగువ కలిగిన సైనికుడని ఈ సందర్భగా పలువురు ఆయనను గుర్తు చేసుకున్నారు. నిత్యం దేశం గురించి ఆలోచించేవాడని, తమ గ్రామంలోని సమస్యలు, వాటిని ఎలా తీర్చాలే అనే అంశాలపై తమతో చర్చించేవాడని అతని సహచరుడు ఒకరు తెలిపారు. ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆయన భార్య మహాజబీన్ మాట్లాడుతూ ఆయన చూపిన దేశభక్తి మార్గం అనుసరణీయమని, యువతకు తాను దేశభక్తి గురించి ప్రబోధిస్తూ ఉంటానని చెప్పారు. ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శనీయమని ఆమె తెలిపారు.

ఆశా వర్కర్లకు పారితోషికాలు ఇవ్వరా?

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఆశా వర్కర్ల అసోషియేషన్ అధ్యక్ష,ఉపాధ్యక్షులు జయలక్ష్మి, వాణి డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం గత నాలుగు పారితోషికం చెల్లించలేదన్నారు. ఆశా వర్కర్లకు ఎన్నికల ముందు రూ. 1500 రూపాయలు పెంచుతామని కేసీఆర్ హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. గతంలో చెల్లించాల్సిన పారితోషకాల బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ధ్వజమెత్తారు.

ఈ ఏడాది నింగిలోకి 32 ఉపగ్రహాలు

ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 24: ఈ ఏడాది చంద్రయాన్‌తో సహా 32 ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ చెప్పారు. పిఎస్ఎల్‌వి సి-44 ప్రయోగం నేపథ్యంలో డాక్టర్ శివన్ గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎస్ఎల్‌వి సి-44 ప్రయోగంలో నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టామని వివరించారు. కాగా గురువారం అర్థరాత్రి 11.37 గంటలకు పిఎస్ఎల్‌వి సి-44ను ప్రయోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ శివన్ శ్రీవారి సుప్రభాతం సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

దూసుకెళ్లిన సీ 44

సూళ్లూరుపేట, జనవరి 24: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రయోగిస్తున్న పీఎస్‌ఎల్‌వీ-సీ 44 రాకెట్ అర్ధరాత్రి నింగిలోకి దూసుకెళ్లనుంది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో ఈ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ బుధవారం రాత్రి 7:37 గంటలకు ప్రారంభమై నిర్విఘ్నంగా కొనసాగుతోంది. 28 గంటలు కొనసాగినంతరం గురువారం అర్ధరాత్రి 11:37 గంటలకు రాకెట్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లింది.

ఈ రాకెట్ ద్వారా ఇస్రో రూపొందించిన 750 కిలోల బరువుగల మైక్రోశాట్-ఆర్, తమిళనాడు విద్యార్థులు రూపొందించిన 4 కిలోల బరువుగల కలాం శాట్ రెండు ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ-సీ 44 వాహక నౌక ద్వారా రోదసీలోకి పంపనున్నారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ రాకెట్ విజయం కోసం గురువారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. చైర్మన్‌కు ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలనంరతం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన నేరుగా షార్‌కు చేరుకొని షార్ డైరెక్టర్ ఎస్.పాండ్యన్, శాస్త్రవేత్తలతో కలసి ప్రయోగ వేదిక వద్దకు చేరుకొని కౌంట్‌డౌన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తలతో సమావేశమై ప్రయోగ వివరాలడిగి తెలుసుకొన్నారు. ఇస్రో డిఎల్ తరహా ప్రయోగంలో భాగంగా ఈ రెండు స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో ఈ రాకెట్ ప్రయోగం చేపట్టడం విశేషం. ఇప్పటికే షార్‌కు ఇస్రో ప్రధాన సెంటర్ల డైరెక్టర్లు చేరుకోవడం సందడి వాతావరణం నెలకొంది.



నౌకా పర్యాటకంలో కొత్త అధ్యాయం

కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి గోపాలకృష్ణ

విశాఖపట్నం, జనవరి 24: విశాఖ నగరానికి తొలిసారిగా అంతర్జాతీయ విదేశీ విహార నౌక సిల్వర్ డిస్కవర్ గురువారం చేరుకుంది. శ్రీలంకలోని ట్రింకోమలి పోర్టు నుంచి విశాఖ పోర్టుకు వచ్చి పారాదీప్ మీదుగా బంగ్లాదేశ్‌కు వెళ్లనుంది. వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ పర్యాటకులకు దేశంలోని పలు ప్రాంతాలు చూపించేందుకు ఈ నౌకను ఏర్పాటు చేసినట్లు కేంద్ర నౌకాయన మంత్రిత్వ శాఖ కార్యదర్శి గోపాలకృష్ణ తెలిపారు. సుమారు 70 మంది విదేశీ పర్యాటకులు నౌక నుంచి దిగి నగరంలో వివిధ పర్యాటక ప్రాంతాలను తిలకించారన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో విహార నౌకాయానం అభివృద్ధికి అడ్డంకులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, పర్యాటక నౌకలను దేశంలోని నౌకాశ్రయాలకు తీసుకువచ్చేందుకు పలు రాయితీలను, ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. కొచ్చిన్, చెన్నై, గోవా పోర్టుల్లో కస్టమ్స్ సహ ఇతర ఛార్జీల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విశాఖకు ఈక్రూయిజ్ రాకతో నౌకా పర్యాటకంలో కొత్త అధ్యాయం మొదలైందని, ఈ ఏడాదిలోనే మరో రెండు క్రూయిజ్‌లు విశాఖకు రానున్నాయన్నారు. విశాఖ



పోర్టు చైర్మన్ ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ విశాఖ పోర్టులో అత్యాధునిక టెర్మినల్‌ను రూ.77 కోట్ల వ్యయంతో నిర్మించనున్నామన్నారు. కొత్త జెట్టీ నిర్మాణానికి డిజైన్లు ఖరారు దశలో ఉన్నాయన్నారు.

రెండో తరగతి బాలికపై టీచర్ లైంగికదాడి?

పోలీసుల దర్యాప్తు

ఆగిరిపల్లి, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లాలో మండల కేంద్రమైన ఆగిరిపల్లి గ్రామానికి చెందిన బాలిక (8) స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతోంది. ఈ నెల 22వ తేదీన పాఠశాల నుండి సాయంత్రం ఇంటికి వచ్చిన బాలిక మర్మాంగం నుంచి తీవ్రంగా రక్తస్రావం అవుతోంది. దీంతో వెంటనే తల్లిదండ్రులు నూజివీడులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా కుట్లు వేసి ప్రథమ చికిత్స అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు కొట్టినట్లుగా బాలిక చెబుతోందని తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు డీఎస్పీ జి ప్రసాదరావు గురువారం సాయంత్రం విలేఖరులకు తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.హనుమాన్‌జంక్షన్ సీఐ ఎం రాజశేఖర్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ ప్రసాదరావు తెలిపారు. ఈ సమావేశంలో ఆగిరిపల్లి ఎస్ఐ ఏసేబు పాల్గొన్నారు. ఇలాఉంటే బాలికపై ఉపాధ్యాయుడు అత్యాచారం చేశారనే అనుమానం ఉందని బాధితురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు జరిగిన సంఘటనపై వాస్తవాలు సేకరించేందుకు ఐసీడీఎస్ అధికారులు రంగప్రవేశం చేశారు. చిన్నారి బాలికపై ఉపాధ్యాయుడు అత్యాచారం చేసినట్లు తమ విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి కె కృష్ణకుమారి విలేఖరులకు తెలిపారు.

జనసేనతో కలసి లెఫ్ట్..రైట్

★ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు స్పష్టీకరణ

ఒంగోలు, జనవరి 24: రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో వామపక్షాలు, జనసేన కలసి 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో కలసి పోటీ చేస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు స్పష్టం చేశారు. గురువారం ఒంగోలులో సీపీఎం సీపీఐ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయంకై నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బలపర్చాలని కోరుతూ ప్రజాభేరి - రాజకీయ సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాలు అభివృద్ధిని విస్మరించి ప్రజలను కష్టాలపాలు చేశాయని విమర్శించారు. రాష్టానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చుతామని వాగ్దానం చేసి వాటిని అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. అయితే దీనిని ప్రశ్నించి పోరాటం చేయాల్సిన వైకాపా కూడా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను మరచి అధికారం కోసమే ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాన్ని గమనించి రాష్ట్రంలో ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ, బీజేపీ, వైకాపాలను ఓడించాలని ఆయన కోరారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రజా సంక్షేమాన్ని మరచిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే డ్వాక్రా మహిళలకు పసుపు- కుంకుమ, రైతు పెట్టుబడి, కాపులకు 5 శాతం రిజర్వేషన్ పథకాలు ప్రకటించడం దారుణమని విమర్శించారు. గతంలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీని ప్రకటించి ఇప్పటి వరకు పూర్తిగా ఇవ్వలేదని అందువల్ల చంద్రబాబు మోసపూరిత మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

1వ పేజీ తరువాయి

కూటమి కుదేలే!

రఘువీరారెడ్డి ఒంటరిగా పోటీ చేయటం గురించి ప్రకటించటం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల క్రితం ఢిల్లీకి వచ్చి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో చర్చలు జరిపిన వెళ్లిన మరుసటి రోజే రఘువీరారెడ్డి ప్రకటన రావటం గమనార్హం. రాహుల్, చంద్రబాబు చర్చల ఫలితమే రఘువీరారెడ్డి ప్రకటన అనే మాట వినిపిస్తోంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటుందనే వార్తలు రావటం తెలిసిందే. ఊమన్ చాందీ రెండు వారాల క్రితం ఏపీ కాంగ్రెస్ సీనియర్ నాయకులతో సమావేశమై తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవటం గురించి చర్చించారు. అయితే పొత్తు పెట్టుకోవటాన్ని కొందరు నాయకులు బలపరిస్తే మరికొందరు గట్టిగా వ్యతిరేకించారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవటం లేదని తెలిసిన అనంతరం ఏపీ కాంగ్రెస్‌కు చెందిన కొందరు సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేయటం గురించి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. వీరు తెలుగుదేశం పార్టీలో చేరినా ఆశ్చర్యపోకూడదని అంటున్నారు. ఏపీ మాదిరిగానే పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నాయకులు కూడా లోక్‌సభ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు పెట్టుకోకూడదని పార్టీ అధినాయకత్వానికి స్పష్టం చేశారు. తమ బద్ధశత్రువైన తృణమూల్ కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు పెట్టుకుంటే పలువురు సీనియర్ నాయకులతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సైతం కాంగ్రెస్‌కు గుడ్‌బై చెబుతారని వారు రాహుల్ గాంధీకి స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాష్ట్రంలో తమను అవమానిస్తుంటే మీరు ఆమెతో సీట్ల సర్దుబాటు ఎలా చేసుకుంటారని పార్టీ అధినాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర నాయకుల అభీష్టానికి భిన్నంగా పొత్తు పెట్టుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికికే ప్రమాదం వస్తుందని అధినాయకత్వం గ్రహించిందని అంటున్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయానికి రాహుల్ గాంధీ వచ్చారని అంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయకతప్పటం లేదు. అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ, మాయావతి నాయకత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ సీట్ల సర్దుబాటు చేసుకోవటం తెలిసిందే. ఎస్పీ, బీఎస్పీ రాజకీయం మూలంగా ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయక తప్పటం లేదు.

పేపర్ బ్యాలెట్.. ప్రసక్తే లేదు

చేయకముందే సునీల్ అరోరా ఈ ప్రకటన చేయటం గమనార్హం. రాజకీయ పార్టీలు, ఇతరులెవరైనా తమను విమర్శించవచ్చు.. సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు.. అయితే కేంద్ర ఎన్నికల సంఘం మాత్రం నిరాధార ఆరోపణలు, విమర్శలకు భయపడదు.. వెనక్కు తగ్గదు. పేపల్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టదని సునీల్ అరోరా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈవీఎంలను టాంపర్ చేయవచ్చునంటూ అమెరికాకు చెందిన సయ్యద్ సుజా చేసిన ఆరోపణలను ఆయన కొట్టివేశారు. సయ్యద్ సుజాపై కేసు పెట్టిన విషయం ప్రస్తావిస్తూ ఈవీఎంల విశ్వనీయతను ప్రశ్నించవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈసీఐఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారు చేసిన ఈవీఎం యంత్రాలను వైఫై ద్వారా బయటి యంత్రాలతో అనుసంధానం చేసేందుకు ఎంతమాత్రం వీలులేదని అరోరా ప్రకటించారు. ఈవీఎంలు, వీవీపీఏటీటిల ఉపయోగంతోనే ఎన్నికల నిర్వహణ జరుగుతుంది.. పేపల్ బ్యాలెట్ పత్రాల పాత యుగంలోకి మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా వస్తే ఈవీఎంలు మంచివని.. ఫలితాలు ప్రతికూలంగా వస్తే ఈవీఎంలు మంచివికావనే వాదన మంచిది కాదని అన్నారు.

నేడే రెండో విడత పోలింగ్

4137 గ్రామపంచాయతీలకు, 36,620 వార్డు సభ్యుల స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 1 న నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు 4135 పంచాయతీలకు నోటీస్ ఇచ్చారు. న్యాయపరమైన కారణాల వల్ల రెండు గ్రామ పంచాయతీలకు నోటిస్ ఇవ్వలేదు. నోటీస్ జారీ అయిన పంచాయతీల్లో 788 పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఐదు సర్పంచ్ స్థానాలకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు. ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో 3342 సర్పంచ్ స్థానాలకు 10,668 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అలాగే 36,620 వార్డుస్థానాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, 36,602 స్థానాలకే నోటీస్ జారీ అయింది. వీటిలో 10,317 వార్డుస్థానాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. మరో 94 వార్డులకు నామినేషన్లు రాకపోవడంతో ఎన్నికలు జరగడం లేదు. అంటే శుక్రవారం పోలింగ్ 26,191 స్థానాలకే ఎన్నికలు జరుగుతుండగా, 63,480 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు పోలింగ్‌ను ప్రారంభించి మధ్యాహ్నం 1 గంటకు ముగిస్తారు. పోలింగ్ పూర్తయిన వెంటనే కౌంటింగ్ జరుగుతుంది. తొలుత వార్డు సభ్యుల ఓట్లను కౌంట్ చేస్తారు. ఆ తర్వాత సర్పంచ్ స్థానం ఓట్లను కౌంట్ చేస్తారు. ఆ తర్వాత ఉప-సర్పంచ్ స్థానానికి చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహిస్తారు. పోలింగ్ కోసం గురువారం సాయంత్రం వరకే సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుశాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసింది. ఓటర్లకు తాగునీరు తదితర కనీస సౌకర్యాలను కల్పించారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఎన్నికల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారు..

మే 20న లాసెట్..

సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ ఎంట్రన్స్ ఫీజులు ఎంత ఉండాలనేదానిపై ఆయా సెట్ కన్వీనర్లు నిర్ణయిస్తారని చెప్పారు. ఎడ్‌సెట్ రెండు రోజులు కాకుండా ఒకే రోజు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. సమన్వయం కోసం ప్రతి సెట్‌కూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి నుండి సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. దీనివల్ల ఇటు మండలికి, అటు సెట్ కన్వీనర్‌కూ మధ్య అనుసంధానం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలన అంతం కావాల్సిందే

అదే బీజేపీయేతర పక్షాల ఉమ్మడి అజెండా ◆ చేతకాని వాడు ఏపీలో అధికారంలో ఉండాలని కేసీఆర్ కోరిక

కాపు రిజర్వేషన్లపై వైకాపా, బీజేపీల వైఖరి ఏమిటి? ◆ పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్సులో ఏపీ ముఖ్యమంత్రి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 24: నిరంకుశ పాలన అంతమే బీజేపీయేతర పార్టీల ఉమ్మడి అజెండా అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కాపు రిజర్వేషన్లపై బీజేపీ, వైకాపాల వైఖరేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలక్షన్ మిషన్-2019కై టీడీపీ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులతో గురువారం ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రాల్లో అక్కడి పార్టీల అభీష్టం మేరకే ఎన్నికల్లో పోటీ ఉంటుందన్నారు. సేవ్ నేషన్-సేవ్ డెమొక్రసీ, యునైటెడ్ ఇండియా పేరుతో వివిధ రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వస్తున్నాయన్నారు. కర్ణాటక, కోల్‌కతాల్లో ఒకే వేదికపైకి వచ్చామని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పార్టీకి తృణమూల్‌తో పొత్తు లేదని, అయినా కాంగ్రెస్ నేతలు ర్యాలీకి వచ్చారని తెలిపారు. నిరంకుశ పాలన అంతమే కనీస ఉమ్మడి కార్యక్రమని స్పష్టం చేశారు. దేశంలోని వ్యవస్థలను కాపాడుకోవడమే ఉమ్మడి అజెండా అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడమే బీజేపీయేతర 23పార్టీల అజెండా అని స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లింల భద్రతే తమ అజెండాగా వెల్లడించారు. రాష్ట్ర హితం కోరే ప్రతి ఒక్కరూ టీడీపీతో ఉండాలన్నారు. ప్రజల కోసం పని చేసేది టీడీపీ అని, స్వార్థం కోసం పని చేసేది వైకాపా, బీజేపీ అని ఆరోపించారు. కుట్రలు, కుతంత్రాలు చేయడమే వారి పని అన్నారు. చేతకాని వాడు ఏపీలో అధికారంలో ఉండాలనేది కేసీఆర్ కోరికని వ్యాఖ్యానించారు. తన చేతకానితనం తెలంగాణలో ఎక్కడ బయటపడుతుందోనని ఆయన భయమని విమర్శించారు. త్వరలో జగన్ గృహ ప్రవేశమట అని, దానికి కేసీఆర్ అతిథిగా వస్తాడట అంటూ ఎద్దేవా చేశారు. కేసుల మాఫీ కోసం మోదీతో, డబ్బుల కోసం కేసీఆర్‌తో జగన్ రాజీ పడ్డారని ఆరోపించారు. టీఆర్ఎస్‌కు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని, డబ్బులున్న వాళ్లకే జగన్ టికెట్లు ఇస్తున్నారన్నారు. మోసాల్లో జగన్ ఘనుడని, అందుకే 16 నెలలు జైలుకు వెళ్లాడన్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని నేతలకు దిశానిర్దేశం చేశారు.

కాపు రిజర్వేషన్లపై బీజేపీ, వైకాపా నేతలు అవాకులు, చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. కాపు రిజర్వేషన్లపై రాష్ట్రానికి అధికారం లేదంటున్నారని, కాపులకు 5 శాతం రిజర్వేషన్ ఇస్తే వీళ్లకు బాధ ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏదీ జరగకూడదని, ఎవరూ సంతోషంగా ఉండకూడదన్నారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలనేది వైకాపా, బీజేపీ ఉమ్మడి అజెండాగా ఎద్దేవా చేశారు. కాపు రిజర్వేషన్లపై పాదయాత్రలో జగన్‌ను నిలదీస్తే, తన పరిధిలో లేదని చెప్పడాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ఈడబ్ల్యుఎస్ 10 శాతంలో 5 శాతం కాపులకు ఇస్తే, వ్యతిరేకిస్తున్నారన్నారు. మొన్న బీజేపీ కాపు రిజర్వేషన్లను నిందించిందని, ఇప్పుడు వైకాపా అడ్డుకుంటోందన్నారు. కాపు రిజర్వేషన్లపై ఈ రెండు పార్టీల వైఖరేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలే వీరికి బుద్ధి చెబుతారన్నారు.

మేనిఫెస్టోలో చెప్పినవన్నీ 5 ఏళ్లలోనే చేశామని, చెప్పనివి కూడా చేశామన్నారు. పింఛను 1000 రూపాయలను 2000 చేశామని, పింఛను 10 రెట్లు పెంచడం ఒక చరిత్రన్నారు. డ్వాక్రా మహిళలకు 10 వేల రూపాయలు ఇస్తామని చెప్పి, 20 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. రెండంకెల వృద్ధి రేటు సాధించామని, టీడీపీ పట్ల కూడా ప్రజాదరణ రెట్టింపు కావాలన్నారు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానన్నారు. బాధ్యత గల కుటుంబ పెద్దగా పని చేస్తున్నానన్నారు. ఇప్పటికే ప్రజల్లో 78.5శాతం సంతృప్తి ఉందని, కొన్ని నియోజకవర్గాల్లో 84 శాతం ఉందన్నారు.

కొలిక్కివచ్చిన 'జమ్మలమడుగు' పంచాయితీ!

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 24: కడప జిల్లా జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం పంచాయితీ కొలిక్కివచ్చింది. ఈ అసెంబ్లీ సీటుకు పోటీ పడుతున్న ఇద్దరు నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం సమావేశమై రాజీ కుదిర్చారు.

కడప జిల్లాలో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం కీలకం కావడంతో ఆ సీటు కోసం మంత్రి ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పోటీ పడటం తెలిసిందే. ఇద్దరూ అసెంబ్లీ సీటు తమదేనంటూ ప్రచారం చేసుకోవడంతో టీడీపీ అధిష్ఠానానికి సమస్యగా మారింది. సీట్ల ఖరారు ప్రక్రియ ప్రారంభించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు కూడా అయిన చంద్రబాబుకు ఈ వ్యవహారం సమస్యగా మారడంతో ఇద్దరితో బుధవారం సమావేశమై చర్చించారు. మరోసారి సాయంత్రం చర్చించేందుకు నిర్ణయించినప్పటికీ, రామసుబ్బారెడ్డి రాకపోవడంతో గురువారానికి వాయిదా పడింది. ఉదయం వీరిద్దరితో అసెంబ్లీ సీటు వ్యవహారం ముఖ్యమంత్రి చర్చించారు.

ఇద్దరూ అసెంబ్లీ సీటునే కోరడంతో ముఖ్యమంత్రి కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఒకరికి ఎమ్మెల్యే, మరొకరికి ఎంపీ సీటు ఇచ్చే ప్రతిపాదనకు అంగీకరించి, మళ్లీ అసెంబ్లీ సీటు కోసం పట్టుబట్టడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీ అవసరాల దృష్ట్యా కలిసి పని చేయాలని, పార్టీ ఆదేశాలను అనుసరించాలని ముఖ్యమంత్రి నచ్చజెప్పారు. చర్చల అనంతరం వారిద్దరూ కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎవరికి సీటు ఇచ్చినా, పార్టీ గెలుపునకు పని చేస్తామని తెలిపారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు.

త్వరలోనే జమ్మలమడుగు ఎమ్మెల్యే, కడప ఎంపీ సీటును కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటిస్తారన్నారు. కాగా, మంత్రి ఆదినారాయణరెడ్డిని కడప ఎంపీగా, జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థిగా రామసుబ్బారెడ్డి బరిలోకి దించే అవకాశం ఉందని తెలుస్తోంది.

క్రీడాభూమి

స్మృతి మందానా సెంచరీ

మహిళల వన్డేలో కివీస్‌పై భారత్ విజయం



నాపీర్, జనవరి 24: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. గురువారం జరిగిన మొదటి వన్డేలో కివీస్‌ను తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. స్మృతి మందానా సెంచరీతో చెలరేగడంతో భారత్ విజయం సులభసాధ్యమైంది. మరో ఓపెనర్ జెమీమా రోడ్రిగ్స్ అజేయ అర్ధ శతకంతో రాణించింది. తొలుత బ్యాటింగ్‌కు కివీస్‌ను భారత్ 48.5 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌట్ చేసింది. ఓపెనర్లు సుజీ బేట్స్ (36), స్టెఫానె డివైన్ (28) ఆరంభంలో కొంత సేపు బాగానే ఆడినప్పటికీ, ఆతర్వాత వికెట్ల పతనం మొదలైంది. కెప్టెన్ అమీ సాటర్‌వైట్ (31), ఎమీలియా కెర్ (28), చివరిలో హన్నా రోవ్ (25) భారత బౌలింగ్‌ను ప్రతిఘటించే ప్రయత్నం చేసినప్పటికీ, కివీస్ భారీ స్కోరు సాధించలేకపోయింది. కాగా, తమ ముందున్న 193 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 33 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్లు సృతి మందానా, జెమీమా రోడ్రిగ్స్ జట్టుకు శుభారంభాన్ని అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 190 పరుగులు జోడించి, భారత్‌ను విజయం ముంగిట నిలిపారు. స్మృతి మందానా 105 పరుగులు చేసి, ఎమిలియా కెర్ బౌలింగ్‌లో తహుహూ క్యాచ్ అందుకోగా ఔటైంది. విజయానికి కావాల్సిన మగతా పరుగులను పూర్తి చేసిన జెమిమా రోడ్రిగ్స్ 81 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. అప్పటికి దీప్తి శర్మ పరుగులేవీ చేయకుండా క్రీజ్‌లో ఉంది.

ఆస్ట్రేలియా గ్రాండ్ శ్లామ్ టెన్నిస్

ఫైనల్‌కు ఒకాసా

★ ప్లిస్కోవాపై సంచలన విజయం
★ ఇక క్విటోవాతో టైటిల్ పోరు

మెల్బోర్న్, జనవరి 24: ఈ ఏడాది మొదటి గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో జపాన్‌కు చెందిన 21 ఏళ్ల సంచలనం నవోమీ ఒకాసా ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీ ఫైనల్‌లో ఆమె ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవాను 6-2, 4-6, 6-4 తేడాతో ఓడించి, వరుసగా రెండోసారి గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. గత ఏడాది చివరి గ్రాండ్ శ్లామ్ యూఎస్ ఓపెన్‌లో ఒకాసా ఫైనల్ చేరడమే గాక, తుది పోరులో ప్రపంచ మాజీ నంబర్ వన్, లెజెండరీ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌పై 6-2, 6-4 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను అందుకుంది. ఆస్ట్రేలియాలోనూ టైటిల్ అందుకునే దిశగా ఆమె దూసుకెళుతున్నది.

ఇలావుంటే, మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకోవడానికి పెట్రా క్విటోవా కూడా పట్టుదలతో కృషి చేస్తున్నది. రెండు పర్యాయాలు వింబుల్డన్ టైటిల్‌ను కైవసం చేసుకున్న ఆమె కెరీర్‌లో మొట్టమొదటిసారి ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఫైనల్ చేరింది. 36 డిగ్రీలతో ఎండ మాడ్చేస్తున్నప్పటికీ, ఆమె అద్భుత పోరాటాన్ని కొనసాగిస్తున్నది. చక్కటి ఫామ్‌లో ఉన్న ఆమె సెమీ ఫైనల్‌లో డానిల్ కొలిన్స్‌ను 7-6, 6-0 తేడాతో ఓడించింది. కొలిన్స్ నుంచి మొదటి సెట్‌లో తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ, తన అపారమైన అనుభవంతో గట్టెక్కింది. రెండో సెట్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా, మొదటి నుంచే దాడికి ఉపక్రమించి, ఎలాంటి సమస్య లేకుండా విజయభేరి మోగించింది. టైటిల్ కోసం ఆమె నవోమీని ఢీ కొంటుంది.



పెట్రా క్విటోవా

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ రాఫెల్ నాదల్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఫిటెస్ సమస్య ఏమాత్రం లేకుండా పూర్తి ఫామ్‌ను ప్రదర్శిస్తున్న అతను సెమీ ఫైనల్‌లో స్టెఫానొస్ టిట్సిపాస్‌ను 6-2, 6-4, 6-0 తేడాతో వరుస సెట్లలో విజయాన్ని నమోదు చేశాడు.


తుది పోరులో అతను ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ లేదా లుకాస్ పొలీతో తలపడతాడు. వీరిద్దరి మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది.



నవోమీ ఒకాసా

ఇండోనేషియా మాస్టర్స్ బాడ్మింటన్

క్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్




కిడాంబి శ్రీకాంత్

జకార్తా, జనవరి 24: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ ఇక్కడ జరుగుతున్న ఇండోనేషియా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో తమతమ విభాగాల్లో క్వార్టర్ ఫైనల్స్ చేరారు. ఈ సీజన్‌కు మొదటి టోర్నీలోనే వీరిద్దరూ ముందంజ వేయడం విశేషం. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సింధు ప్రీ క్వార్టర్స్‌లో 23-21, 21-7 తేడాతో, కేవలం 37 నిమిషాల్లోనే ప్రత్యర్థి గార్జియా టున్‌జుంగ్‌పై విజయాన్ని నమోదు చేసింది. తర్వాతి రౌండ్‌లో ఆమె తన చిరకాల ప్రత్యర్థి కరోలిన్ మారిన్‌ను ఢీ కొంటుంది. మరో ప్రీ క్వార్టర్స్‌లో మారిన్ దక్షిణ కొరియాకు చెందిన కిమ్ గాయున్‌ను ఓడించింది. మరో క్వార్టర్ ఫైనల్ ఇంతినాన్ రచానోక్, చెన్ యూఫెడ్ మధ్య జరుగుతుంది. ఇంతినాన్ 21-16, 21-13 ఆధిక్యంతో బుసానన్ ఒబాబ్రుంగ్‌పాన్‌పై గెలవగా, చెన్ యూఫెడ్ 21-11, 21-11 స్కోరుతో సయాకా తకహషిపై విజయాన్ని నమోదు చేసింది. ఫిత్రియానిని ఓడించిన భారత స్టార్ సైనా నెహ్వాల్ క్వార్టర్స్‌లో పోర్న్‌పవీ చొచదవాంగ్‌తో తలపడుతుంది. చివరి క్వార్టర్ ఫైనల్‌లో చెన్ జియాజిన్, హీ బింజియావో మధ్య జరుగుతుంది. పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీకాంత్ 21-14, 21-9 తేడాతో జపాన్‌కు చెందిన కెన్టా నిషిమొటోపై గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతను జొనథాన్ క్రిస్టీని ఎదుర్కొంటాడు. కాగా, ఇతర క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఆండ్రెస్ ఆంటాన్సెన్‌తో లీ జీజియా, విక్టర్ ఎక్సెల్సెన్‌తో చెన్ లాంగ్, ఆంథొనీ సినిసుకా జింటింగ్‌తో కెటో మొమొటో తలపడతారు.



పీవీ సింధు

క్రికెట్‌కు బోథా గుడ్‌బై



హోబర్ట్, జనవరి 24: ఆస్ట్రేలియాలో స్థిరపడిన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జొహాన్ బోథా క్రికెట్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలగుతున్నానని ఒక ప్రకటనలో తెలిపాడు. ప్రస్తుతం బోథా ఆస్ట్రేలియా టీ-20 లీగ్‌లో హోబర్ట్ హరికేన్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఫిట్నెస్ సమస్యల కారణంగానే తాను అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు 36 ఏళ్ల బోథా తెలిపాడు. దక్షిణాఫ్రికా జాతీయ జట్టులో చోటు కోల్పోయిన తర్వాత, తిరిగి స్థానం కోసం బోథా తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ, సెలక్టర్లు చిన్నచూపు చూడడంతో, ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అక్కడ దేశవాళీ పోటీల్లో ఆడుతున్నాడు. 2016లో అతనికి ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా లభించింది. బుధవారం జరిగిన ఒక మ్యాచ్‌లో సిడ్నీ సిక్సర్స్ చేతిలో హోబర్ట్ హరికేన్స్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో చిత్తయింది. ఈ మ్యాచ్‌లో బోథా ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు. ఇలావుంటే, బోథా దక్షిణాఫ్రికా తరఫున ఐదు టెస్టులు, 78 వన్డేలు, 40 టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడాడు.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,172.00	1 గ్రాము:	రూ. 3,089.00
8 గ్రాములు:	రూ.25,376.00	8 గ్రాములు:	రూ. 24,712.00
10 గ్రాములు:	రూ. 31,720.00	10 గ్రాములు:	రూ. 30,890.00
100 గ్రాములు:	రూ.3,17,200.00	100 గ్రాములు:	రూ. 3,08,900.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,392.513	1 గ్రాము:	రూ. 3,303.743
8 గ్రాములు:	రూ. 27,140.104	8 గ్రాములు:	రూ. 26,429.944
10 గ్రాములు:	రూ. 33,090.910	10 గ్రాములు:	రూ. 33,037.43
100 గ్రాములు:	రూ. 3,39,251.3	100 గ్రాములు:	రూ. 3,30,374.3
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.60	8 గ్రాములు:	రూ. 331.60
10 గ్రాములు:	రూ. 414.50	10 గ్రాములు:	రూ. 414.50
100 గ్రాములు:	రూ. 4,145.00	100 గ్రాములు:	రూ. 4,145.00
ఒక కిలో:	రూ. 41,450.00	ఒక కిలో:	రూ. 41,450.00

ఎస్ బ్యాంక్ ఎండీగా రవ్‌నీత్ గిల్

ముంబయి, జనవరి 24: ప్రైవేటు రంగ బ్యాంకు ఎస్ బ్యాంక్ నూతన మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జికూటివ్‌గా రవ్‌నీత్ సింగ్ గిల్ గురువారం నియమితులయ్యారు.

ఆయన ప్రస్తుతం డస్చ్ బ్యాంక్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం యెస్ బ్యాంకు ఎండీగా ఉన్న రాణాకపూర్ పదవీ కాలం ఈనెల 31తో ముగియనుంది. తన మరదలు బిందు కపూర్‌తో కలిసి యెస్ బ్యాంకు ప్రగతికి కృషి చేస్తున్న రాణాకపూర్‌ను ఈ నెలాఖరులోగా పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా రిజర్వుబ్యాంకు ఆదేశించింది.

అలాగే కొత్త ఎండీ కం సీఈవోగా రవ్‌నీత్ గిల్ నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలకు సైతం రిజర్వుబ్యాంకు తెలిపిన ఆమోదం తాలూకు ఆదేశాలు యెస్ బ్యాంకుకు అందాయి. మార్చి 1నుంచి ఆయన బాధ్యతలు చేపడతారని బ్యాంకు గురువారం నాడొక ప్రకటనలో తెలిపింది. అలాగే అంతర్గత లావాదేల విషయం చర్చించేందుకు ఈనెల 29న బ్యాంకు బోర్డు సమావేశమవుతుందని వివరించింది. కాగా గురువారం ఈ బ్యాంక్ షేర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఒక్కో షేర్ రూ.225.95 ట్రేడయింది.

త్రైమాసిక లాభాల్లో తగ్గుదల

ఈ బ్యాంకు త్రైమాసిక గణాంకాలను గురువారం ప్రకటించింది. గత డిసెంబర్ నెలతో ముగిసిన త్రైమాసికంలో లాభాల్లో 6.96 శాతం తగ్గినట్టు అధికారులు వివరించారు. అంతకు క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,076.87 కోట్లతో పోలిస్తే ఇప్పుడు వచ్చిన 1,001.85 కోట్ల రూపాయలు 6.96 శాతం తక్కువని అధికారులు వివరించారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.550.2 కోట్లు కేటాయించడం జరిగింది. వత్తిడికి గురైన మౌలిక అంశాల సమ్మేళనానికి, పునరుద్ధరణకు రూ.570.8 కోట్ల రూపాయలు కేటాయించినట్టు బ్యాంకు వివరించింది. ఐతే ఆ సమ్మేళనం ఎలా జరుగుతుందో వివరించలేదు. కాగా ఇయన్ ఆన్ ఇయర్ ప్రాదిపదికన ఈ బ్యాంకు స్థూల వడ్డీ ఆదాయం 41.2 శాతం పెరిగి రూ.2,666.4 కోట్లకు చేరింది. అలాగే ఇచ్చిన రుణాలు 42.2 శాతం పెరిగి మొత్తం రూ.2,43,885కు చేరింది. ఈ బ్యాంకు నిరర్థక ఆస్తులు గడచిన త్రైమాసికంలో 2.1 శాతం పెరిగాయి.

కోల్ ఇండియా లక్ష్యానికి గండి!

న్యూఢిల్లీ, జనవరి 24: ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా తనకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడం అనుమానంగానే కనిపిస్తున్నది. బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని ఈ సంస్థకు కేంద్రం లక్ష్యంగా ఉంచింది. కాగా, దీనిని అందుకునేందుకు విశేషంగా కృషి చేస్తున్నప్పటికీ, ఆశించిన ఫలితాలు రావడం లేదనే చెప్పాలి. గతంతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు, తొమ్మిది నెలల కాలంలో దేశం 6.7 శాతం అధికంగా బొగ్గును దిగుమతి చేసుకుంది. దీనితో వివిధ దేశాల నుంచి తెచ్చుకున్న బొగ్గు 171.81 మెట్రిక్ టన్నులకు చేరింది. సంస్థకు నిర్దేశించిన లక్ష్యానికి విధించిన నిర్దిష్టమైన కాలపరిమితిని సడలించాలని కేంద్రం ఆలోచిస్తున్న సమయంలోనే, ఈ గణాంకాలు వెలువడడం గమనార్హం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో, ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ దేశం దిగుమతి చేసుకున్న బొగ్గు 161 మిలియన్ టన్నులు. తాజా ఆర్థిక సంవత్సరంలో, అదే సమయానికి దిగుమతులు సుమారు ఏడు శాతం పెరగడం ఆందోళనకు గురి చేస్తున్న అంశం. దేశంలో బొగ్గు, ఇనుము ఉత్పత్తిపై ఎప్పటికప్పుడు నివేదికలను అందించే 'ఎంజంక్షన్' తాజాగా ప్రకటించిన గణాంక వివరాల్లో దిగుమతుల పెరుగుదల కనిపించింది. బొగ్గు దిగుమతులు పెరిగినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో తగ్గుతుందని టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న 'ఎంజంక్షన్' మేనేజింగ్ డైరెక్టర్/ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వినయ వర్మ వ్యాఖ్యానించారు.

థర్మల్ పవర్ గ్రిడ్స్, ఇతరత్రా బొగ్గు వినియోగదారుల వద్ద నిల్వలు పెరుగుతున్నాయని చెప్పారు. అంతగాక, ఎక్కువ శాతం పవర్ ప్లాంట్స్‌కు స్థానికంగా ఉండే మైనింగ్ కంపెనీల నుంచి బొగ్గు అందుతున్నదని, ఇది కూడా డిమాండ్ తగ్గుదలకు కారణమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబర్‌లో 13.01 మెట్రిక్ టన్నుల బొగ్గు దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని, డిసెంబర్ మాసంలో ఈ మొత్తం 12.52 మెట్రిక్ టన్నులకు తగ్గిందని వర్మ వివరించారు. వంటకు వినియోగించే బొగ్గు దిగుమతులు పెరిగినప్పటికీ, చివరి త్రైమాసికంలో తగ్గుతాయన్న నమ్మకం వ్యక్తం చేశారు. ఇలావుంటే, డిమాండ్‌కు తగినంత బొగ్గు దేశంలో ఉత్పత్తి కాకపోవడంతో, దిగుమతులు తప్పనిసరి అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడం కోల్ ఇండియాకు సాధ్యమవుతుందా? అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో దిగుమతులు ఏ స్థాయిలో తగ్గుతాయనే విషయంపైనే కోల్ ఇండియా లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఆధారపడి ఉంటాయి.

అమెరికాలో ఇన్ఫోసిస్ హవా


న్యూఢిల్లీ, జనవరి 24: అమెరికాలో ఇన్ఫోసిస్ హవా కొనసాగుతున్నది. అక్కడి స్థానికులకు పది వేల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే నాలుగింటి మూడు వంతులు, 7,600 మందికిపైగా ఉద్యోగులు అమెరికాలో పని చేస్తున్నారు. అత్యంత విస్తారమైన మార్కెట్ ఉన్న కారణంగా, అమెరికాలో ఇన్ఫోసిస్ వ్యూహాత్మకంగా విస్తరిస్తోంది. ఇంత వరకూ ఐదు ఐటీ హబ్స్‌ను తెరిచింది.

స్థానిక కళాశాలలు, విద్యాలయాల్లో చదివిన వారికే అధిక ప్రాధాన్యం ఇస్తూ, అమెరికాలో మార్కెట్‌ను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నది. ఈ కంపెనీకి ఉత్తర అమెరికాలో గట్టి పట్టు ఉంది. ఈ కంపెనీ మొత్తం వ్యాపారంలో 60.4 శాతం వాటా ఉత్తర అమెరికాదే కావడం గమనార్హం. ఐరోపా వాటా 24.2 శాతం. మిగతా దేశాల్లో 12.8 శాతంగా ఉంది. ఇన్ఫోసిస్ వ్యాపారంలో భారత్ వాటా కేవలం 2.6 శాతం. బెంగళూరు ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న ఈ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారీగా లాభాలను ఆర్జించింది. స్థానికతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, అందులో భాగంగానే అమెరికాలో కూడా స్థానికులకే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగావకాశాలను కల్పించామని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సలీల్ పరేఖ్ ఇటీవల చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలను అందుకోవడానికి ఇన్ఫోసిస్ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నది. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని, 2020-21 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయిలో స్థానికతను అమలు చేయాలని నిర్ణయించింది.

నిలకడగా వ్యాపార లావాదేవీలను విస్తరించుకుంటూ, గమ్యాలవైపు అడుగులు వేస్తున్నది. అమెరికాలో ఇప్పటికే ఐదు హబ్స్‌తో మార్కెట్‌లోకి విస్తరిస్తున్న ఇన్ఫోసిస్ తాజాగా ఇండియానాపోలిస్ (ఇండియానా), రాలే (నార్త్ కరోలినా), హార్ట్‌ఫోర్డ్ (కనెక్టికట్), ఫోనిక్స్ (ఆరిజోనా) నగరాల్లోనూ ఐటీ హబ్స్‌ను తెరిచేందుకు సన్నాహాలు చేస్తున్నది. రోడ్ ఐలాండ్‌లోని ప్రావిడెన్స్‌లో డిజైన్ అండ్ ఇన్నోవేటివ్ హబ్‌ను త్వరలోనే మొదలుపెట్టనుంది. అమెరికాతోపాటు యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియాల్లోనూ స్థానికంగా అందుబాటులో ఉన్న మానవ వనరులను వినియోగించుకుంటున్నది. ఈ విధంగా స్థానికంగా స్థిరపడడమేగాక, వ్యాపారాన్ని సులభంగా విస్తృతం చేసుకుంటున్నది. 2020 సంవత్సరం నాటికి ఆస్ట్రేలియాలో మూడు ఇన్నోవేటివ్ హబ్స్‌ను మొదలుపెట్టి, కనీసం 1,200 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా ఎంచుకుంది. ఇతర భారతీయ ఐటీ కంపెనీలతో పోలిస్తే, ఉద్యోగ కల్పనలో ఇన్ఫోసిస్ అగ్రస్థానంలో నిలుస్తోంది.



వాణిజ్యభూమి



స్టాక్ మార్కెట్‌కు ఊతం

లాభాల్లో షేర్ల ట్రేడింగ్ ★ 87 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబయి, జనవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మెరుగుపడ్డాయి. రిలయన్స్, ఐటీసీ, యెస్ బ్యాంకు వంటి పెద్ద సంస్థలు లాభాలను సంతరించుకోగా బీఎస్ఈ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 260 పాయింట్లు ఎగబాకింది. ఉదయం 36,146.55 పాయింట్లతో ఆరంభమైన సెన్సెక్స్ తర్వాత ప్రతికూల పరిస్థితులెదురవడంతో ఒక దశలో 36,000కు దిగివచ్చింది. ఆ తర్వాత షేర్ల కొనుగోళ్లు ఊపందుకోవడంతో మధ్యాహ్నం తర్వాత 86.63 పాయింట్లు ఎగబాకింది. చివరికి 36.195.10 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ సైతం కొంత ఊగిసలాటకు గురైనా తర్వాత 18.30 పాయింట్లు లాభపడి 10,866.35 వద్ద ముగిసింది. కాగా గత రెండు రోజులుగా స్టాక్ మార్కెట్లు 470 పాయింట్లు నష్టపోవడం జరిగింది. దేశంలో అత్యంత అధిక మార్కెట్ విలువ కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మూడు నెలల గరిష్ట స్థాయి లాభం 1.61 శాతం అందుకుంది. అలాగే ప్రైవేటు రంగ బ్యాంకు యెస్ బ్యాంకు 8.39 శాతం అదనపులాభాలను ఆర్జించింది. ఈ బ్యాంకుకు రానా కపూర్ స్థానంలో డస్చ్ బ్యాంకుకు నేతృత్వం వహిస్తున్న రవ్‌నీత్ సింగ్ గిల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా నియమితులయ్యారు. వచ్చేనెల 1 నుంచి గిల్ బాధ్యతలు చేపట్టనున్న క్రమంలో మార్కెట్‌లో సానుకూలతలు నెలకొన్నాయి. అలాగే సిగరెట్ల తయారీ కంపెనీ ఐటీసీ వాటాలు సైతం 0.43 శాతం అదనంగా లాభపడ్డాయి. త్రైమాసిక పనితీరును వెల్లడించిన అనంతరం బుధవారం ఈ కంపెనీ 4 శాతం నష్టాలను చవిచూసిన సంగతి తెలిసిందే. కాగా సెన్సెక్స్‌లో లాభపడిన కంపెనీల్లో టీసీఎస్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు, హీరో మోటోకార్ప్, ఆసియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, వేదాంత లిమిటెడ్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా ఉన్నాయి. ఇవి 1.17 శాతం లాభపడ్డాయని మార్కెట్ గణాంకాలు వెల్లడించాయి. మొత్తం మీద గురువారం నాటి మార్కెట్ ట్రెండ్స్ ఆశాభావంగానే కొనసాగాయి.

నష్టాల్లో టాటా మోటార్స్..కోల్ ఇండియా

దేశీయ స్టాక్‌మార్కెట్లలో గురువారం టాటామోటార్స్, సన్‌పార్మా, కోటక్ బ్యాంక్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీ బ్యాంకు, టాటాస్టీల్, ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ కంపెనీలు నష్టాలు చవిచూశాయి. ఈ కంపెనీలు దాదాపు 2.72 శాతం నష్టపోయాయి. ఈ కంపెనీలకు రోజుమొత్తంలో ఏ దశలోనూ సానుకూల పరిస్థితులు కనిపించలేదు. కాగా అత్యధిక లాభాలు ఆర్జించిన రంగాల్లో రియల్ ఎస్టేట్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్స్ ఉన్నాయి. రూపాయి విలువ తగ్గడంతోబాటు, దేశీయంగా అతిపెద్ద కంపెనీలు సానుకూల త్రైమాసిక ఫలితాలు సాధించడం ఐటీ స్టాక్స్ బలపడేందుకు దోహదం చేసిందని, అలాగే ద్రవ్య లభ్యత సరళతరం చేసే చర్యలకు కేంద్రం ఉపక్రమించిందన్న వార్తలతో పీఎస్‌యూ బ్యాంకుల షేర్లకు ఊతం లభించిందని ఆర్థిక రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

శరవేగంగా రైల్వే ప్రాజెక్టులు

❖ దేశంలోని ఇతర ప్రాంతాలతో సీమకు అనుసంధానం ❖ రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గోహెల్

గుంతకల్లు, జనవరి 24: నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలో పలు రైల్వే ప్రాజెక్టులు వేగవంతమయ్యాయని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజెన్ గోహెన్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే బడ్జెట్‌లో రైల్వేకు రూ. 3,670 కోట్లు కేటాయించనున్నారన్నారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలను ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు అనుసంధానం చేస్తూ రైల్వే మార్గాలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రాయలసీమకు ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతామన్నారు. ధర్మవరం- విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలును మచిలీపట్నం వరకు పొడగించనున్నామన్నారు. ప్రత్యేక రైలును కర్నూలు, రాయచూర్, కాకినాడ, వయా గుంటూరు మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. రాయలసీమపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచిందన్నారు. ముఖ్యమంగా 145 కిలోమీటర్ల నూతన రైలుమార్గంతో పాటు 23కిలో మీటర్ల డబ్లింగ్ పనులు, విద్యుదీకరణ పనులు చేపట్టనున్నామన్నారు. గడచిన నాలుగేళ్లలో 123 కిలోమీటర్ల నంద్యాల, ఎర్రగుంట్ల నూతన రైలుమార్గం, కడప-బెంగళూరు మార్గంలో 22 కిలోమీటర్ల రైల్వే లైన్, కడప-పెండ్లిమర్రి మధ్య పనులు పూర్తయ్యాయన్నారు. గుత్తి ధర్మవరం మధ్య 93 కిలోమీటర్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. రూ. 300 కోట్లతో కర్నూలులో నిర్మించనున్న రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభిస్తాయన్నారు. గుంతకల్లు, తిరుపతి, కర్నూలు రైల్వేస్టేషన్లఆధునీకరణకు రూ.500 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించనున్నామన్నారు.



గుంతకల్లులో విలేఖరులతో మాట్లాడుతున్న రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గోహెన్

కొత్త రైల్వేజోన్లు సాధ్యం కాదు

రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గోహెన్

గుంతకల్లు, జనవరి 24: దేశంలో కొత్త రైల్వేజోన్ల ఏర్పాట్లు ఇప్పట్లో సాధ్యం కాదని రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గోహెన్ అన్నారు. గుంతకల్లులో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి ప్రాంతంలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని ప్రజల నుండి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నాయన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు రైల్వేజోన్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదన్నారు. ప్రజల అంచనాలు ఎక్కువగా ఉంటాయన్నారు. భారత రైల్వేలో ఇప్పటికే అధికంగా రైల్వేజోన్లు ఉన్నాయన్నారు. విశాఖపట్టణంలో రైల్వేజోన్ ఏర్పాటు విషయాన్ని కమిటీ నిర్ణయిస్తుందన్నారు. గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటు అస్సలు వీలుకాదన్నారు.



హార్దిక్ పాండ్య, లోకేష్ రాహుల్ ఫైల్ ఫొటో

పాండ్య, రాహుల్‌కు ఊరట

నిషేధాన్ని ఎత్తివేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ, జనవరి 24: అమ్మాయిలపై అనుచిత వ్యాఖ్యలు చేసి, వివాదాలను కొనితెచ్చుకున్న భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్య, లోకేష్ రాహుల్‌కు ఊరట లభించింది. వీరిపై విధించిన నిషేధాన్ని బీసీసీఐ ఎత్తివేసింది. టీమిండియా ఆస్ట్రేలియా టూర్‌లో ఉన్నప్పుడు, పాండ్య, రాహుల్ ఒక టీవీ షోలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే. అమ్మాయిలను రప్పించుకోవడం, వారితో గడపడం చాలా సులభమన్న రీతిలో వారు మాట్లాడడం పట్ల దేశ వ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. పరిస్థితి తీవ్రతను గమనించిన బీసీసీఐ పాలనాధికారుల బృందం (సీఓఏ) వీరిద్దరినీ సస్పెండ్ చేయాలని సూచించింది. సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ వీరిని ఒక మ్యాచ్ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించగా, సభ్యురాలు, భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ మాత్రం విచారణకు ఆదేశించి, అది పూర్తయ్యే వరకూ సస్పెన్షన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేసింది. మొత్తం మీద సీఓఏ ప్రతిపాదనపై స్పందించిన బీసీసీఐ ఈనెల 11న వీరిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే, ఆతర్వాత జరిగిన పరిణామాలు, చర్చలు, సేకరించిన అభిప్రాయలను అనుసరించి సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని సీఓఏ నిర్ణయించిందని బీసీసీఐ తన ప్రకటనలో తెలిపింది. ఆ నిర్ణయం మేరకే నిషేధాన్ని ఎత్తివేశామని వివరించింది. ఇలావుంటే, వివాదాలకు కారణమైన ఆటగాళ్లపై కఠినంగా వ్యవహరించాలన్న బీసీసీఐ నిబంధనావళిలోని 46వ అధికరణకు ప్రస్తుత నిర్ణయం విరుద్ధమని కొంత మంది చేస్తున్న విమర్శలను సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ ఖండించాడు. నిబంధనావళిని అనుసరించే నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చెప్పాడు. కాగా, వివాదాస్పద వ్యాఖ్యలపై విచారణ ప్రస్తుతానికి వాయిదా పడినట్టు తెలుస్తోంది.



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనేందుకు ముందు, గురువారం శ్రీనగర్‌లో నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్‌లో పాల్గొన్న మహిళా పోలీస్ బృందం.



నవీ ముంబయిలోని సాయినాథ్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవం కోసం సైకిల్‌పై విన్యాసాలను ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు.

తేలని సీబీఐ సారథ్యం!

❖ వచ్చేవారం మళ్లీ కమిటీ భేటీ ❖ పోటీలో ఝా, ఆర్‌కే మిశ్రా, వైసీ మోదీ



న్యూఢిల్లీ, జనవరి 24:సీబీఐకి కొత్త సారథిని నియమించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన గురువారం జరిగిన ఉన్నతాధికార ఎంపిక కమిటీ ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయింది. సీబీఐ సారథిని ఖరారు చేసేందుకు ఈ కమిటీ వచ్చేవారం మళ్లీ సమావేశమయ్యే అవకాశం ఉంది. గత మూడు నెలలుగా సంక్షోభ వాతావరణం నెలకొనడం వల్ల సీబీఐకి పూర్తిస్థాయి సారధి లేకుండా పోయిన విషయం తెలిసిందే. 'ఈ రోజు ప్రధాని ఇంట్లో జరిగిన సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు..వచ్చే వారం మళ్లీ సమావేశం జరిగే అవకాశం ఉంది'అని సమావేశానంతరం కాంగ్రెస్ నాయకుడు, కమిటీ సభ్యుడైన మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ఈ త్రిసభ్య కమిటీలో ప్రధాని మోదీ, ప్రధాన న్యాయమూర్తి గొగోయ్, ఖర్గేలు సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. మొత్తం 70 నుంచి 80మంది పేర్లు జాబితాలో ఉన్నప్పటికీ గతంలో ఎవరు ఏ హోదాలో పని చేశారన్న దానిపై ఎలాంటి వివరాలు లేవని, వారి సామర్థ్యం విషయంలోనూ ఎలాంటి స్పష్టత లేదని ఖర్గే తెలిపారు. దీని దృష్ట్యానే ఈ పేర్లను లోతుగా పరిశీలించేందుకు మరింత సమయం కావాలని తను, గొగోయ్ అభిప్రాయ పడ్డామన్నారు. సాధ్యమైనంత త్వరలోనే ఈ ఉన్నతాధికార కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. అలోక్‌వర్మను సీబీఐ నుంచి తొలగించిన రెండు వారాల తర్వాత ఈ కమిటీ సమావేశం జరిగింది. 1982-85 బ్యాచ్‌లకు చెందిన ఐపిఎస్ అధికారులు ఈ పదవికి పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. అయితే సీనియారిటీ, సమర్థత, అనుభవం, అవినీతి కేసుల దర్యాప్తులో నిష్పాక్షికత అంశాల ప్రాతిపదికగా కొన్ని పేర్లను కేంద్రం ఇప్పటికే జల్లెడ పట్టినట్టు చెబుతున్నారు. గుజరాత్ డీజీపీగా పని చేస్తున్న శివానంద్ ఝా,బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ రజనీకాంత్ మిశ్రా, సీఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ రంజన్, ఎన్ఐఎ డైరెక్టర్ జనరల్ వైసీ మోడీ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు అభిజ్ఞ వర్గాల కథనం. సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుంటే శివానంద్ ఝాకు అవకాశం ఉంటుందని, గతంలో అహ్మదాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఝాతో ప్రధాని మోదీకి పరిచయం ఉందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఝాతో పాటు వైసీ మోదీ, ఆర్‌కె మిశ్రాలూ సీబీఐ సారథ్యం కోసం గట్టిగా పోటీ పడుతున్నారు.

జేఈఈ అభ్యర్థులకు మరో సువర్ణావకాశం

❖ రెండోమారు ఏప్రిల్‌లో పరీక్ష ❖ స్కోర్, ర్యాంకు పెంచుకునే వెసులుబాటు

❖ తొలి విడత విఫలమైన వారికి అవకాశం ❖ మార్చి 8 నుండి రిజిస్ట్రేషన్ ❖ ఏప్రిల్ 9 నుండి పరీక్ష ❖ ఏప్రిల్ 30 న ఫలితాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 24: ఐఐటీ జేఈఈలో విఫలమైన వారికి, తక్కువ స్కోర్ సాధించిన వారికి మరో సువర్ణఅవకాశాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఇచ్చింది. రెండోమారు ఐఐటీ జేఈఈని నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ సిద్ధమవుతోంది. తద్వారా జనవరిలో నిర్వహించిన జేఈఈ-1లో సరైన స్కోర్లు సాధించని వారికి ఇదో గొప్ప అవకాశం కలుగుతుంది. మొన్నటి ప్రవేశపరీక్షలో 9.29 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా, అందులో 8.74 లక్షల మంది మాత్రమే హాజరయ్యారు. హాజరైన వారందరికీ వారు సాధించిన స్కోర్ల ప్రకారం పర్సంటైల్‌ను ప్రకటించింది. అలాగే ఏప్రిల్ 8 వ తేదీ నుండి 12వ తేదీ వరకూ ఐఐటీ జేఈఈ రెండో విడత పరీక్ష నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ నెలాఖరులో అందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ కానుంది. ఫిబ్రవరి 8వ తేదీ నుండి మార్చి 7వ తేదీ వరకూ అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోవచ్చు. ఒన్‌టైమ్ రిజిస్టర్ చేసుకున్న వారు నేరుగా దరఖాస్తు చేయవచ్చు, తొలిసారి దరఖాస్తు చేసుకుంటున్న వారు ఒన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవల్సి ఉంటుంది. బి ఫార్మసీ , బి ప్లానింగ్‌కు 1.80 లక్షల మంది గత పరీక్షకు రిజిస్టర్ చేసుకోగా, ఈసారి ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఇక బిఈ, బీటెక్‌లకు9.29 లక్షల మంది రిజిస్టర్ చేసుకోగా ఈ సంఖ్య ఏప్రిల్ పరీక్షలో తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ముందస్తు జాగ్రత్తలు చాలా తీసుకుంది. పరీక్ష నిర్వహణకు వీలుగా దాదాపు 15 రోజుల పాటు అన్ని పరీక్ష కేంద్రాలను రిజర్వు చేసింది. అభ్యర్థులు ఎంత పెద్ద ఎత్తున హాజరైనా ఆ సామర్థ్యాన్ని తట్టుకునే రీతిలో పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసింది. చిన్న చిన్న కేంద్రాలు కాకుండా భారీ ఎత్తున ఒకే చోట నాలుగైదు వేల మంది పరీక్ష రాసేలా సన్నాహాలు చేసింది. అందుకు వీలుగా టీసీఎస్ భాగస్వామ్య సంస్థ ఐయాన్ డిజిటల్ జోన్‌తో పాటు పలు సంస్థలకు పరీక్ష నిర్వహణ బాధ్యతను అప్పగించింది. ఏప్రిల్ పరీక్ష హాల్‌టిక్కెట్లను నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ మార్చి 18 నుండి జారీ చేయనుంది. ఫలితాలు ఏప్రిల్ 30న ప్రకటించనుంది. ఇందుకు సంబంధించి ఖరారు చేసిన షెడ్యూలును ఈ వారాంతంలో విడుదల చేస్తుంది. ఏప్రిల్‌లో నిర్వహించే ఐఐటీ జేఈఈ రెండో విడత ఫలితాలను కూడా ఏప్రిల్ చివరి వారంలో విడుదల చేయనుంది. జనవరి 30న తొలి విడత ఫలితాలను విడుదల చేయాలని భావించినా, అంతా అనుకున్నట్టు సాగడంతో వారం ముందే ఫలితాలను ఇచ్చింది. అదే విధంగా ఏప్రిల్‌లోనూ చివరి వారంలో ముందుగానే ఫలితాలు విడుదల అవుతాయని భావిస్తున్నారు.





తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతోపాటు, జీతభత్యాలను పెంచాలన్న డిమాండ్‌తో పాట్నాలో గురువారం భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న మిడ్ డే మీల్స్ వంటవారు. చపాతీలతో నిరసన ప్రత్యేకతను సంతరించుకుంది.

ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టంపై

స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 24: ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ చట్టం కింద నిందితుడికి ముందస్తు బెయిల్ ఇవ్వరు. జస్టిస్ ఏకే సిక్రీ, ఎ అబ్దుల్ నజీర్, ఎంఆర్ షాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రివ్యూ పిటిషన్‌తో సహా ఈ పిటిషన్లను విచారించనున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టం అమలును సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన పిటిషనర్ల తరఫున న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ తప్పుడు అభియోగాల కింద ఈ కేసులో అరెస్టులు చేసుకుంటూ పోతే గందరగోళం నెలకొంటుందన్నారు. మరో పిటిషనర్ తరఫున న్యాయవాది గోపాల శంకరనారాయణన్ మాట్లాడుతూ, కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉందని, ఈ నేపథ్యంలో సవరం చట్టంపై స్టే ఇవ్వాలని కోరారు. కాగా ఈ సవరణ చట్టంపై స్టే ఇవ్వబోమని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసిం ది. ఈ చట్టం విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పక్కనపెట్టి ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టాన్ని కేంద్రం పార్లమెంటులో గత ఏడాది ఆగస్టు నెలలో ప్రవేశపెట్టగా, ఆమోదం లభించింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ, రివ్యూ పిటిషన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టాన్ని సవా లు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించాలని సుప్రీంకోర్టును కోరారు. రివ్యూ పిటిషన్‌పై ఇప్పటికే కేంద్రానికి నోటీసులు జారీ చేశామని, ఈ చట్టంపై దాఖలైన పిటిషన్లను విచారించే విషయమై త్వరలో తేదీలను లిస్టు చేస్తామన్నారు. కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్లపై తీసుకునే నిర్ణయం , పిటిషన్లవిచారణపైప్రభావం ఉంటుందన్నారు. ఈ కేసును విచారించే తేదీలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నిర్ణయం తీసుకుంటారని ధర్మాసనం పేర్కొంది.

Printed and Published by **T. Venkateswarlu** on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor **T.V.Ravi Reddy**,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, **Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60**

మంచులో..మనుగడ!

❖ సియాచిన్ సైనిక సాహసాలపై డాక్యుమెంటరీ

❖ 26న జియోగ్రఫీ చానల్‌లో ప్రసారం

న్యూఢిల్లీ, జనవరి 24: సియాచిన్ అంటేనే మంచు కొండ. వెన్నులో వణుకుపుట్టించే మంచు ముద్ద. అలాంటి అతి శీతల వాతావరణంలో సైనికులు ఏలా పనిచేస్తున్నారు? మైనస్ 50 డిగ్రీల వాతావరణంలో కూడా ఎలా మనుగణ సాధించగలుగుతున్నారు? అంతూపంతూలేని రీతిలో ఒకదాని తరువాత ఒకటిగా ఉండే హిమశిఖరాలపై ఎలా పనిచేయగలుగుతున్నారన్నది ఓ మిస్టరీనే. మామూలు చలినే తట్టుకోలేని పరిస్థితుల్లో దేశ రక్షణ కోసం ఒళ్లు గడ్డకట్టుకుపోయే హిమశిఖరం ప్రాంతంలో భారత సైనికులు జీవన విధానం, శైలి ఓ అద్భుతమే.

ఇప్పటి వరకూ వెలుగుచూడని ఇలాంటి అంశాలన్నో ఓ డాక్యుమెంటరీ రూపంలో మన ముందుకు రాబోతున్నాయి. అత్యంత ప్రతికూలమైన వాతావరణ పరిస్థితుల్లో వైమానిదళ ఆపరేషన్లకు సంబంధించిన కథనాలకు ఈ డాక్యుమెంటరీ అద్దపట్టబోతోంది. భారత 70వ రిపబ్లిక్‌డే సందర్భంగా నేషనల్ జియోగ్రఫిక్ చానల్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. 'ఎక్స్‌ట్రీమ్ ఫ్లయిట్- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్'అన్న శీర్షికతో 44 నిముషాల పాటుసాగే ఈ డాక్యుమెంటరీ భారత సైనికుల సాహసం, దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పనిచేసే దీక్షకు నిలువెత్తు నిదర్శనం కాబోతోంది. ఉపరితలానికి అత్యంత ఎత్తయిన ప్రాంతంలో అదీ మామూలు వ్యక్తులు క్షణం కూడా నిలబడలేని పరిస్థితుల్లో సైనిక దళాలకు చెందిన పురుషులు, మహిళలు విధులను నిర్వర్తించడం నిజంగా వారి సాహసానికి, ధీరోదాత్తతకు దర్పణమేనని ఈ డాక్యుమెంటరీ స్పష్టం చేయబోతోంది. అక్కడి సైనికులకు అవసరమైన పరికరాలను అందించడంతోపాటు ఉపశమనాన్ని కలిగించడంలోనూ వైమానిక సిబ్బంది ఎంతటి భారాన్ని మీద వేసుకుంటున్నారన్న వాస్తవాన్ని కూడా ఈ డాక్యుమెంటరీ విశదీకరించబోతోంది.

ప్రముఖ నటుడు కబీర్ బేడీ ఈ డాక్యుమెంటరికి నేపథ్య వ్యాఖ్యాన్ని అందిస్తున్నారు. జనవరి 26న నేషనల్ జియోగ్రఫీ చానల్,హాట్‌స్టార్‌లో ప్రసారమవుతుంది. డాక్యుమెంటరీ రూపకల్పనలోతాము ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొన్నామని అయితే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అందించిన సాంకేతిక, ఇతర చేయూత పుణ్యమాని ఎన్నో వెలుగుచూడని కథనాలను తాము ప్రజల ముందుకు తీసుకురాగలగుతున్నామని నేషనల్ జియోగ్రాఫిక్ ఇండియా ప్రొడక్షన్స్ క్రియేటీవ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ శృతీ తకూలియా తెలిపారు. సియాచిన్ హిమ ప్రాంతంతలో గాలి గంటకు 160 కిలోమీటర్ల వేగంతో వీస్తుంది. చాలా పరిస్థితుల్లో ఉష్ణోగ్రత కూడా మైనస్ 50 డిగ్రీల సెల్సీయస్‌కు చేరుకుంటుంది. అంతే కాకుండా ఆక్సిజన్ పరిమాణం కూడా చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో మనుగడ సాగించడం కూడా ఓ పెద్ద సవాలే. మంచు కొరికేయడం, మానసిక దిగులుకు లోనుకావడం, నిద్రలేమి, ఆకలి లేకపోవడం చివరికి జ్ఞాపక శక్తి కూడా తగ్గిపోవడం వంటి ఎన్నో సమస్యలు ఇక్కడ పనిచేసే సైనికులు ఎదుర్కొంటూ ఉంటారు. వీటన్నింటినీ ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టినట్టు మన ముందు ఉంచబోతోంది. ఇక్కడ పరిస్థితులను సియాచిన్‌లో పనిచేసిన తొలి ఎయిర్‌ఫోర్స్ కెప్టెంట్ ఖుష్బూ గుప్తా వెల్లడించారు. 2016లోనే ఈ డాక్యుమెంటరీ తీయాలని భావించామని చెప్పారు. అయితే కొంత ఆలస్యమైనా సియాచిన్‌లో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సైనికుల దైనందిన ఇక్కట్లు, సవాళ్లను డాక్యుమెంటరీ రూపంలో చిత్రీకరించగలిగామని ఈ ప్రయత్నంలో తమ సిబ్బంది గాయపడ్డారని తకూలియా స్పష్టం చేశారు.





C M Y K

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శుక్రవారం, 25 జనవరి 2019

అవిసెగింజలతో లాభాలు

★ అవిసె గింజలలో కొలెస్ట్రాల్ తగ్గించే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఇవి శరీరంలో వేడిని పుట్టిస్తాయి. ఈ గింజలు కొలెస్ట్రాల్ని, రక్తపోటుని, మధుమేహాన్ని అదుపులో ఉంచుతాయి. వీటిని ప్రతిరోజూ ఉదయం పూట తీసుకుంటే శారీరక అలసట తగ్గుతుంది. శక్తి లభిస్తుంది. శరీరం చురుగ్గా ఉంటుంది.



★ ఊబకాయం కొందరికి జన్యుపరంగా వస్తే మరి కొంతమందికి వారి జీవనవిధానం, ఆహారపు అలవాట్ల వల్ల వస్తుంది. తినే ఆహారంపై ముందు నుంచీ శ్రద్ధ పెడితే దీన్ని నివారించవచ్చు. అవిసె గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో ప్రొటీన్లు కూడా అధికంగా ఉంటాయి. ప్రొటీన్లు శరీర బరువు తగ్గుదలలో విశేషంగా తోడ్పడతాయి.

★ మహిళలు రోజూ అవిసె గింజలను తింటే వారిలో హార్మోన్లు సరిగ్గా విడుదల అవుతాయి. దీంతో రుతుక్రమం సరిగ్గా ఉంటుంది.

★ వీటిల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దాంతో తినే ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. తద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

★ అవిసె గింజల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మోకాళ్ల నొప్పులు రాకుండా చేస్తాయి.

★ అవిసె గింజల్లో పీచు ఎక్కువగా ఉండడం వల్ల నేరుగా తింటే సరిగా జీర్ణం కాదు.. అందుకే వీటిని సూప్, సలాడ్‌ల రూపంలో భోజనంతో పాటుగా తీసుకోవాలి.

★ ఇవి తినడం వల్ల జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. డిప్రెషన్ దూరమవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.



మాక్సీ మెరుపులు..

కాలం ఏదైనా, కొత్తగా కనిపించాలనుకునేవారికి సరైన ఎంపిక.. మాక్సీ.. ఇప్పటి తరానికి బాగా తెలిసిన డ్రెస్. ఒకప్పుడు మాక్సీలను హీరోయిన్లు మాత్రమే వేసుకుంటారు.. వారికి మాత్రమే ఇవి బాగుంటాయి అనుకునేవారు. ఇప్పుడు క్రమంగా అది సాయంత్రపు వేడుకలకు నప్పే డ్రెస్ అయ్యింది. కానీ నేడు.. అన్ని సందర్భాలకూ మాక్సీనే ట్రెండీ డ్రెస్. అందుకే నేటితరం అమ్మాయి వార్డ్‌రోబ్‌లో ఒక్క మాక్సీ అయినా ఖచ్చితంగా ఉంటుంది. కాలేజీకే కాదు.. చిన్న చిన్న వేడుకలకి, సినిమాలకి, పార్టీలకీ.. ఇలా అన్నింటికీ మాక్సీనే..

నేటి యువతరాన్ని దృష్టిలో ఉంచుకుని ఫ్యాషన్ డిజైనర్లు కూడా రకరకాల మాక్సీలను తయారుచేయడం బిజీ అయిపోయారు. మాక్సీ గౌను అంతా విశాలంగా, నీ లెంగ్త్‌లో ఉండదు కానీ ఫుల్ లెంగ్త్‌లో, శరీరాకృతిని బట్టి స్ట్రెయిట్ కట్‌లో ఉంటుంది. ఇప్పుడు ఇందులోనూ అంబ్రెల్లా కట్, సెమీ అంబ్రెల్లా కట్ అని చాలా రకాలు ఉన్నాయి. ఫిట్టింగ్‌లో కూడా ఫిట్టెడ్, సెమీ ఫిట్టెడ్ రకాలు ఉన్నాయి. కాస్త వదులుగా వేసుకోవాలనుకునే వారు కూడా ఆకృతిని అనుసరించి వదులైన వాటిని ప్రయత్నించవచ్చు. సిల్క్, షిఫాన్, జెర్సీ, బెనారస్, ఇకత్, కాటన్, క్రేప్ వంటి రకరకాల వస్త్రాలతో అనేక మాక్సీలు అందుబాటులో ఉంటున్నాయి. నేడు స్లిట్ ట్రెండ్ నడుస్తోంది. స్నేహితులతో సరదాగా ఆనందించే పార్టీల వేళ స్లిట్ రకం సరైన ఎంపిక. స్లిట్ అంటే.. కుర్తా మాదిరి మాక్సీకి చీలిక ఉంటుంది. ఈ స్లిట్‌కి మెరిసే వస్త్రంతో రూపొందించిన మాక్సీ అయితే బాగుంటుంది. ఈ తరహా మాక్సీలకు జతగా జీన్స్, డిజైనర్ లెగ్గింగ్స్, పలాజోలు కూడా వేసుకోవచ్చు. ఆఫ్ షోల్డర్స్ రకాలు కూడా బాగుంటాయి.

మాక్సీలపైకి ష్రగ్ కూడా వేసుకోవచ్చు. లాంగ్ డ్రైవ్స్‌కి, టూర్స్‌కి వెళ్లే వాళ్లు స్లీవ్‌లెస్ మాక్సీలు కానీ, ఫుల్ లెంగ్త్ స్లీవ్స్ ఉన్న మాక్సీలు కానీ ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. అలాగే టూర్స్‌కి ఫ్లోరల్ ప్రింట్స్ ఉన్న మాక్సీలు అయితే చాలా అందంగా ఉంటాయి. వీటికి లెదర్ జాకెట్స్ కూడా బాగా నప్పుతాయి. స్లీవ్‌లెస్ మాక్సీ పైకి ష్రగ్, కార్డిగిన్ బాగుంటాయి.

లావుగా ఉన్నవారు కొత్త డ్రెస్‌లను వేసుకోవడానికి భయపడుతుంటారు. లావుగా ఉన్నవారికి ఇలాంటి డ్రెస్‌లు నప్పవని వారి ఫీలింగ్. కానీ మాక్సీలు లావుగా ఉన్న వారికి కూడా చక్కగా నప్పుతాయి. కాస్త లావుగా ఉన్నవారు మరీ వదులుగా కాకుండా కేవలం నడుము దగ్గర మాత్రం పట్టినట్లు ఉండేదాన్ని ఎంచుకోవాలి. లేదంటే ఓ ఆకృతి అంటూ లేకుండా కనిపిస్తారు. సన్నగా, నాజూగ్గా ఉన్న వారు బనియన్ క్లాత్‌తో తయారుచేసిన మాక్సీలకు ప్రాధాన్యం ఇస్తే మంచిది. ఇవి వీరికి తీరైనా ఆకృతిలో కనిపించేలా చేస్తాయి. వెనుక సీటు భాగం లావుగా ఉన్నవారికి పాటర్న్ మాక్సీలు బాగుంటాయి. అంటే జామెట్రీ ప్రింట్లు, గళ్లు, పువ్వుల డిజైన్లు ఉన్న రకాలు సరిగ్గా నప్పుతాయి. ఫలితంగా నడుము భాగం లావుగా ఉందన్న విషయాన్ని ఎవ్వరూ గుర్తించలేరు. ఇక పొట్టిగా ఉన్న వారు పొడవాటి నిలువు గీతలున్న మాక్సీని ఎంచుకోవాలి. లావుగా ఉన్నవారు అడ్డగీతలున్న రకాల్ని ఎంచుకుంటే బాగుంటుంది. ఆఫీసుకెళ్లే వాళ్లు కూడా మాక్సీలను నిరభ్యంతరంగా వేసుకోవచ్చు. అయితే రంగుల జాగ్రత్తలు పాటిస్తే బాగుంటుంది. ముదురు నీలం, ఎరుపు, నలుపు రంగుల మాక్సీలు కార్యాలయానికి బాగుంటాయి. అలాగే కాలర్‌నెక్, ముందువైపు బటన్స్ ఉండేలా చూసుకుంటే మాక్సీలో కూడా హుందాగా కనిపిస్తారు. సంప్రదాయ వేడుకలకు కూడా మాక్సీలను వేసుకోవచ్చు. ఈ సమయాల్లో బెనారస్, బ్రొకేడ్ వంటి వస్త్రాలతో రూపొందించిన వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవచ్చు. వీటిపైన చక్కని ఎంబ్రాయిడరీ ఉంటే మరింత అందంగా కనిపిస్తారు. ఇలాంటివి వివాహ వేడుకలకు, రిసెప్షన్‌లకు బాగుంటాయి. మాక్సీలపైకి భారీ నగలకంటే తక్కువ నగలు వేసుకుంటేనే బాగుంటుంది. సిల్వర్ కలర్ నగలు, సింపుల్ డైమండ్ నగలు మాక్సీలపైకి అందంగా ఉంటాయి.





















త్యాగరాజు

పల్లవి: రసధునిలా ప్రవహించిన
రాగోజ్జ్వలహృదయా!
సరిగమలను శ్వాసించిన
సంగీత మహోదయా!
త్యాగయ్యా! ఇదిగో నీ
నీ కీర్తికి మా కీర్తనా..
అందుకోవయ్యా!
ఇది మా గీతార్చనా..


చరణం:
నాదసుధాసారంలో తడిసిన స్వరయోగీ!
వేదవీధిలో నడచిన వాగ్గేయ కళారవీ!
జగమేలే పరమాత్ముని నగుమోమును దర్శించి
సొగసుగా మృదంగ తాళ విన్యాసము నావించి
తెలుగుతీపి నలుదెసలకు పంచిన త్యాగయ్యా!
వెలుగుపూలు పూయించిన పుణ్యం నీదయ్యా!
॥రసధునిలా॥

చరణం:
కావేరికి శ్రుతిలయలను నేర్పిన గురుదేవా!
కాలమనే తంబురా మీటిన పృథుభావా!
ఎందరో మహానుభావులను జగతికి చూపించి
ఇనకుల తిలకుని హృదయం లోపల తిలకించి
రామభక్తి సామ్రాజ్యం ఏలిన త్యాగయ్యా!
ప్రణవానికి నీకూ మరి తేడా లేదయ్యా!
॥రసధునిలా॥

- రసరాజు
62812 99346

(నేడు త్యాగరాజస్వామి వర్ధంతి)

వ్యక్తిగత పరిశీలన తప్పనిసరి!



పన్నెండేళ్ల నుంచి ఆడపిల్లలకు వైట్ డిశ్చార్జ్ (తెల్లబట్ట) సమస్య మొదలవుతుంది. ఈ విషయం గురించి వారికి అంతగా తెలియదు. కొంతమంది తల్లులకు ఈ విషయం చెబుతారు.. కొందరు మాత్రం ఈ విషయం బయటకు చెప్పడానికి ఇష్టపడరు. పన్నెండేళ్ల వయస్సు నుంచి మెనోపాజ్ వరకు ఈ సమస్య ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది. దీని గురించి చాలామందికి సరైన అవగాహన ఉండదు. తెలుసుకోవడానికి చాలామంది మొహమాటపడుతుంటారు. అలాకాకుండా తమ శరీరంలో జరిగే మార్పులను తల్లితోనో, పెద్దవారితో చర్చించడం వల్ల సమస్యకు తగిన పరిష్కారం దొరుకుతుంది. అంతే కాక కుటుంబ వైద్యునితో కూడా ఈ సమస్య గురించి చర్చించవచ్చు. దీని గురించి వైద్యశాస్త్రం ఏం వివరిస్తోందో తెలుసుకుందాం..

నోట్లో లాలాజలం ఎలా తయారు అవుతుందో, అలాగే మహిళల జననేంద్రియాల నుంచి కూడా తెల్లని స్రావం తయారవుతుంది. దీన్నే వాడుక భాషలో తెల్లబట్ట (వైట్ డిశ్చార్జ్) అంటారు. వైద్య పరిభాషలో 'ల్యూకోరియా' అంటారు. ఇది ప్రధానంగా గర్భాశయ ముఖ ద్వారం (సర్విక్స్)లో ఉండే గ్రంథుల నుంచి యోని మార్గంలోకి స్రవిస్తుంది. యోనిమార్గంలో ఎలాంటి గ్రంథులూ ఉండవు. దీనిలో ద్రవ పదార్థంతో పాటు మృతకణాలు, జననేంద్రియాలకు మంచి చేసే బాక్టీరియా కూడా ఉంటుంది. ఈ బాక్టీరియాని 'డోడర్‌లైన్ బాసిల్లై' అంటారు. ఇవి మృతకణాలలోని గ్లైకోజన్‌ని విడగొట్టి లాక్టిక్ యాసిడ్‌ను తయారుచేసి వెజైనల్ పి.హెచ్.ని మెయింటైన్ చేస్తూ ఉంటాయి. ఈ చర్య వ్యాధికారక సూక్ష్మజీవులు జననేంద్రియాలలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. అలా ఈ ద్రవపదార్థం జననమార్గం తడిగాను, ఆరోగ్యంగా ఉండటానికి, సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించకుండా రక్షణ కవచంగా ఉపయోగపడుతుంది. సాధారణంగా రోజుకు దాదాపు 10 మిల్లీలీటర్ల వరకు ఈ తెల్లబట్ట కనిపిస్తుంటుంది. కొన్ని పరిస్థితుల్లో మాత్రం ఇది ఎక్కువవుతుంది. ఈ పరిస్థితులను రెండు రకాలు..



ఫిజియొలాజికల్ ల్యూకోరియా

ఇది ఏదైనా వ్యాధి వల్ల వచ్చే తెల్లబట్ట కాదు. దీనికి ఎలాంటి చికిత్సా అవసరం లేదు. దీనివల్ల దుర్వాసన, దురద వంటి సమస్యలేవీ ఉండవు. శారీరకంగా, మానసికంగా ఉద్రేకానికి గురైనప్పుడు ఇది వస్తుంది. ఇది దాదాపు అన్ని వయసువారిలో కనిపిస్తుంది. పది నుండి పన్నెండు ఏళ్ల వయసులో.. అంటే రజస్వల కావడానికి ముందు సుమారు మూడు నుంచి ఆరు నెలల పాటు తెల్లబట్ట అవుతుంది. ఇది జననావయవాల పెరుగుదల, రక్త సరఫరా ఎక్కువ కావడాన్ని సూచిస్తుంది. దీనికి ఎటువంటి చికిత్స అవసరం. లేదు. బహిష్టు రావడానికి నాలుగైదు రోజుల ముందు కానీ, పది పన్నెండు రోజుల ముందు కానీ తెల్లబట్ట కనిపించడం సర్వసాధారణం. నెల మధ్యలో అంటే అండం విడుదలయ్యే సమయంలో కనిపించే తెల్లబట్ట కొంత చిక్కగా ఉంటుంది. గర్భిణులుగా ఉన్నప్పుడు తొలినెలల్లో, నిండు నెలల్లో అయ్యే తెల్లబట్ట జననావయవాల పెరుగుదలను, రక్త సరఫరా వృద్ధిని సూచిస్తుంది. బహిష్టులు ఆగిపోయే దశలో కూడా హార్మోన్ల సమతుల్యత సరిగా లేక తెల్లబట్ట అవుతుంది.

పెథలాజికల్ ల్యూకోరియా

ఇది దుర్వాసన, దురదతో కూడి ఉంటుంది. ఇది రకరకాల ఇన్‌ఫెక్షన్‌ల వల్ల వస్తుంది. ట్రైఖోమోనాస్ వజైనాలిస్ ఇన్‌ఫెక్షన్ అనేది చాలా ఎక్కువగా కనబడుతూ ఉంటుంది. సుమారు నూటికి యాభైమందిలో ఈ సూక్ష్మజీవి కనిపిస్తూ ఉంటుంది. జననమార్గమంతా దురద, మంటగా ఉంటుంది. దుర్వాసనతో కూడిన ఆకుపచ్చ రంగు స్రావాలు మహిళలను ఇబ్బంది పెడతాయి. ఈ సూక్ష్మజీవి లైంగిక సంబంధాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కాబట్టి చికిత్స భార్యాభర్తలిద్దరికీ ఇవ్వాలి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్లలోనూ ఇలాగే ఉంటుంది. రోగనిరోధక శక్తి తగ్గినవారికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకూ ఇది ఎక్కువగా వస్తుంది. కొన్నిసార్లు సూక్ష్మజీవుల వల్ల వచ్చే వ్యాధులే కాక, జననేంద్రియాలలో వచ్చే కణుతులు, గడ్డలు, కేన్సర్‌లు తెల్లబట్టకూ కారణమవుతాయి. కాబట్టి 40 నుంచి 60 సంవత్సరాల మహిళలు ఎలాంటి నొప్పి, బాధ లేకపోయినా కూడా పాప్‌స్మియర్ అనే పరీక్ష చేయించుకుని కేన్సర్ లేదని నిర్ధారించుకోవాలి.

జాగ్రత్తలు

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- కాటన్ లోదుస్తులు వాడటం.
- బహిష్టు సమయంలో శానిటరీ నాప్కిన్స్ వాడడం, వాటిని ప్రతి రెండు గంటలకూ వాటిని మార్చుకోవడం.
- జననేంద్రియాలను గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవడం.
- గాఢమైన కెమికల్స్ కలిగి వుండే డెట్టాల్, సబ్బులు వాడకూడదు. మైల్డ్ సోపుతోనే జననేంద్రియాలను శుభ్రపరచుకోవాలి.
- జననేంద్రియాల వద్ద ఎలాంటి పెర్ఫ్యూమ్స్, సుగంధ ద్రవ్యాలు వాడరాదు.

గర్భాశయ ముఖద్వార కేన్సర్‌లో ప్రధానంగా కనిపించే లక్షణం కూడా తెల్లబట్టే.. అయితే ఈ తెల్లబట్ట రంగు మారి లేత పసుపుగా లేదా ఆకుపచ్చగా ఉన్నప్పుడు, చాలా దుర్వాసనగా ఉన్నప్పుడు, దురద కలిగిస్తున్నప్పుడు దీన్ని కేన్సర్‌గా పరిగణించి వెంటనే వైద్య చికిత్సను తీసుకోవాలి.

★

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచు బ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి శుక్రవారం, 25 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ॥ అంత్యకాలమునందు నాయాసమున నిన్నుఁ
దలఁతునో తలఁపనో - తలఁతునిపుడె!
నరసింహ! నరసింహ! నరసింహ! లక్ష్మీశ!
దానవాంతక! కోటిభానుతేజ!
గోవింద! గోవింద! గోవింద! సర్వేశ!
పన్నగాధిపశాయి! పద్మనాభ!
మధువైరి! మధువైరి! మధువైరి! లోకేశ!
నీలమేఘశరీర! నిగమవినుత!
తే॥ ఈ విధంబుగ నీ నామమిష్టముగను
భజన చేయుచునుందును నా భావమందు
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహస్వామీ! ప్రాణం పోయే చివరి క్షణంలో నిన్ను స్మరిస్తానో లేదో తెలీదు. అందువల్ల నరసింహ, లక్ష్మీశ, దానవాంతక, కోటిసూర్యతేజ, గోవింద, సర్వేశ, శేషశాయి, పద్మనాభ, మధువైరి, లోకేశ, నీలమేఘశ్యామ, వేదవినుత అని నిన్ను ఇష్టనామాలతో పిలుస్తూ స్మరిస్తాను.



అనంతం

44 -గోపరాజు నాగేశ్వరరావు

చీదరించుకుంది..చెంబుతో కొట్టింది.. రాయితో కొట్టింది.. తీవ్రంగా అవమానించింది.

అంత జరిగినా మనసు ఆమెవైపే పరుగులు తీస్తున్నదంటే ఆమెపట్ల ప్రేమ ఉన్నట్టేకదా!

ఆమెనే జపిస్తూ, ఆమెనే తపిస్తూ, ఆమెనే ఆరాధిస్తూ, ఊహల్లోకూడా ఆమె రూపాన్ని మనోఫలకమ్మీద ప్రతిష్టించుకొని ఆరాధించింది ప్రేమే కదా?

తిరస్కరించిందామె!

ప్రేమ ద్వేషంగా మారింది.

పట్టుదల పెరిగింది.

అది కసిగా మారింది.

అదంతా-

ఆమెను పొందాలన్న అప్రమేయ ఉన్మాదమే తప్ప, చాంద్‌నీ జీవితాన్ని ధ్వంసం చెయ్యాలన్న ఆలోచన కాదుకదా!

జరగాలనుకున్నది జరగలేదు.

జరగకూడనిది జరిగింది.

ఇప్పుడేం చెయ్యాలి?

వాళ్ళంతా కలిసి చాంద్‌నీకోసం వెళ్ళారు. ఆమెను బలవంతంగా ఐనా పట్టుకొస్తారు. పట్టుబట్టలిచ్చి, కట్నకానుకలిచ్చి, బంగారం పెట్టి,-

'దైవకార్యం' అంటూ జోగిన్ని చేస్తారు!

దేవుడి పేరిట జరిగే వ్యభిచారానికి మరో స్త్రీని సన్నద్ధంచేసి విటులకోసం బలిచేస్తారు.

అనుభవించి అవతలికి తోసేస్తారు.

జీవితాన్ని కుక్కలు చించిన విస్తరి చేస్తారు.

నిజంగా ఇది దైవ కార్యమేనా?

దైవకార్యమే ఐతే-

ఒక్క గొప్పింటి పిల్లా జోగిని కాదేమిటి?

ఇంతకీ చాంద్‌నీ ఒప్పుకుంటుందా?

ఒప్పుకోదు! చాంద్‌నీ ఒప్పుకోదు!!

ఆత్మాభిమానం వున్న పిల్ల!

అడవి బిడ్డల అభిజాత్యానికి ప్రతీకగా నిలబడుతుందే తప్ప, ఆత్మాభిమానం చంపుకోదు.. నవ్వుతూ ప్రాణాలైనా విడుస్తుంది తప్ప ససేమిరా ఆత్మవంచన చేసుకోదు.

ఆమె ప్రమేయం లేకుండానే జీవితాన్ని శాసిస్తూ జోగిన్ని చేస్తే అభిమానం గల పిల్ల ఎందుకు ఒప్పుకుంటుంది?

తప్పకండా ఎదురు తిరుగుతుంది.

తాము వంచించబడ్డామని తెలియని అడవి పుత్రులు దాన్ని దైవకార్యమని భావిస్తున్నప్పుడు తేలిగ్గా విడిచిపెడతారా, ఆమెను?

బలవంతంగా ఐనా రొంపిలోకి దించుతారు.

దించకపోతే దేవుడు ఆగ్రహిస్తాడన్న భయం వాళ్ళనలా చేస్తుంది!

ఇప్పుడేం చెయ్యాలి?

చాంద్‌నీ నెలాకాపాడాలి?

కాపాడే శక్తి వుందా తనకు?

రాగ్యాకి క్షణం కూడా వృధాచెయ్యబుద్ధికాలేదు!

బండమీద నుంచి చివాల్నలేచాడు. క్రిందికి దిగి, వేగంగా నడుస్తూ రెడ్డియానాయక్ తండా వైపుకు సాగిపోతోన్నాడు.

దారిలో కూడా ఆలోచనల కందిరీగలు విడిచిపెట్టటం లేదు!

అమ్మో! చాంద్‌నీని ఒకవేళ జోగిన్నిచేస్తే?

అదో పుణ్యకార్యంలా తలస్నానం చేయిస్తారు. క్రొత్త బట్టిలు కడతారు. కోరిన తిండి పెడతారు. నీడనిస్తారు. బ్రతుకుతెరువుకు పెట్టుబడిగా శరీరాన్ని నిర్ణయించి-

ఆత్మని చంపి మనిషిని బ్రతికిస్తారు!

ఆమె శరీరాన్ని కాయతొల్చు పురుగుల్లా గుల్ల చేసి, గుప్తరోగాల పుట్టని చేసి, అస్తిపంజరాన్ని చేసి, పూర్తిగా ధ్వంసమైందని నిర్ధారించుకొన్న తర్వాత గానీ,

ఇక శృంగారానికి పనికిరాదని ఆ సజీవ కళేబరాన్ని అవతలికి తోసెయ్యరు!

అంతటితో ఆమె శృంగార జీవితం ముగుస్తుంది.

చరమాంకం పరిసమాప్తమౌతుంది.

మళ్ళీ మరొక స్త్రీ జోగిని అవుతుంది.

ఆమె జీవితం కూడా అంతే!

ఆధ్యాత్మిక నేపథ్యంలో నిరంతరాయంగా జోగిన్లు తయారౌతూనే ఉంటారు!

'దైవకార్యం' జరుగుతూనే ఉంటుంది!

రసికులెంత ఋణపడి ఉండాలో!

చాంద్‌నీ జీవితం కూడా అలాగే ముగుస్తుంది?



వీల్లేదు.. అలా జరక్కూడదు.

చాంద్‌నీ జోగిని కాకూడదు!

ఆమెను రక్షించాలంటే ఏంచెయ్యాలి?

అంతే..!

ముందుగా ఆమెను తండానుంచి తప్పించాలి. ఎవ్వరికంటా పడకండా దూరంగా పంపించాలి.

దేవర అనుకొని కానిస్టేబులు కనకయ్య చెప్పింది నమ్మినవాళ్ళు చాంద్‌నీని పట్టుకొనేలోగా, ప్రమాదంనుంచి తప్పించాలి!

రాగ్యా పరుగు వేగం పెంచాడు.

తండావైపుకు దూసుకొనిపోతున్నాడు.

⁂

జాతరకి రమ్మని తండా పెద్దల్నించి యింకా కబురురాలేదు.

అక్కడి పరిస్థితినిబట్టి ఆడవాళ్ళు, పిల్లలు నల్లకొండ దగ్గరికి వెళ్ళాలో, లేదో నిర్ణయించాల్సిన వాళ్ళు యింతవరకూ అజాపజా లేరు.

కనీసం కబురు కూడా చెయ్యలేదు!

అక్కడ పరిస్థితి ఎలా వుందో?

సాయుధ పోలీసులు కవాతులు చేస్తున్నారనీ తండా ఖాళీ చేయించేందుకే ఆ సన్నాహాలనీ తండా పెద్దలు అనుమానిస్తూ వెళ్ళారు..

వాళ్ళ అనుమానం నిజమైందా?

అందుకే కబురు చెయ్యలేదా?

గొడవలేమైనా జరుగుతున్నాయేమో అన్న సందేహం కలిగింది, తండా ఆడవాళ్ళకి.

కబురుకోసం ఎదురుచూస్తూ ఆందోళన పడుతున్నారు.

చాంద్‌నీకి చాలా అసహనంగా వుంది!

జాతరకి వెళ్ళుంటే, యీపాటికి ఆట, పాటలతో ఎంత సంతోషంగా గడిచేదో కాలం! ఆమె మనసంతా నల్లకొండ మీదే వుంది!

కబురు అందించే మనిషి వస్తున్నాడేమో అని దారులు చూస్తున్నది చాంద్‌నీ.

అంతలో-

అడ్డదారిన పడి ఉరుకుపరుగుల మీద తండావైపే వస్తూ గోపీనాయక్ కనిపించాడు దూరంగా.

వార్తాహరుడేమో అనుకుంది చాంద్‌నీ!

కొద్దిక్షణాల్లోనే గోపీనాయక్ దగ్గరి కొచ్చాడు!

ముళ్ళపొదలు చీరుకుపోయి, చిరిగిన బట్టలు..

గసపోసుకొంటూ ఎగసిపడుతూన్న గుండె.. కళ్ళల్లో ఆందోళనా.. ఏదో జరిగింది అనుకున్నది చాంద్‌నీ! భయపడ్డది.

''తొందరగా బయలెళ్ళు! తండా యిడిసిపెట్టి యాడికన్నా బోయి సుకంగా బతుకు.. ఛణంగూడా యాడ ఉండొద్దు శాందినీ- ప్రైవాదఁవ్''అని, చాంద్‌నీవైపు బాధగా చూసాడు గోపీనాయక్.

ఒక్క క్షణం ఆమెకు ఏమీ అర్థంకాలేదు.

''ఏంటిది యిసఁయఁవ్'' అని అడిగింది.

''నిన్ను జోగిన్నిజేసి, గరుడాశలఁవ్ గాడితో కన్నెరికఁవెట్టిత్తారంట!

చాంద్‌నీ నిర్ఘాంతపోయింది!

అడవి తండాల్లో పలుకుబడి, మాట చలామణి వున్న అతనే అలా అన్నాడంటే పరిస్థితి తీవ్రంగానే వున్నట్టు చాంద్‌నీ గ్రహించింది!

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. చేసే పనులలో ఇబ్బందులుండును. క్రొత్త పనులను ప్రారంభించుట మంచిది కాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదుచేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్నిరంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్న లోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ప్రయత్న కార్యాలలో దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరుతాయి. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్ని విధాలా సుఖాన్ని పొందుతారు.

మాటాట

నిర్వహణ: సుధామ 1854

1		2	■	3		
■	■	4	5		■	■
6	■	■		■	■	7
8			■	9		
	■	■	10	■	■	
■	■	11		12	■	■
13			■	14		

ఆధారాలు

అడ్డం

1. ఒంటె
3. అపశకున పక్షి
4. చీకటి
8. బుద్ధి, వాక్కు
9. నేలను చదునుచేయు సాధనం
11. కుంటెనకత్తె
13. కఱ్ఱ సామగ్రిలో ఓ రకం
14. ఉప్పు

నిలువు

2. సన్న్యాసి
3. ఒడ్డు
5. ఆకాశము
6. ప్రకాశము, వెలుగు, కిరణము
7. బస
10. అసురుల తల్లి
11. దప్పిక, పరితాపము
12. స్వప్నము

మాటాట-1853 సమాధానాలు

అడ్డం		నిలువు	
2. కాంచనము	9. ఛాయ	1. అండము	7. తోయము
5. అంచ	10. చావు	3. చయము	10. చార్వి
7. తోక	12. ముది	4. చింక	11. కుమ్మరి
8. క్షుత్	14. చత్వరిక	6. చక్షువు	13. దిసంతు

సృష్టి భగవంతుని సొత్తు

మానవుడు తప్ప మిగిలిన జీవరాశులన్నీ ప్రకృతి నియమాలను ఖచ్చితంగా పాటించి తమ జీవనాన్ని కొనసాగిస్తాయి. దైవ సంకల్పంతో సృష్టించబడిన ఎనుబది నాలుగు లక్షల జీవరాశులలో మానవుడొక్కడే నియమాలను ఉల్లంఘించి అధముడగుచున్నాడు. ఏ జీవినైతే అత్యున్నతంగా తీర్చిదిద్దాలని సృష్టికర్త అనుకున్నాడో గానీ అది సఫలీకృతం కాకపోవడం సృష్టి వైచిత్రి. ఆవు గడ్డి తిని మనకు పాలిస్తుంది గాని అది పాలను త్రాగదు. అలాగే మాంసాహారులైన మృగాలు మిగిలిన జంతువులను చంపి మాంసాన్ని తింటాయిగాని గడ్డిని తినవు. కాని మానవుడు తనకు నిర్దేశించిన ఆహారాన్నే గాక సమస్త జీవజాతులను సంహరించి తినడం చూస్తే గొప్ప ఆశ్చర్యం కలగక మానదు. శాఖాహారి వృక్షాలు, మొక్కలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తాడు. వాటికి కూడా ప్రాణం ఉందనేది ఒక వాదన. కొంతవరకూ అది సత్యమేనయినా, వాటిని త్రుంచినపుడు బాధను వ్యక్తం చేయలేవు. ఎందువలననగా భగవంతుడు వాటిని సాత్వికులకు ఆహారంగా సంకల్పించడం. ప్రకృతి కూడా ధర్మమును అనుసరిస్తుంది. ఈ సమస్త సృష్టిలో ధర్మమనేది అత్యంత సూక్ష్మమైనది మరియు జఠిలమైనది. కాని ధర్మము మాత్రము శాశ్వతమైనది. జీవరాశుల మనుగడకు ఆమోదయోగ్యమైనది ధర్మము. సృష్టిలోని ప్రతి పరమాణువు భగవంతుని సొత్తు. అందువలన మన లౌకిక జీవనానికి ఎంత అవసరమో అంతే మొత్తాన్ని అనుభవించాలి తప్ప దురాశకు పోకూడదు.

ప్రకృతి శాసనాలను ధిక్కరిస్తే ఉపద్రవము తప్పదు. నేడు మానవుడు తన భోగలాలసత్వానికి సృష్టించుకొనే వస్తు కర్మాగారములవల్ల అధికోష్ణము జనించి చివరకు హిమనీ నదములు కూడా కరిగి కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. అంటే మానవుడు తన విశృంఖలత్వము వలన యుగాంతమునకు అతి త్వరలో చేరువ అగుటయేగాక భావితరాల కనీస సుఖ జీవనముకు ప్రశ్నార్థకమగుచున్నాడు. ఇటువంటి జీవన విధానమును మన సనాతన ధర్మం సూచించలేదు. ఈ కలియుగంలో నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా జీవించాలని ప్రతి ఒక్కరూ ఆశపడతారు. కానీ దానికి తగిన జీవన మార్గాన్ని సుగమం చేసుకోవడంలేదు.

ఆహారము, నిద్ర, యోగము, భోగము, పని మొదలైనవి పరిమితంగానే ఉండాలి. మనకు దేనినైతే ప్రాప్తము చేసాడో దానితో తృప్తిపడాలి తప్ప మితిమీరి కోరికలు తీర్చుకోకూడదు. ఈ ప్రకృతి భగవంతునిదైతే దానినుండి మానవుడు సృజించే సమస్త వస్తువులను భగవదర్పితం చేసిగాని వినియోగించకూడదు. ముఖ్యంగా తినే సాత్విక ఆహారం భగవంతునికి నివేదించి మాత్రమే భుజించాలి. జీవులకు మొదట మరణాన్ని ఖరారు చేసి ఈ లోకంలో ప్రవేశపెడతాడు. కావున జీవుడు చేసే ప్రతి కర్మకూ కర్త ఆ పరాత్పరుడు. కర్త ఆయనే అయినపుడు ఫలితంపై మనకు అధికారమెక్కడుంటుంది? అందువలన అనుక్షణం భగవంతుని కీర్తిస్తూ మన కర్తవ్యాన్ని నిమిత్తమాత్రముగా నిర్వహిస్తూ తరించడం తప్ప వేరొక తరుణోపాయం లేదు. ఎవరైతే భగవదర్పితముగా కర్మలను ఆచరిస్తారో వారే పరోపకారులు మరియు కర్మయోగులు. అటువంటివారి సాంగత్యమువలన సాత్విక జీవన విధానము అలవడుతుంది. నిండు నూరేళ్ళు సంపూర్ణ ఆరోగ్యముతో జీవించగలరు.

దోసపండు తన తీగ నుండి విడిపోయినట్లు దానికి ఎటుల తెలియకుండదో, అదే విధముగా ఆత్మ ఈ దేహమునుండి సునాయాసంగా విడిపోతుంది. పునర్జన్మ లేకుండా సంసారాన్ని అతిక్రమిస్తుంది. అటువంటి గొప్ప మోక్షపథాన్ని మన సనాతన ధర్మం మనకందించింది. సర్వం ఆ భగవంతుని సంపూర్ణ స్వరూపమని భావించి తరించాలి. సృష్టిలోని పదార్థమంతా ఆయనకు చెందినదిగా అంగీకరించి, కర్మలను కొనసాగించి పరమశాంతిని పొందటం విజ్ఞత.

-వారణాశి వెంకట సూర్య కామేశ్వరరావు

శ్రీపాద సుబ్రహ్మణ్యా శాస్త్రి కథలు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

1925 తరువాత ఆయన సంఘంలోని పాత్రల సంభాషణలను యధాతథంగా టేపు రికార్డు చేసి వినిపిస్తున్నారా? అన్నంత సహజంగా నాటకీయంగా రాస్తూ కథలు తయారు చేశారని చెప్పుకున్నాం కదా! ఈ సందర్భంలో వారే స్వయంగా ఒక చోట చెప్పిన ఉదంతం చెబుతాను. రాయవరం నుంచి వచ్చే రెడ్డిరాణి పత్రికకు శాస్త్రిగారిని కథలు రాయమనడం అబ్బురం కాదు. చాలా కథలు ఆయన అందులోనే రాశారు. ''శాస్త్రిగారూ! బాల వితంతువయిన ఒక రెడ్డి యువతి, మళ్లీ పెళ్లి చేసుకున్నట్లు ఒక కథ కల్పించండీ'' అని అడిగారట వారిని ఒక రెడ్డి మిత్రుడు. ''భూమంచి రెడ్లలో వితంతు పునర్వివాహ వాంఛ కూడా పొడసూపని రోజులవి''. అంతట శాస్త్రిగారు సాహసించి బుచ్చి వెంకయ్యమ్మ అన్న కడు రమ్యమయిన కథ రాసి యిచ్చారు. ఇక, భారతి వచ్చిన తరువాత శాస్త్రిగారి కథలకి మరీ పెద్దపీట లభించింది.

వివాహ వ్యవస్థమీద శాస్త్రిగారేనాడో దృష్టి కేంద్రీకరించారు. దృక్పథమున్నూ ఏర్పరచుకున్నారు. తన కథల ద్వారా పథ నిర్దేశం కూడా చేశారు. కులాంతర, మతాంతర, వర్ణాతర, శాఖాంతర వివాహాల ఆవశ్యకతా, 'జాతీయత'కు అవసరమని అనేక నాటకీయమైన కథల ద్వారా చాటారు.

నాటికీ నేటికీ కూడా సన్నివేశ కల్పన పాఠకుడి ఊహలోనే జనించే విధంగా ఒక్క పలుకు, ఒక్క వివరణా ఏమీ తానై యివ్వకుండా కథను పరిగెత్తించడంలో ఆయనకు ఎవ్వరూ సాటిలేరు. ఆయనను మరొకరు అనుసరించను కూడా లేకపోయారు. సర్వసాక్షి కథన రీతి ఆయనది. వారి బాణీకి మనం పులకరించిపోతాం, చలించిపోతాం, కేవలం సంభాషణాత్మకంగా సాగిన కథలలో బ్రాహ్మణాగ్రహారం, కూతుళ్ల తల్లి, షట్కర్మయుక్తా, జాగ్రత్తపడవలసిన ఘట్టాలు లాంటివి శ్రవ్య నాటికల్లాగా వుంటాయి. 'ఆకాశవాణి'కి కూడా ఆయన చాలా రాశారు.

ఇక నాటకం అన్న కథ అంతా హాస్యమయం! నాలుగు పాత్రలుండటం చేత స్వల్ప వివరణా, కథనం వుంటాయందులో. 1935 నాటి భారతిలో పడ్డ యీ కథ ఆద్యంతం నాటి స్థితిగతులకు అద్దం పడుతుంది. రాజమండ్రి వూళ్లోకి రాఘవాచారి నాటకం వస్తుంది. కామేశ్వరీ, విశ్వనాథం పొరుగునున్న దంపతులతో నాటకం చూడ్డం కోసం తొందరగా సిద్ధమైపోతూంటే అనుకోని చుట్టం ఒకడు అదే నాటకం చూడవచ్చి భోజనానికని పూడిపడతాడు. ''రావడం అయిదు గంటల బండిలోనే వచ్చాను'' అంటాడు. కానీ ''గోదావరి తీరాన గాలి పీల్చుకుని ఎనిమిది గంటలకు అలా తగలడ్డాడన్న''మాట.

''అప్పుడనగా వచ్చి, ఇంతవరకూ ఏ పెద్ద గుఖ్ఖానికి పళ్లుతోముతున్నావు మరిదీ?'' అంటుందామె. ''మీ అన్నయ్య దగ్గర కూర్చో నిముషంలో వంట చేస్తాను స్టవ్ మీద''.

''పాపం మళ్లీ నాకోసం..''

''పాపాలకు పోక.. కానీ, మరి యీ నాటకానికి మా చెల్లాయిని 'ఆగంతుకని భార్యని' తీసుకుని వచ్చేవు కాదే?'' అంటుందామె.

''పెళ్లికి వెళుతూ పిల్లినీ.. అనీ'' అని నవ్వుతూ చులకనగా అన్నాడో లేడో.. కామేశ్వరి ''అవునులే కుక్కకి పిల్లి ఎందుకూ?'' అని వాత అంటిస్తుంది. శ్రీపాదవారు ఆడవాళ్లమీద యీగ వాలనివ్వరు. బహు స్త్రీజన పక్షపాతి ఆయన. సరే చివరికి ఆ చుట్టం హోటలుకే పోతాడు. ఈ కథలో యిల్లాలు మొగానికి మంచుమీగడ రాసుకుంటుంది. అంటే స్నో అన్నమాట. తన భాగం చింతన చేసుకోవడం అంటే పోర్షన్ వల్లె వేసుకోవడం. ఝుమాయించి అడగడం, ఖణాయించి కూర్చోడం, డచ్చీలు కొట్టడం, కజ్జకోరు పనులు, ధరణా చేయడం లాంటి విలక్షణమైన ప్రయోగాలెన్నో వారి కథలలో వుంటాయి.

ఇంగ్లీషు వాసనలు మచ్చుకయినా అంటని, నూటికి నూరుపాళ్లూ తెనుగు రమ్య కథా రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అనడానికో ఉదాహరణ యిదే! కొన్ని ఇంగ్లీషు మాటలకు వారు తయారుచేసిన తెనుగు పదాలు ఏరి కూర్చితే అదీ, ఒక రీసెర్చి గ్రంథమే అవుతుంది! అటు పాండీ ప్రకర్ష, యిటు సహజ ప్రతిభా పాటవం జోడు గుఱ్ఱాల రథం ఆయన రీతి!

సూదికోసం సోదికెళ్లినట్లు లాంటి సామెతలున్నాయి. సలగ-సలగ, సడే సంబడం లాంటి విరుపులూ వారివే. తోకమీద నిలిచిన ఊరు గాంగన, రూపేక్షణాలు లాంటి గంభీర పదప్రయోగాలున్నూ ఆయనే చెయ్యాలి.

- సశేషం

వినమరుగైన..

వీరాజీ

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

పరిపూర్ణమైన భాష సంస్కృతం

భారతీయ శాస్త్రీయ
సంగీతం మరియు ఆరోగ్యం

భారతీయ శాస్త్రీయ సంగీతంలో ఉన్న వైద్య ప్రభావాలను పాశ్చాత్యులు తెలుసుకుంటున్నారు. మైకెల్ బ్రవున్ స్టైన్ వారి వ్యాఖ్య ప్రకారం ''రుగ్మతలను పోగొట్టే ప్రభావం సంగీతానికి ఉన్నట్లు పురాతన భారతీయ వేద గ్రంధాలు పేర్కొన్నాయి. అతి పురాతన వైద్య విధానంగా నమ్మోదైన ఆయుర్వేదానికి అనుబంధమైన గాంధర్వ వేదం ప్రకృతిలోని లయ మరియు సామరస్యానికి ప్రతిరూపంగా సంగీతాన్ని ఉపయోగించినట్లుగా తెలియజేస్తుంది. శరీరం ఈ ప్రకృతి శక్తుల ప్రభావాన్ని గ్రహించగా, ప్రకృతితో ఆరోగ్యాని కి కూడిన సహజ బంధం గురించి మనసు తెలుసు కుంటుంది.

సంస్కృత భాష

సర్ విలియమ్ జోన్స్ ఆంగ్ల న్యాయాధీశుడు మరియు సాహితీవేత్త, భారతదేశంలో పని చేస్తున్నప్పుడు 1786 సంవత్సరం లో రాయల్ ఏషియాటిక్ సంస్థలో ఇచ్చిన ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు. ''సంస్కృత భాష అతి పురాతనమైనను అద్భుతమైన నిర్మాణం కలిగినది, గ్రీకు భాష కన్నా ఖచ్చితమైనది, లాటిన్ భాష కన్నా మరింత సమృద్ధమైనది మరియు ఆ రెండింటి కంటే అతి సుందర మైనది...''

ప్రొఫెసర్ ఆంటోనియో టి.డి. నికొలస్ ఇలా వ్రాసారు ''అస్త వ్యస్తంగా ఉన్న రోమన్ సమీకరణాలు మరియు ఆంగ్ల.బాష ఉచ్చారణకు పోలిస్తే సంస్కృత సమీకరణాలు ఖచ్చితంగా ఉంటాయి.''

''దానికి సమాధానం ఇవ్వాల ంటే సంస్కృత భాష లక్షణాలు తెలుసుకోవాలి. శబ్ధంలో ఉండే అందం, ఉచ్చారణలో ఉండే ఖచ్చితత్వం మరియు విశ్వసనీ యత ఇంకా దాని నిర్మాణం యొక్క ప్రతి అంశంలో సంపూర్ణత వల్ల సంస్కృతం మిగిలిన అన్ని భాషల కన్నా మిన్నుగా నిలుస్తుంది. అందుకే అది ఇతర భాషలలా కాకుండా ప్రాధమికంగా ఎన్నడూ మార లేదు. మానవజాతి యొక్క అత్యంత పరిపూర్ణమైన భాషగా ఉన్న అది, మారవలసిన అవసరం లేదు.''

అతను అన్నట్లు ''సంస్కృత భాష లక్షణాలు మీ బిడ్డ యొక్క లక్షణాలుగా మారతాయి - అంటే మీ బిడ్డ యొక్క మనస్సు మరియు గుండె అందంగా, ఖచ్చితంగా మరియు విశ్వసనీయంగా మారుతాయి.''

పైన చెప్పినవి, నిజంగా తన ప్రాంతీయ భాష సంస్కృతం కాని వ్యక్తి నుండి వచ్చిన నిర్దిష్టమైన ప్రశంశలు, అతను తన ఉపన్యాసంలో సంస్కృతాన్ని యూరోపియన్ భాషలతో పోల్చుతారు. సంస్కృత భాష వైపు చేసే అద్భుత ప్రయాణాన్ని పరిచయం చేయడానికి చాలా ప్రాధమిక స్థాయిలో కొన్ని లక్షణాలను మనం పరిగణనలోకి తీసుకుందాం. పైన పేర్కొన్న ప్రశంశలను వివరించడానికి మరియు ఆంగ్ల భాషతో సోదాహరణంగా పోల్చి చూడటం కోసమే, కాని భాష యొక్క నిర్మాణానికి సంబంధించి వివరా లలోకి వెళ్ళడం ఈ పుస్తకం యొక్క లక్ష్యం లేదా పరిధి కాదు.

ఈ విభాగంలో ఇంతకు ముందు, మనం సంస్కృతంలో ఉదాహరణల గురించి సర్ విలియం జోన్స్ నుండి వ్యాఖ్య లు గమనించాం. భాషకు ఎప్పుడు చాలా కేసులు ఉంటా యో, ఆంగ్లంలో 'విభక్తులు' అని పిలవబడేవి అవసరం లేదు. ఉదాహరణకు, జగద్గురు శంకరాచార్య విరచిత సుందర కూర్పుని పరిగణిద్దాం.

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే !

భజ మరియు గోవిందం రెండవ పంక్తిలో వరస మారాయి. సంస్కృతంలోనే ఇది సాధ్యం ఎందుకంటే, క్రమంలో మార్పు వల్ల దాని అర్థం మారదు. ఇలాంటి అద్భుతాలు సాధ్యమయ్యే విధంగా ఈ భాష నిర్మించబడింది. అదే విధంగా, 'నమ: పార్వతీ పతయే' లేదా పార్వతీ పతయే నమ:' అన్నా సరిగ్గా అదే అర్థం. వ్యాకరణం లోని ఇతర నిబంధన లకు అనుగుణంగా క్రమాన్ని ఎంచుకోవడం కవులకే వదిలి వేయబడింది. అదే మనం ఆంగ్ల భాషలో అలా చేయడానికి ప్రయత్నిస్తే మనకి అర్థవిహీ నంగా అనిపి స్తుంది. ఉదాహరణకు, 'సెల్యూ ట్సులో శివ' అనే పద సమూహాన్ని పరిగణిద్దాం. పదా ల స్థానం మార్చితే, దాని ఉద్దేశించ బడిన అర్థం పోతుంది. రెండు పదాలను కలపడానికి మధ్యలో 'టు' అనే విభక్తి ఉంది. పదాలను అటుదిటు చేసినప్పుడు, వాటి మధ్య సంబంధం మారుతుంది.

పద్యాలలో మరియు పద్యాల వంటి శ్లోకాలలో 'ఛందస్సు వ్యాకరణ నియమాలు' మరొక అంశం. ఒక పదంలో అక్షరాల లయ, శబ్దం, సంఖ్య అక్షరాలు పలికే విధానం అన్నీ వ్యాకరణ నియమాలలో పేర్కొనబడి ఉన్నాయి. సంస్కృతం కేవలం ఒక గొప్ప భాష మాత్రమే కాదు ఇంకా ఒక అద్భుతమైన భాష. ఒక వేళ మీ ఎదుట దేవుడు ప్రత్యక్షమై ఒకే ఒక పదంతో మీ కోరిక ఏమిటి అని అడిగితే, అది ఏమి అవుతుంది? పైన ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి సరైన భాష ఎంచుకోవడం వివిధ భాషాజ్ఞానం ఉన్న వారికి క్లిష్టమైనది కాకవచ్చు.

ఇంకావుంది...

నాదోపాసిత దివ్యత్వం



డా॥ గరికపాటి ఆనంద్
9966059562

2

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

మార్జాల మూషిక సంవాదము

108 మహాభారతంలో ఉపాఖ్యానాలు



డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

ఒక అరణ్యంలో ఒక పెద్ద మర్రిచెట్టు ఉండేది. దానిని చుట్టుకొని ఎన్నో తీగలు, దాని కొమ్మలపైన ఎన్నో పక్షులు ఉండేవి. దాని కొమ్మ అన్నివైపులా విస్తరించి బాటసారులకు చల్లని నీడనిచ్చేది. ఎన్నో ప్రాణులకు, పాములకు జీవజంతువులకు అది ఆశ్రయమైంది. దాని మొదలు యొక్క చుట్టుకొలత చాలా పెద్దదిగా ఉన్నది. ఆ మొదట్లో ఉన్న రంధ్రంలో కలుగు త్రవ్వకొని ఒక ఎలుక సుఖంగా జీవిస్తూ ఉండేది. దాని పేరు పలితం. అది చాలా తెలివైనది. అలాగే ఆ మర్రి కొమ్మలపై పక్షిపిల్లలను తింటూ 'లోమశం' అనే పిల్లి సుఖంగా ఉండేది. ఆ అడవిలోనే నివసించే ఒక బోయవాడు ప్రతి రోజు సాయంత్రం మట్టిచెట్టు క్రింద బోను ఏర్పాటు చేసి, సన్నని దారాలతో అల్లిన వలను ఏర్పాటు చేసి, వెళ్ళిపోయి, మళ్ళీ తెల్లవారగానే వచ్చేవాడు. నిత్యమూ ఆ వలలో ఏవేవో జంతువులు పడుతూ ఉండేవి. వాటిని తీసుకొనిపోయి బోయవాడు తన జీవనాన్ని సాగించేవాడు.

ఒక రోజు దురదృష్టవశాత్తూ పిల్లి ఆ వలలో చిక్కుకుంది. తనకు శత్రువు అయిన పిల్లి వలలో చిక్కిపోవడం చూసి ఎలుకకు చాలా సంతోషం, ధైర్యం కలిగాయి. అది నిర్భయంగా కలుగులోంచి బయటకు వచ్చి దానిముందే నాట్యమాడసాగింది. అలా ఆహారం కోసం తిరుగుతున్న పలితం (ఎలుక) పిల్లి చిక్కిన వలమీద ఉన్న మాంసం ముక్కను చూసింది. వెంటనే అది వలపైకి ఎక్కి ఆ మాంసాన్ని తినేసింది.

తన శత్రువు వలలో పడటం చూసి మాంసం తింటూ ఆనందిస్తున్న ఎలుక మరో ప్రమాదకరమైన శత్రువు ముంగిస రావడం చూసింది. ఆ ముంగిస భూమిలోని కన్నంలో పడుకుని ఉంది. దానిపేరు హరిణం. అది ఎలుక వాసన పసిగట్టి తొందరగా అక్కడికి వచ్చింది. అది నేల మీద నుంచి తలపైకెత్తి ఎలుక కోసం నాలుక చాచింది. ఇంతలో ఎలుకకు కొమ్మమీద ఇంకొక శత్రువు గుడ్లగూబ రూపంలో కన్పించింది. దానిపేరు చంద్రకం. అది రాత్రిపూటే తిరుగుతుంది. దాని ముక్కు చాలా వాడిగా ఉంటుంది. ఇలా ఆ చిన్న ఎలుక ముంగిస, గుడ్లగూబల బారిన పడింది. అది వారిద్దరినీ చూచి చాలా భయపడి ఇలా ఆలోచించడం మొదలుపెట్టింది.

''నాకు ఎదుట మృత్యువు సిద్ధంగా ఉంది. ఇప్పుడు ఏమి చేస్తే ఆపద నుండి బయటపడగలను? చుట్టూ ఆపదే కనిపించి భయం కలిగిస్తోంది.'' ఎలుక అలాగ ఆపదలో ఉండి భయంతో మరల ఆలోచించసాగింది. ఇప్పుడు నా నెత్తిమీదికి ఆపద రానే వచ్చింది. ఇలా వినాశనంలో చిక్కుకున్న వారు చేయవలసిన పని ఏదోవిధంగా జీవితాన్ని దక్కించుకోవడం. అదే తక్షణ కర్తవ్యం. నేల మీదికి వెళితే ముంగిస తినేస్తుంది. ఇక్కడే ఉంటే గుడ్లగూబకు ఆహారమైపోతాను. వల తెంచుకుంటే పిల్లి మ్రింగేస్తుంది. కనుక నా వంటి తెలివైనవాడు ఇలా భయపడరాదు. మరణాన్ని స్వీకరించేదాక పోరాడాలి. కనుక యుక్తితో ప్రయత్నిస్తాను. ఎందుకంటే నీతిశాస్త్రం తెలిసినవాడు బుద్ధిమంతుడు, తెలివి కలవాడు ఎంత దారుణమైన ఆపద వచ్చినా మునిగిపోడు, క్రుంగిపోడు. ''నాకు ఇప్పుడు ఈ పిల్లిని మించిన గతి ఇంకొకటి లేదు. కాని ఇది కూడా కష్టంలో ఉంది. పైగా నాకు శత్రువు. నేను దీనికి చేయవలసిన పని కూడా గొప్పది. ఇప్పుడు నన్ను ముగ్గురు శత్రువులు తినాలని చూస్తున్నారు. కనుక ఒక శత్రువుతో స్నేహం కలపడం మంచిది. ముందుగా పిల్లిని ఆశ్రయిస్తాను. నాకు ఇది పరమశత్రువైనా ప్రస్తుతం విషమపరిస్థితిలో ఉంది. దీనికి



ఉపదేశిస్తాను. నా ఉపదేశంలోని స్వార్థాన్ని గ్రహించడానికి ఇది తెలివితక్కువది. పైగా ఆపదలో ఉంది. కనుక నాతో సంధి చేసుకోవచ్చును. అపండితుడైన మిత్రునికంటే పండితుడైన శత్రువు మేలు. అది తన్ను తాను రక్షించుకోవడం ఎందుకో దీనికి చెప్తాను. నా ఉపదేశంతో ఇది తెలివిగలది కావచ్చును. నా బ్రతుకు దీని మీద ఆధారపడి ఉంది''

ఇలా ఆలోచించిన ఎలుకకు ప్రయోజనం యొక్క తత్త్వాన్ని, స్థితిని, సంధి, విగ్రహ, సంయమనాలు తెలుసు. కనుక అది మెల్లగా మృదువైన మాటలతో పిల్లితో ఇలా అన్నది. ''మార్జాలమా! మంచి మనసుతో అడుగుతున్నాను. బాగున్నావా? నీ హితమే నేను కోరుతున్నాను. మన ఇద్దరికీ శ్రేయస్సు సమానమే కదా! కాని నీవు భయపడకు. సుఖంగా ఉంటావు. నన్ను నీవు చంపకపోతే నేను రక్షిస్తాను. నాకు ఒక ఉపాయం తోచింది. అది మనిద్దరికీ శ్రేయస్కరం. ఈ ముంగిస, గుడ్లగూబ పాపబుద్ధితో మన ప్రాణాలు హరించడానికి పొంచి ఉన్నాయి. కాని అవి నిన్ను చూసి నన్ను బెదిరించడం లేదు. కాని నాకు భయంతో వణుకు పుడ్తోంది. కాని నీ స్నేహం ఉంటే నాకు భయం ఉండదు. ఎందుకంటే సజ్జనులతో స్నేహం ఏడు మాటలతో ఏర్పడుతుంది. పండితుడివి అయిన నీవు నాకు స్నేహితుడివి అయ్యావు. నీతో కలిసి ఉంటే నాకు ఇక భయము ఉండదు.

ఓ మార్జాలమా! నేను లేకుండా నీవు పాశాన్ని త్రెంచుకోలేవు. నీవు నన్ను తినకుండా ఉంటానని ప్రమాణం చేస్తే నేను నీ పాశాలను కొరికివేస్తాను. చెట్టు పై భాగంలో నీవు ఉన్నావు. క్రింద భాగాన్ని నేను ఆశ్రయించుకొని ఉన్నాను. ఇద్దరం ఈ చెట్టుమీదే ఉంటున్నాం. ఎవరినీ నమ్మని వాడు ఎవరికీ నమ్మకాన్ని కలిగించలేనివాడు నిత్యమూ భయపడుతూ జీవిస్తారు. ధీరులు వారిని మెచ్చుకోరు. అందువలన మన ఇద్దరికీ స్నేహము పెరిగితే చాలా ప్రయోజనం ఉంటుంది. నేను నీకు సహాయం చేస్తాను. నువ్వు నాకు చెయ్యి.''

ఎలుక చెప్పిన ఈ హితకరమైన మాటలను వివేకి అయిన పిల్లి విన్నది. పిల్లి తెలివైనది. చక్కగా మాట్లాడగలదు. అది తన పరిస్థితిని సమీక్షించింది. మంచితనంతో ఎలుకను గౌరవించింది. అది ఎలుకతో ఇలా అంది. ''సౌమ్యుడా! చాలా సంతోషం. నేను జీవించాలని కోరుకుంటున్నందుకు చాలా సంతోషం. ఏది చేస్తే మంచిదో అది చేయి. నేను ఆపదలో ఉన్నాను. అంతకంటే పెద్ద ఆపదలో నువ్వు ఉన్నావు. వెంటనే నాకోసం సహాయం చేయి. నీకు అవసరమైనప్పుడు నేను నీకు పనికి వచ్చేది చేస్తాను. నేను ఈ ఆపద నుండి బయటపడితే నీవు చేసిన పనికి ఉత్తరోత్తరా లాభం ఉంటుంది. నేను నా అభిమానాన్ని విడిచి నీ శరణు కోరుతున్నాను''.

పిల్లి ఈ విధంగా వినయంతో స్నేహంగా మాట్లాడేసరికి ఎలుక అర్థవంతము, హితమూ అయిన మాట ఇలా చెప్పింది - ''నీవు ఔదార్యంతో ఆడిన మాటలు నీ వంటి వారికి తగినవి.

-ఇంకావుంది

నాదయోగికి స్వర నీరాజనం

''వీణావాదన తత్త్వజ్ఞో శ్రుతి జాతి విశారదః
తాల జ్ఞశ్చా ప్రయాసేన మోక్షమార్గం నియచ్ఛతి -యాజ్ఞవల్క్య స్మృతి

నేడు త్యాగరాజస్వామి వర్ధంతి సందర్భంగా....

దైవభక్తి, సత్యము, భూతదయ, సత్ప్రవర్తన, సంపూర్ణ శరణాగతి అద్వైతస్థితి ముఖ్యాంశములుగా, కావ్య పురాణేతిహాసములను మనకు అందించినవారు వాల్మీకి వ్యాస మహర్షులు. భాగవత శిఖామణియై, లోక కల్యాణాన్ని సర్వదా కాంక్షిస్తూ భగవన్నామ సంకీర్తనలతో తరలించవచ్చునని నిరూపించిన పరమ భాగవతోత్తముడు, నారద మహర్షి. సర్వవస్తువుల యందు వాసుదేవ భావనగల్గి త్రికరణశుద్ధిగా దేవుని భజిస్తూ, సర్వులకు దైవభక్తిని బోధిస్తూ తను తరించి ఇతరులను తరింపజేయగల మోక్షసాధనం 'సంగీతం' అని చాటి చెప్పిన వాగ్గేయకారులు- వాసుదేవ వితలుని వాసిగా భజించిన పురందర దాసు, గీత గోవిందాన్నందించిన జయదేవుడు, శ్రీకృష్ణ లీలా తరంగిణిని అందించిన శివనారాయణ తీర్థులు, భక్తిభావాన్ని యోగశాస్త్రాన్వయంతో మనకు దర్శింపజేసిన సదాశివ బ్రహ్మేంద్రులు, ఆర్తితో శరణాగతితో సీతారాములను కీర్తించిన రామదాసు, పద కవితా కమలములతో కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి పాద పద్మములను అర్చించిన తాళ్ళపాక అన్నమయ్య, అమ్మమీద కీర్తనలను అనితర సాధ్యముగా 'శ్యామ కృష్ణ సోదరి' ముద్రతో వెలయించిన కామాక్షీ వరప్రసాది 'లయబ్రహ్మ' శ్యామశాస్త్రి, భావగంభీరమైన కృతులను 'గురు గుహ' ముద్రతో సర్వ దేవదేవతలమీద అందిస్తూ జగన్మాత శ్రీ చక్రార్చనగా నవావరణ కీర్తనలను అనుగ్రహించిన ముత్తుస్వామి దీక్షితులు మున్నగువారు ఈ కోవకు చెందినవారు.

యోగముచేతను, సంగీతముచేతను మోక్షము సాధించుట సులభమని, యోగము కంటె సంగీతావలంబనము చేత తరించుట సులభసాధ్యమని, తన జీవితాన్నే మనకు ఆదర్శంగా చూపి, సద్భక్తి సహిత సంగీత వినీలాకాశంలో ధ్రువతారగా నిల్చిన పరమ భాగవతోత్తముడు- సద్గురు త్యాగరాజ స్వామి.

వాగ్గేయకారులు

''వాచం గేయం చ కురుతే యస్య వాగ్గేయ కారకః'' అనేది వాగ్గేయకారుని నిర్వచనం. తామే రచించి, గానం చేసేవారిని 'వాగ్గేయకారులు' అంటారనేది స్థూలార్థం. సంగీత సాహిత్యాలలో సమాన ప్రజ్ఞ కలవారు ఉత్తమ వాగ్గేయకారులు. అనగా, వారే సాహిత్యాన్ని వ్రాసినారని, వారే సంగీతాన్ని సమకూర్చుకొని, స్వయంగా గానంచేసేవారు వాగ్గేయకారులని వాడుకలో వున్న అర్థం.

సామవేద సారమైన సంగీతానికి, భక్తిరసాన్ని మేళవించి బంగారమునకు తావి అబ్బినదా అన్నట్లుగా, గేయములు, పదములు, తరంగములు, కీర్తనలు, కృతులు అనే సాహితీ సౌరభాలను వెదజల్లిన వాగ్గేయకారులు ఎందరో మహానుభావులు.

రామతారక బ్రహ్మోపాసనముతో నాదోపాసనమును మేళవించి, సప్తస్వర సుందరుల భజించి, ఆరాధించి, ఉపాసించి, సాహిత్యమందు సంగీత సంప్రదాయములను, సంగీత సాహిత్య పొందికను, అర్థవంతముగా మేధాశక్తి సంపన్నముగా, హృద్యంగా ఆర్ద్రతతో ఆర్తిగా రూపొందించి, భావ గాంభీర్యంతో, రామభక్తి నిండారిన అనేక కృతులను వివిధ రాగములలో వెలయించి 'తెలిసి రామచింతన' చేసిన బ్రహ్మ విద్యా సార్వభౌముడు, సంగీత సాహిత్య సమగ్ర సమ్యక సమ్మిళిత సమ్రాట్- సద్గురు నాదయోగి శ్రీ త్యాగరాజస్వామి.

కళాస్రష్ట శ్రీత్యాగరాజస్వామి


పరమాత్మ స్వరూపమును మనస్సునందు లయింపజేసి, భక్తి పారవశ్యంతో రాముని దివ్య సౌందర్యమును కన్నులారదర్శించి ఆ మధురానుభవమునకు కీర్తనాకృతినిచ్చి, భగవంతుని భజనానందమే తరుణోపాయమని సిద్ధాంతీకరించి, స్వరరాగ లయాదులతో భావ గాంభీర్యాన్ని అనుభవించి, గానం చేసేవారికి దైవ సాక్షాత్కారం సాధ్యమని చెబుతూ దృశ్య రాగ చిత్రాన్ని అందించిన కళాస్రష్ట శ్రీ త్యాగరాజస్వామి.

భారతీయ సంగీతానికి ఆత్మస్వరూపులు- శ్రీ త్యాగరాజ స్వామి. నాదోపాసనా సిద్ధితో సాక్షాత్తూ శ్రీరామ సాయుజ్యం పొందిన జీవన్ముక్తుడు శ్రీ త్యాగరాజస్వామి.

మహోన్నతమైన ఆదర్శములతో, గంభీరమైన రాగ భావలయాది చరణ విన్యాసములతో, ముచ్చటగొలిపే తెలుగు నుడికారపు సొంపులతో చక్కని సందేశములతో, శ్రుతి స్మృతి పురాణేతిహాస తాత్పర్యములతో శ్రీరామ మధుర నామమును భజిస్తూ, ఆడుతూ పాడుతూ మనకందించిన త్యాగయ్యగారి కీర్తనలు (కృతులు) అజరామరం.

త్యాగోపనిషత్తులు: త్యాగయ్య కృతులు

ఉపనిషత్తుల సారమే త్యాగయ్యగారి రచనలలో గోచరమవుతుంది. కనుక మహనీయులందరూ వారి కృతులను 'త్యాగోపనిషత్తు'లని వ్యవహరిస్తూ ఉంటారు. ఉదాహరణకు త్యాగయ్యగారి ఒక కీర్తన తీసుకుందాం.



''పరమాత్ముడు వెలిగే ముచ్చట బాగ తెలుసుకోరే హరియట హరుడట సురులట నరులట అఖిలాండకోటులట యందరిలో గగానిలతేజో జల భూమయమగు మృగ ఖగ నగ తరు కోటులలో సగుణములలో విగుణములలో సతతము సాధు త్యాగరాజర్చితుడిలలో వాగధీశ్వరీ రాగం, ఆది తాళ నిబద్ధనలోని అద్భుత కృతి యిది. పరమాత్మ వెలుగు అంతటా నిండి ఉన్నది. ''అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'' అన్నది శృతి. పరమాత్మ వెలుగు అంతటా నిండి వున్నది. హరిహరాది దైవ భేదములు, దేవ మానవ భేదములు కన్పట్టినా, ఉన్నా, అన్నింటా పరమాత్మ చైతన్య ప్రకాశ రూపము సాక్షీమాత్రమై వెలుగుతున్నాడు. పంచభూతములందు మృగ పక్షులలో, చెట్లు లతాదృయందు సైతము అంతర్లీనమై భగవంతుడే వెలుగుతున్నాడు. బంగారు నగలయందు అంతటా బంగారమే నిండి యున్నట్లు, కుండలందు మట్టియే వ్యాపించినట్లు, అంతటను భగవంతుడే నిండి యున్నాడనే తత్త్వమును ఈ కీర్తనలలో విశదపరిచారు- శ్రీ త్యాగరాజ స్వామి. బ్రహ్మోపనిషత్, ఈ భావాన్నే స్పష్టం చేసింది. ''ఏకో దేవః సర్వ భూతేషు గూఢ సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా కర్మాధ్యక్షః సర్వభూతాది వాసః సాక్షీ చేతాకేవలో నిర్గుణశ్చః'' అఖిల సృష్టిలోను నిత్యుడై పరమాత్మ వెలుగొందే ముచ్చటను త్యాగయ్య దర్శించి, మనకు సాక్షాత్కరింపజేసిన త్యాగోపనిషత్. ఈ విషయాన్నే పోతనగారు శ్రీమద్భాగవతంలో ''ఇందు గలడందు లేడని సందేహము వలదు'' అని ప్రహ్లాదుని చేత చెప్పించాడు.

ఉండేది రాముడొకడు ఊరక చెడిపోకే మనసా

''సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చైతి''- సూర్యుడు స్థావర జంగమాత్మకమగు ప్రపంచమునందు అంతర్యామిగా ఉన్నాడు. అంటే ఈ విశ్వమందున్న వారందరిలోనూ వున్నది సూర్యుని చైతన్యమే.. ఒకే చైతన్యం అందరిలోనూ ఉన్నది. కనుక మనమందరం సూర్యభగవానుని ఆత్మస్వరూపులం. నారాయణుడు సూర్యమండల మధ్యమందుడి సర్వ శరీరములందున జీవులకు అధిష్ఠానమై యున్నాడు. నారాయణుడు సమష్టి స్వరూపుడు. జీవులు వ్యష్టిస్వరూపులు. ఈ జగత్తు యొక్క సృష్టి స్థితిలయములు తేజోమయుడైన పరబ్రహ్మ చేతనే కలుగుతున్నాయి. శ్రీరాముని పరబ్రహ్మ స్వరూపునిగా వర్ణించారు త్యాగయ్య. ''రామ ఏవ పరం బ్రహ్మ' అన్నది ఉపనిషద్వాక్యం. అంతర్బాహ్యములందు పరబ్రహ్మ స్వరూపమైన రామరూపము సమన్వయమవుతుంది.

అజ్ఞానం తొలగి జ్ఞాన వెలుగు ప్రకాశించగానే సమిష్టిరూపుడై సర్వజీవులకు అధిష్ఠానమై జగమంతా నిండి వున్న శ్రీరాముడు సూర్య మండలంలో దర్శనమిస్తాడు. ''ఏకం సద్విప్రా బహుధా వదంతి'', ''ఏకమేవా ద్వితీయం బ్రహ్మ'' అనే వేద వాక్కులను దృష్టిలో ఉంచుకొని, పరమాత్మ గాక అన్య వస్తువే లేదని, 'ఉండేడి రాముడొకడే'నని, ఊరక వ్యర్థముగా భ్రమించి చెడవద్దని, హరి కాంభోజిరాగంలో అద్భుతమైన కీర్తనను గానం చేశారు త్యాగయ్య. ఇది వేదోపనిషత్తులు, శ్రీమద్రామాయణ సారమైన ఎన్నికగన్న త్యాగరాజు స్వామి వారి కృతి.

నవవిధ భక్తి మార్గములు

''మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసి'' అన్నాయి నారద భక్తి సూత్రములు. భక్తి, మోక్ష సాధనకు మంచి మార్గం. మోక్షాన్ని పొందటానికి చాలా మార్గాలు చెప్పబడినా, భక్తి మార్గం సులభమయిన మార్గం. అందులోనూ, సద్భక్తి సహిత సంగీతజ్ఞానం, అదే నాదోపాసన మిగిలిన మార్గములకంటె మోక్షమునకు, మంచి మార్గం తేలిక మార్గం. నవవిధ భక్తిమార్గములు నిర్దేశింపబడినాయి. అవి శ్రవణం కీర్తనం స్మరణం పాద సేవనం అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనం. వీటిని పొందుపరుస్తూ త్యాగయ్యగారు ఎన్నో కృతులను వ్రాశారు. ఉదాహరణకు ఒక్కొక్కటి తీసుకుందాం.

శ్రవణం: ''రామకథా సుధారస పానమొక రాజ్యము చేసునే..'' సీతతో లక్ష్మణ భరత శత్రుఘ్నులతో ఇలలో అవతరించిన రామకథ రాజ్యము చేస్తున్నదని, అదే ధర్మఫలముని స్తుందని, రామకథ ధైర్యాన్ని, ఆనందాన్ని సుఖాన్ని యిస్తుందని, మనసు బాధించే కర్మబంధమనే అగ్నిని చల్లార్చే మేఘము అని, కలి దోషాన్ని హరించే రామకథను శ్రవణం చేసి, తరించమని మధ్యమావతి రాగంలోశ్రవణభక్తి సంకేతంగా కీర్తించాడు త్యాగయ్య.

స్మరణం: నరుడై పుట్టినందుకు రామనామ స్మరణ చేయుటే సుఖమని, 'కలౌస్మరణాన్ముక్తి' అని స్మరణ భక్తికి ఉదాహరణగా జనరంజని రాగంలో 'స్మరణే సుఖము రామనామ స్మరణే సుఖము నరుడై పుట్టినందుకు రామా' అన్న కీర్తనను అనుగ్రహించారు త్యాగరాజస్వామి.

పాదసేవనం: 'శ్రీరామపాదమా నీ కృప చాలునే చిత్తానికి రావే.' ఇది శ్రీరామ పాదస్తుతి. బ్రహ్మ సనక సనందనులు దేవేంద్రుడు నారదాదులు పూజించిన శ్రీరామపాదం. శ్రీరాముని పాదసేవా దురంధరుడు, ఆంజనేయుడు. ఇది త్యాగయ్య అమృతవాహిని రాగంలో పాదసేవన భక్తికి సూచితంగా అందించారు.

అర్చనం: ''చల్లరే రామచంద్రునిపై పూలు సొంపైన మనసుతో ఇంపైన బంగారు గంపలతో మంచి చంపకములను..'' అన్న కీర్తనలో అర్చనభక్తి మార్గాన్ని విశేషంగా విశదీకరించిన త్యాగయ్య, పరమ భక్తశిఖామణి.

వందనం:''వందనము రఘునందనా సేతు బంధనా భక్తచందనా రామ'' అనే సద్గురు త్యాగరాజస్వామి వారి శహనరాగ కీర్తన, వందనా భక్తి మార్గానికి స్ఫూర్తినిస్తుంది. ఇది అయ్యవారి 'ప్రహ్లాద భక్తి విజయము' అనే సంగీత రూపకములోనిది, హృద్యమైనది.

దాస్యం: ''బంటురీతి కొలువియ్యవయ్య రామ.. రోమాంచమనే ఘన కంచుకము, రామభక్తియనే ముద్ర బిళ్ళయును.. రామ నామమనే వర ఖడ్గమిడ్చి రాజిల్లునట్లు త్యాగరాజునికి''. భగవద్భక్తికి సేవాధర్మము ముఖ్యమైనది. అందులో దాస్యము విశిష్టమైనది. శ్రీరామచంద్రుని దర్బారులో రామబంటుగా కొలువును అనుగ్రహించమని వేడుకుంటున్నారు. ఎప్పుడూ శ్రీరాముని కొలువులో, ఆయన సన్నిధిలో జవాను (బంట్రోతు) ఉద్యోగమిప్పించమని అడుగుతున్నారు, హంసనాదం రాగకీర్తనలో. ఇది దాస్యభక్తి మార్గానికి ఉదాహరణగా నిలుస్తుంది.

సఖ్యం: ''చెలిమిని జలజాక్షుగంటే చెప్పరయ్య మీరు పలుమారు మ్రొక్కెదను దయతో పలుకరయ్యా ఎంతో..'' ప్రహ్లాదుని నాగపాశములతో కట్టి, రాక్షస భటులు, సముద్రములో పడవేస్తే, సముద్రుడు ప్రహ్లాదునికి స్వాగతం పలికి, సమస్త ఉపచారములు చేసినాడు. ప్రహ్లాదుడు హరిని చూడాలనే కుతూహలంతో వున్నాడు. మునులందరూ ఈ వార్త విని అక్కడికి వచ్చారు. వారిని హరి జాడ తెలుపమని ప్రార్థిస్తున్నాడు ప్రహ్లాదుడు. ఇది 'ప్రహ్లాద భక్తి విజయము' అనే సంగీత రూపకములోనిది. ప్రహ్లాద విజయం అనకుండా, త్యాగయ్య 'ప్రహ్లాద భక్తి విజయం' అని చెప్పటం వలనే భక్తికి విజయంగా తేల్చారు. అది ఎవరికి ఉంటే, వారు జయాన్ని పొందుతారు అనేది వారి దృక్పథం. యదుకుల కాంభోజి రాగంలో సఖ్య భక్తి మార్గాన్ని రమణీయంగా మనకందించారు సద్గురు త్యాగరాజస్వామి.

ఆత్మనివేదనం:జీవులు భగవంతుని ఆత్మస్వరూపులు. కనుక జీవాత్మలందరును, పరమాత్మకు స్వతస్సిద్ధముగా దాసులు అనే విషయాన్ని ''నీవాడనేగాన నిఖిల లోక నిదాన నిమిష మోర్వగలనా..'' అన్న సారంగ రాగ కీర్తనలో ఆత్మ నివేదన భక్తి మార్గాన్ని వివరించారు శ్రీ త్యాగరాజస్వామి.

జగదానందకారకము

రాముడు పరాత్పరుడు. సీత పరాప్రకృతి. వారి అనుబంధం సహజసిద్ధం, సర్వలోక రమణీయం. చేతనాచేత జీవరాశికి ప్రతీక సీత. ఆత్మనిష్ఠకు మారుపేరైన సీత, సుఖ దుఃఖములకు అతీతముగా నిలిచి ''రామమేవాను పశ్యతి' అని యగాద్వైత స్థితిలో, రామునే ఏకాగ్రతతో దర్శించిన విజ్ఞాన జ్యోతి. భగవంతుని జీవుడు ఆశ్రయించటం కల్యాణం, మంగళప్రదం, ఆనందదాయకం. రాముడు పరబ్రహ్మము, సీత మోక్షలక్ష్మి. రాముడు తపస్వి, సీత తపస్సిద్ధి. సీతారాములు పుణ్యదంపతులు. ఆ కల్యాణ దంపతుల స్మరణము 'జగదానందకారకము' అని ఉదాత్తంగా గంభీరమైన పదజాలంతో విశ్వమంతా పంచభూతాత్మకమయి యున్నట్లు, ఉపనిషత్తులు, వేదములు, పురాణములు, భగవద్గీత, బ్రహ్మ సూత్రములలోని ఆధ్యాత్మిక విషయములను హరి హరాద్వైత భావముతో, సంగీత సాహిత్య ప్రపంచమంతయూ యిమిడియున్న 'ఘనరాగ పంచరత్న కీర్తనలను, నాట గౌళ ఆరాభి వరాళి శ్రీరాగములలో ఆదితాళ నిబద్ధనలో భక్తిరస సమ్మిళితముగా అందించి పూర్ణత్వ మొందిన శ్రీ త్యాగరాజస్వామి-బ్రహ్మ విద్యా సార్వభౌముడు.

త్యాగరాజస్వామి జీవితం -శ్రుతి వివరణం

శ్రీరామబ్రహ్మము, సీతాంబ పుణ్యదంపతులకు సర్వజిత్ నామ సంవత్సర మేషమాసం అనగా వైశాఖ మాసం శుద్ధ షష్ఠీ సోమవారం (1783) మూడవ సంతానంగా జన్మించారు -కాకర్ల త్యాగబ్రహ్మం. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కంభం దగ్గర కాకర్ల గ్రామస్థులు. జీవనోపాధికై వారు తమిళ రాష్ట్రానికి వలస వెళ్లటంతో, త్యాగబ్రహ్మం జీవితం అక్కడే గడిచింది.

తల్లి నిత్యము పాడుకొను నారాయణ తీర్థ, రామదాస, పురందరదాసాది వాగ్గేయకారుల కీర్తనలతో ప్రభావితుడై, ఏక సంథాగ్రాహియై, అచిరకాలంలోనే కృష్ణయజుర్వేద ఘనాంతము అధ్యయనము పూర్తిచేసి, సంస్కృత సాహిత్య పటిమతో శాస్త్రములందునూ పరిచయము గడిచి, జ్యోతిష విజ్ఞానవంతులై పంచాంగ గణితము చేయు శక్తి సామర్థ్యములు కలిగిన వాడైనాడు. అంతేకాదు మంత్రశాస్త్ర కోవిదుడు కూడా. తంజావూరు ప్రభుత్వ ఆస్థాన సంగీత విద్వాంసులు శ్రీ శొంఠి వేంకట రమణయ్యగారి వద్ద సంగీత విద్యనభ్యసించి, సంగీత శాస్త్ర మర్మములను గ్రహించాడు. పదునెనిమిదవ ఏట విద్యలను పూర్తిచేసి, వివాహమాడి, తండ్రిగారి తదనంతరం వారి శ్రీరామ పంచాయతనం పిత్రేయమైన ఆస్తికాగా, దైవారాధనతో జీవ యాత్ర ఉంఛవృత్తితో సాగించాడు త్యాగయ్య.

శ్రీరామ కృష్ణానంద యతీశ్వరుల దర్శనమయి, వారుపదేశించిన రామతారక మంత్రమును తొంబది యారుకోట్లు దీక్షగా ఆర్తితో చేసి ఫలసిద్ధుడర, ప్రాప్తించిన వాక్శుద్ధిని విశ్వ మానవ కల్యాణానికి ఉపకరించిన ఆదర్శవంతుడు -శ్రీ త్యాగరాజస్వామి. సర్వస్వము రాముడే అని విశ్వసించి, సర్వుల యందు రామునిగాంచి, అద్వైత సిద్ధినొంది, ఆదర్శవంతుడై, జీవన్ముక్తుడైన త్యాగరాజస్వామి, భద్రగిరిపై నెలకొన్న రాముని ''గిరిపై నెలకొన్న రాముని గురి తప్పక గంటి'' అని శహనరాగంలో ఆర్తితో కీర్తించాడు. 1847 పుష్యశుద్ధ ఏకాదశి వేకువ జామున భద్రాచల రాముడు దర్శనమిచ్చి ''పది పూటలలో కరుణింతు''నని అనుగ్రహించగా, పుష్యశుద్ధ పూర్ణిమనాడు త్యాగయ్య ఆపత్సన్యాసము స్వీకరించి ''త్యాగరాజస్వామి' సంకేతుడయినాడు. పుష్యబహుళ పంచమినాడు, వేకువ జామునే స్నానానుష్ఠానములను నిర్వర్తించుకొని, భక్తులు, శిష్యులు శ్రీరామ తారకమంత్ర జపము చేస్తుంటే పది పూటలలో (రోజుల్లో) కరుణింతునన్న ''పరితాపముగని యాడిన పలుకులు మరచితివో'' అని మనోహరి రాగంలో కీర్తించి, భద్రగిరీశుడు తనకు స్వప్నమందు దర్శనమిచ్చి అనుగ్రహించిన మాటలను జ్ఞప్తి చేస్తూ, శ్యామలవర్ణ సూచితమయిన త్రిగుణాత్మక ప్రకృతియే ఉపాధి కలవాడగుటచే శ్యాములుడైన శ్రీరామచంద్రుని ''శ్యామ సుందరాంగ..'' అంటూ ధన్యాసిరాగంలో నిండు మనసుతో కీర్తిస్తూ ''సకల శక్తియూ నీవేరా'' త్యాగరాజు నీకువేరుగాదని పలుకుతూ గంభీర సమన్వయముతో కీర్తించి, సమాధి నిష్ఠతో రామునియందు విలీనమైన బ్రహ్మనిష్ఠుడు -శ్రీ త్యాగరాజస్వామి.సర్వమానవ సౌభ్రాత్రతతో విశ్వమానవ కల్యాణాన్ని వీక్షించి, నాటికి నేటికి ఏనాటికి నాదోపాసన చేసే వారికి, అన్నవస్త్రములకు లోటులేని అక్షయ ప్రణాళికలను అందించుటయే గాక, మోక్షమార్గాన్ని కూడా చూపించిన, అనవరత స్మరణీయుడు, బ్రహ్మవిద్యా సార్వభౌముడు నాదయోగి సద్గురు శ్రీ త్యాగరాజస్వామి.

-పసుమర్తి కామేశ్వర శర్మ
9440737464

ఆంధ్రభూమి


చిత్రభూమి


జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

శుక్రవారం 25, జనవరి 2019

ఈయనే.. నంబి

ఇస్రో రాకెట్ తయారీ విభాగంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రసిద్ధ శాస్త్రవేత్త నంబి నారాయణ్ జీవిత చరిత్ర ఆధారంగా మాధవన్ సినిమా చేస్తుండటం తెలిసిందే. కొంతభాగం అనంత్ మహదేవన్ దర్శకత్వంలో చిత్రీకరణ జరిగింది. అయితే దర్శకత్వ బాధ్యతలనుంచి ఆయన తప్పుకోవడంతో ఈ చిత్రానికి మాధవన్ స్వయంగా దర్శకత్వం వహిస్తున్నాడు. సిమ్రాన్ హీరోయిన్‌గా నటిస్తున్న మూవీ ఇప్పటికే షూటింగ్‌లో కీలకభాగం పూర్తైంది. నంబీ మేకోవర్‌లో మాధవన్ ఫొటోలను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. 1994లో ఇస్రో నేపథ్యంలో నంబి నారాయణ్ ఎదుర్కొన్న నేర సంఘటన ఇతివృత్తంగా చిత్రాన్ని రూపొందిస్తుండటం తెలిసిందే.







మాస్ టైటిల్ రేపే

మాస్ మహారాజా రవితేజ, విఐ ఆనంద్ దర్శకత్వంలో ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నూతన చిత్రం మొదలుపెట్టబోతున్నారు. ప్రముఖ నిర్మాత రామ్ తళ్ళూరి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా అనగానే ట్రేడ్ వర్గాల్లో అప్పుడే ఆసక్తిమొదలైంది. జనవరి 26న రిపబ్లిక్‌డే, రవితేజ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం పేరుని అధికారికంగా ప్రకటించడంతోపాటు టైటిల్ లోగోని లాంచ్ చేయనున్నారు. రవితేజకు జోడిగా ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. త్వరలోనే ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ని ప్రారంభించబోతున్నట్లుగా నిర్మాత రామ్ తళ్లూరి తెలిపారు.

నాగ్.. వెరీ స్మార్ట్



రాజుగారి గది-2, ఆఫీసర్, దేవదాస్ చిత్రాలు బాక్సాఫీసువద్ద అంచనాలకు చేరువకాలేకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ఎక్కువ ఫోకస్ పెట్టాడు నాగ్. చాలాకాలంగా వినిపిస్తున్నట్టుగా బంగార్రాజు టైటిల్ పాత్రలో ఆయన నటించబోయే చిత్రాన్ని సెట్స్‌పైకి తెచ్చేందుకు తెర వెనుక సన్నాహాలు జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం వచ్చిన సోగ్గాడే చిన్నినాయన చిత్రంలో బంగార్రాజు పాత్రలో అదరగొట్టాడు నాగార్జున. ఎట్టకేలకు స్క్రిప్టు కొలిక్కిరావడంతో ఈ చిత్రానికి రంగం సిద్ధమైందని, మార్చిలో షూటింగ్ ప్రారంభిస్తారని టాక్. కల్యాణ్ కృష్ణ దీనికి దర్శకత్వం వహించనున్నారు. దాంతోపాటు నాగార్జున మరో చిత్రాన్నీ లైన్‌లో పెడుతున్నాడట. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడని, ఆ చిత్రం స్క్రిప్టు పనులు సాగుతున్నట్టు నాగార్జున పలు సందర్భాల్లో చెప్పాడు కూడా. గతంలో వచ్చిన మన్మధుడు చిత్రానికి సీక్వెల్‌గా మన్మధుడు-2 పేరిట ఈ చిత్రం ఉంటుందని నాగ్ చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల నాగార్జునకు స్క్రిప్ట్‌ను రాహుల్ రవీంద్రన్ వినిపించారని, వెంటనే ఓకే చెప్పాశారని టాక్. మొత్తానికి వరుసగా రెండు చిత్రాలు చేయడానికి సిద్ధమైపోతున్నాడు నాగ్.



బోర్డర్‌లో మొదలెట్టాడు


యాక్షన్ హీరో గోపీచంద్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు తిరు దర్శకత్వంలో రాబోతున్న సినిమా షూటింగ్ సోమవారం ఇండియా -పాకిస్తాన్ బోర్డర్ జైసల్మేర్‌లో ప్రారంభమైంది. హైఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ భారీ ఫైట్ సీక్వెన్స్‌తో మొదలవ్వగా, యాక్షన్ డైరెక్టర్ సెల్వన్ ఆధ్వర్యంలో ఈ యాక్షన్ ఎపిసోడ్స్‌ని చిత్రీకరిస్తున్నారు. యాభై రోజులపాటు జరిగే ఈ షెడ్యూల్‌లో రాజస్థాన్, న్యూఢిల్లీ వంటి ప్రదేశాల్లో చిత్రీకరణ జరపనున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, వెట్రి పళనిస్వామి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.18గా అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వేసవి కానుకగా మేలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

మలయాళ పరిశ్రమకు స్వాగతం

ప్రియాప్రకాష్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'లవర్స్‌డే' పేరుతో సుఖీభవ సినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది. ఎ.గురురాజ్, సిహెచ్.వినోద్‌రెడ్డి నిర్మాతలు. ఒమర్ లులు దర్శకుడు. షాన్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆడియో సీడీలను స్టైలిష్ స్టార్ అల్లుఅర్జున్ విడుదల చేశారు. ఈ సందర్భంగా.. దర్శకుడు ఒమర్ లులు మాట్లాడుతూ.. 'మా సినిమాను ఆశీర్వదించడానికి వచ్చిన స్టైలిష్ స్టార్‌గారికి థాంక్స్. మలయాళంలో ఎంతమంది స్టార్స్ ఉన్నా.. మా వీడియో ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్‌గారు మాత్రమే షేర్ చేశారు. చాలామంది కొత్తవాళ్ళను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. ప్రేక్షకుల ఆశీర్వాదం సినిమా రిలీజ్ తర్వాత ఇలాంటి అభిమానాన్ని కనపరచాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ప్రియాప్రకాష్ మాట్లాడుతూ.. ''అల్లు అర్జున్ గారంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి స్టేజ్‌పై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఆయన్ను కలుసుకున్నందుకు థాంక్స్. ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ థాంక్స్ అన్నారు. నిర్మాత ఎ.గురురాజ్ మాట్లాడుతూ.. ''నేను బన్నిగారికి పెద్ద అభిమానిని. ఆయనకు థాంక్స్. అలాగే చాలామంది నన్ను సపోర్ట్ చేయడానికి వచ్చారు. నటుడు కావాలనుకున్న నేను అప్పట్లో అవకాశం, అదృష్టం లేక నటుడ్ని కాలేకపోయాను. తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చి ఈ స్థాయికి ఎదిగాను. సీతారామరాజుగారు, సురేష్‌గారి సపోర్ట్‌తో ఈ సినిమా అవకాశాన్ని దక్కించుకున్నాను. అలాంటి సమయంలో నా మిత్రుడు వినోద్‌రెడ్డిగారు సపోర్ట్‌చేశారు' అన్నారు. స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ.. ''సౌతిండియన్ సినిమాల్లో నేషనల్ వైడ్‌గా, ఇంటర్నేషనల్ వైడ్‌గా వైరల్ అయిన వీడియోస్‌లో కొలవెరి డీ... బాహుబలిలో హుకిల్డ్ కట్టప్ప... ఈమధ్యకాలంలో ఆ రేంజ్‌లో వైరల్ అయిన వీడియోస్‌లో ఒరు ఆడార్ లవ్. నాకు సౌతిండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషన్‌లో సౌతిండియన్ యాక్టర్ అని రాసుకుంటాను. నేను దక్షిణాదికి చెందిన వాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో. పెరిగింది హైదరాబాద్‌లో.. అలాగే మలయాళంవాళ్లు, కర్ణాటక వాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌతిండియన్‌నే. ఈ సినిమా ఫంక్షన్స్‌కు నేను రావడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి... నా సినిమాలను కేరళవాళ్లు వాళ్ల సొంత సినిమాల్లాగా ఆదరిస్తున్నారు. ఓ లాండ్‌మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేసినట్టుగా ఉండాలి కదా అని వచ్చాను. ఈ సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీని వెల్‌కం చేస్తున్నాను అన్నారు.




దగ్గరికొచ్చిన యాత్ర



నీళ్లుంటే కరెంటుండదు. కరెంటుంటే నీళ్లుండవు. రెండూవుండి పంట చేతికొస్తే సరైన ధర పలకదు. అందరూ రైతే రాజంటారు. కూడూ గూడూ గుడ్డా నీడాలేని రాచరికం మాకొద్దయ్యా. మమ్మల్ని రాజులుగా కాదు, రైతులుగా బతకనివ్వండి చాలు.. అని ప్రతి రైతూ గొంతెత్తి అరుస్తున్న సమయమది. ఎవరైనా ఆదుకుంటారా? అని రైతన్న ఎదురుచూసిన టైంలో ఒక గొంతుక వినిపించింది. నేను విన్నాను. నేను ఉన్నాను' అంటూ. ఆ పిలుపు పేదలవైపు నిలబడింది. నాయకుడిగా మనకేంకావాలో తెలుసుకున్నాం. కానీ, జనానికేంకావాలో తెలుసుకోలేకపోయాం -అంటూ అధిష్టానాన్ని సైతం లెక్కచేయక పేదల కష్టాలు వినేందుకు కడప గడప దాటి ప్రజా యాత్ర మొదలైంది. అది పాదయాత్రగా ప్రాచుర్యం పొందింది. అలా అడుగులేసిన జననేత ఎవరు? -దివంగత నేత ఉమ్మడి ఏపీ సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ముఖ్య ఘట్టాలతో తెరకెక్కిన చిత్రమే దానికి సమాధానం. దర్శకుడు మహి వి రాఘవ్ దర్శకత్వంలో 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ తెరకెక్కించింది. ఫిబ్రవరి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న చిత్రం సెన్సారు నుంచి క్లీన్ యు సాధించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ మడమతిప్పని మహానేత వైఎస్ జీవితంలో అతి ముఖ్యమైన పాదయాత్ర ఘట్టం ఇతివృత్తంగా సినిమా నిర్మించాం. మళయాల మెగాస్టార్ మమ్ముట్టి వైఎస్ఆర్ పాత్రకు ఎలా వన్నె తెచ్చారన్నది ఇప్పటికే ట్రైలర్స్‌లో చూశాం. బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. పాత్రల భావోద్వేగ చిత్రీకరణతో తెలుగు ప్రజలు తప్పక చూడాల్సిన చిత్రంగా తీర్చిదిద్దాం. ఆదర్శనీయమైన వైఎస్ పోరాట పటిమ తరతరాలకు నిలిచిపోవాలన్న సంకల్పంతో రాజకీయ ప్రజ్ఞాశాలి పాదయాత్రను యథాతథంగా తెరకెక్కించాం. తెలుగు, తమిళ, మళయాల భాషల్లో ఒకేసారి ఫిబ్రవరి 8న విడుదల చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అన్నారు.

విలన్‌గా వరుణ్



డీజే చిత్రం తరువాత చాలా గ్యాప్ తీసుకున్న డైరెక్టర్ హరీష్ శంకర్ ఆ చిత్రం తరువాత దిల్‌రాజు బ్యానర్‌లో దాగుడు మూతలు అనే చిత్రాన్ని తెరకెక్కించాలని ప్రయత్నించాడు కానీ ఎందుకో ఆ ప్రాజెక్ట్ వర్క్‌అవుట్ కాలేదు. ఇక ఎట్టకేలకు తన కొత్త చిత్రాన్ని సెట్స్‌మీదకు తీసుకెళ్లడానికి రెడీ అవుతున్నాడు ఈ డైరెక్టర్. కోలీవుడ్‌లో సూపర్‌హిట్ అయిన జిగర్తండా చిత్రాన్ని హరీష్ తెలుగులో రీమేక్ చేయనున్నాడు. ఇక ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ ప్రతి నాయకుడి పాత్రలో నటించనుండగా నాగశౌర్య హీరోగా నటించనున్నాడు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మించనున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రారంభంకానుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.

శృంగార తారగా...!



వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ మంచి గుర్తింపును తెచ్చుకున్న సీనియర్ నటి రమ్యకృష్ణ ఈసారి ఎవరూ ఊహించని పాత్రలో నటిస్తుంది. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌లో 'సూపర్ డీలక్స్' చిత్రంలో శృంగార తార (పోర్న్‌స్టార్)గా కనిపించనుందట. అయితే ఈ పాత్రకు మొదటగా మరో సీనియర్ హీరోయిన్‌ను తీసుకుందామనుకున్నాడట డైరెక్టర్. అది వర్క్‌అవుట్ కాకపోయేసరికి రమ్యకృష్ణను ఓకే చేశారని సమాచారం. 2004లో వచ్చిన సునామి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, సమంత, ఫహద్ ఫాసిల్, మిస్కిన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్న చిత్రానికి పిఎస్ వినోద్, నిరవ్ షా సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కుమార్‌రాజా తెరకెక్కిస్తున్న చిత్రం మూడుగంటల నిడివితో ప్రేక్షకులముందుకు రానుంది.



తొలి పాట నీకోసం

ప్రేమకథలు ఎన్నిసార్లు చెప్పినా బోర్‌కొట్టదు. ట్రెండ్‌కు తగ్గట్టుగా అప్డేట్ అవుతూ దర్శకులు కూడా ఈ కథలను నవతరానికి నచ్చేలా రాస్తున్నారు తీస్తున్నారు. అలా న్యూఏజ్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న చిత్రం 'నీకోసం'. రెండు జంటల మధ్య ప్రేమకథను ఈతరానికి నచ్చేలా తెరకెక్కుతోన్న సినిమా ఇది. ఎంటర్‌టైన్‌మెంట్ తగ్గకుండానే ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోన్న ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇక తాజాగా నీకోసం చిత్రంలోని తొలి పాటను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతులమీదుగా విడుదల చేశారు. 'తొలి తొలిగా' అంటూ సాగే ఈ పాట విన్న వెంటనే భరద్వాజ చాలా బావుందని మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. నీకోసం సినిమా యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారాయన. లవ్‌స్టోరీలో ఎమోషన్‌కు ఎప్పుడూ ఎక్కువ స్కోప్ ఉంటుంది. అలాంటి ఎమోషనల్ టచెస్‌తోపాటు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంటుందీ చిత్రంలో. ఇది ప్రేమకథే అయినా అన్నివర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉంటాయి. ఇక తీర్థసాయి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అల్లూరమ్మ (భారతి) నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అవినాష్ కోకటి దర్శకుడు. ఇప్పటికే టాకీపార్ట్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్స్ వర్క్స్ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలూ పూర్తిచేసి వచ్చే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది యూనిట్.



సుబ్రహ్మణ్యపురం దర్శకునితో



యువ కథానాయకుడు సందీప్ కిషన్, 'సుబ్రహ్మణ్యపురం' చిత్రంతో విమర్శకుల మెప్పుపొందిన సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో క్రీడా నేపథ్యంలో ఒక సినిమా చేయబోతున్నారు. భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలు గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునిక కాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతో రూపొందించే చిత్రానికి నిర్మాత 'కార్తికేయ'లాంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్. మిగిలిన నటీనటుల మరియు సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియచేస్తారు.

లావణ్యా లాఘవం

అందాల రాక్షసితో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన లావణ్య త్రిపాఠి, తర్వాత పలు చిత్రాల్లో నటించినా ఆశించిన బ్రేక్ మాత్రం రాలేదు. అంతరిక్షంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న లావణ్యానికి -అప్పుడూ నిరాశే మిగిలింది. అందం చందం మెండుగావున్న లావణ్యకు -అవకాశాలు మాత్రం దూరంగానే ఉండిపోవడంతో గ్లామర్ ప్రయోగానికి తెరలేపుతోందట. అందులో భాగంగా లేటెస్ట్ ఫొటో షూట్ పిక్‌ను పోస్ట్ చేసింది. అవకాశమిస్తే అందాల ప్రదర్శనకు రెడీ అన్న సంకేతాన్ని లావణ్య ఇలా వదిలిందంటూ ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.